ప్రజాశక్తి
మంగళవారం 13 డిసెంబర్ 2022
5
కర్నూలు



రైతులకు 'మాండూస్' దెబ్బ

- ఎడతెరపి లేకుండా కురుస్తున్న వర్షం - పలు పంటలకు తీవ్ర నష్టం

ప్రజాశక్తి-కర్నూలు ప్రతినిధి

ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా రైతులకు మాండూస్ దెబ్బ తగులుతోంది. ఎడతెరపి లేకుండా వర్షం కురుస్తుండటంతో ఓ వైపు పొలాల్లోని పంట నేలకొరగగా మరో వైపు కల్లాల్లోని ధాన్యం పాడయింది. ఇలా మాండూస్‌తో జిల్లా రైతులు తీవ్రంగా నష్టపోతున్నారు...


ఎమ్మిగనూరు మండలంలో తడిసిన మిరప పంట

ఉమ్మడి కర్నూలు జిల్లాలోని రైతులను మాండూస్ తుపాను వణికిస్తోంది. చిరు జల్లుల నుంచి మోస్తరు వర్షంతోపాటు ఈదురు గాలులు వీస్తుం డటంతో పంటలు దెబ్బతింటున్నాయి. పలు ప్రాంతాల్లో మిరప రైతులు కాయలు కోసి కల్లాల్లో ఆరబెట్టారు. ఈ సమయంలో వర్షం పడటంతో తడిసి ముద్దయింది. కళ్ల ముందే దిగుబడులు తడిసిపోవడంతో పలువురు కన్నీళ్లు పెట్టుకున్నారు. కర్నూలు జిల్లాలో 6,74,864, నంద్యాల జిల్లా పరిధిలో 82,224 ఎకరాల్లో పత్తి సాగైంది. ఇప్పటికే ఒకటి, రెండుసార్లు పత్తి తీయడం పూర్తైంది. మూడో విడత పత్తి తీసేందుకు సిద్ధ మవుతున్న సమయంలో వర్షం పడటంతో తడిసి పనికిరాకుండా పోతోంది. ఏటా నవంబరు ఆఖరు, డిసెంబరులో పడుతున్న వర్షాలతో అన్నదాతలు నష్టపోతూనే ఉన్నారు. జిల్లాలోని కొన్ని ప్రాంతాల్లో మిరప పంట 70 నుంచి 90 రోజుల మధ్యలో ఉంది. ఈ దశలో వర్షం కొనసాగితే భూమిలో తేమ శాతం పెరిగి మొక్కకు ఆహారం తీసుకునే శక్తి తగ్గిపోతుంది. ఫలితంగా దిగుబడులపై ప్రభావం పడుతుంది. కాయలు తెల్లగా మారిపోయే ప్రమాదముంది. ఖరీఫ్ సీజన్లో రైతులు మొక్కజొన్న సాగు చేయగా ప్రస్తుతం నూర్పిడి చేసి కల్లాల్లో ఆరబెట్టారు. ఈ దశలో వర్షం రావడంతో తడిసిపోయాయి. నాణ్యత దెబ్బతినడంతోపాటు వాటిని నిల చేసేందుకు రైతులు ఇబ్బందులు పడుతు న్నారు. రబీ సీజన్లో నవంబరు రెండో వారం నుంచి ఉమ్మడి జిల్లాలో మొక్క జొన్న సాగు మొదలైంది. కొందరు తొలివారంలో విత్తనాలు నాటారు. ఈ పరిస్థితుల్లో పొలాల్లో నీరు నిలిస్తే మొక్కలు చనిపోతాయని పలువురు ఆవేదన చెందుతున్నారు. చేతికొచ్చిన వరి పంట కోత కోసుకోలేక, కోసిన వరి ధాన్యం కల్లాల్లో ఉండి తడవకుండా పట్టాలు కప్పుకుంటూ రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. పంట చేతికొచ్చే సమయంలో మాండూస్ తుపాను రావడంతో రైతులు దిక్కుతోచని స్థితిలో పడ్డారు. ఆరుగాలం కష్టపడి పని చేస్తే నోటికాటి వచ్చిన పంట తుఫాను దెబ్బకు దెబ్బతిందని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

20 మండలాల్లో వర్షం..

కర్నూలు జిల్లా వ్యాప్తంగా సోమవారం 20 మండలాల్లో మోస్తరు వర్షం కురిసింది. ఆదివారం రాత్రి నుంచి సోమవారం సాయంత్రం వరకూ ఎడతెరపి లేకుండా వర్షం కురుస్తూనే ఉంది. అత్యధికంగా కోసిగి మండలంలో 9.4 మిల్లీమీటర్లు, అత్యల్పంగా కోడుమూరు, హాళహర్వి, తుగ్గలి మండలాల్లో 0.6 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదైంది. కర్నూలు రూరల్ మండలంలో 8.6, ఆస్పరి మండలంలో 6.4, పెద్దకడబూరు మండలంలో 5.2, కర్నూలు అర్బన్ మండలంలో 4.8, ఓర్వకల్లు, ఎమ్మిగనూరు, సి.బెళగల్ మండలాల్లో 4.2, నందవరం మండలంలో 3.4 మిల్లీమీటర్ల వర్షం కురిసింది. కల్లూరు మండలంలో 3.2, వెల్దుర్తి మండలంలో 3, ఆదోని మండలంలో 2.6, దేవనకొండ మండంలో 2.4, కౌతాళం మండలంలో 2, కృష్ణగిరి, గూడూరు మండలాల్లో 1.6, హొళగుంద మండలంలో 1.2 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదైంది. జిల్లా వ్యాప్తంగా సరాసరిన 2.7 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదైంది.

రైతులకు అపార నష్టం...

ప్రజాశక్తి-ఎమ్మిగనూరు

మాండూస్ తుపాను వల్ల రైతులకు అపార నష్టం వాటిల్లింది. ఎమ్మిగనూరు నియోజకవర్గంలోని ఎమ్మిగనూరు, నందవరం, గోనెగండ్ల మండలాల్లో భారీగా వర్షం కురవడంతో వేలాది ఎకరాల మెరప, వరి, పత్తి,ఉల్లి పంటలు నాశనమయ్యాయి. చేతికి వచ్చిన పంట దిగుబడి వర్షానికి తడిసి పోయింది. కళ్ళాలలో ఆరబోసిన మెరప తడిచి రంగు మారిపోయింది. నియోజకవర్గంలో ప్రధానంగా పత్తి, మిరప, ఉల్లి, వరి, వేరు శనగ, మొక్కజొన్న పంటలు వేస్తారు. వర్షం దాటికి ఆ పంటలు దెబ్బతిన్నాయి. ఎమ్మిగనూరు మండలం పార్లపల్లికి చెందిన కురువ వీరనాగమ్మ ఎకరా ఉల్లి సాగు చేసి దిగుబడి రాక రూ.70 వేలు అప్పు అయింది. 4 ఎకరాల్లో పత్తి వేసి నకిలీ విత్తనాలు వలన పంట దిగుబడి రాలేదు. దాదాపు రూ.2 లక్షలు అప్పు అయినట్లు ఆమె తెలిపింది. ఇప్పుడు వేసిన మిరప పంటతోనైనా అప్పులు తీరుతాయోనని నమ్మకం ఉండేదని, తుపాను వల్ల మళ్లీ పోయామని తెలిపింది. రాష్ట్ర కేంద్ర ప్రభుత్వాలు స్పందించి నష్టపోయిన రైతులకు పంట నష్టరిహారం ఇవ్వాలని కోరుతున్నారు.


వీడియో కాన్ఫరెన్స్‌లో మాట్లాడుతున్న కలెక్టర్ కోటేశ్వర రావు

నాడు-నేడు పనులు వేగవంతం చేయాలి

- కలెక్టర్ పి.కోటేశ్వర రావు

ప్రజాశక్తి -కర్నూలు కలెక్టరేట్

మనబడి నాడు నేడు పనులను వేగవంతంగా పూర్తి చేయాలని కలెక్టర్ పి.కోటేశ్వరరావు ఆదేశించారు. సోమవారం సాయంత్రం ఆయన కలెక్టరేట్లో నుండి మండల స్థాయి అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ హౌసింగ్ అంశంపై సమీక్ష నిర్వహిస్తూ వివిధ దశల్లో ఉన్న నిర్మాణాలకు ముందుగా జియోట్యాగింగ్ చేయించి నాన్ స్టార్టెడ్ నుంచి బేస్మెంట్ లెవెల్ కు తేవాలన్నారు. పురోగతి సాధించడానికి పత్తికొండ, కర్నూలు ఆర్డీఓలు పిఎం గ్రామీణ్‌కు సంబంధించి ఇంజినీరింగ్ అసిస్టెంట్లు లాగిన్‌లో ఉన్నవి లబ్ధిదారుల నుండి ఆధార్, బ్యాంకు ఖాతాలు , తదితర వివరాలు తెప్పించుకొని ఎంపిడిఓలు పూర్తి చేయించాలన్నారు. చెత్త తయారీ కేంద్రాల నిర్మాణాననికి సంబంధించి స్థల సమస్యలు పరిష్కరించి షెడ్ ఏర్పాటు చేయించి గ్రౌండింగ్ చేసేలా చర్యలు తీసుకోవాలన్నారు. డ్వామాకు సంబంధించి లేబర్ రేట్ కొన్ని మండలలో చాలా తక్కువ ఉందని, దానిని ఎక్కువగా జెనరేట్ చేయడం వల్ల జిల్లా ఉన్నత స్థానంలో ఉంటుందన్నారు.

ఓటర్ల వివరాలు పక్కాగా పరిశీలించాలి

పట్టభద్రులు, ఉపాధ్యాయుల శాసనమండలి ఓటర్ల నమోదు వివరాలను పక్కగా పరిశీలించాలని జిల్లా ఎన్నికల అధికారి కలెక్టర్ పి.కోటేశ్వరరావు రెవిన్యూ అధికారులను ఆదేశించారు. పెండింగ్ లో ఉన్న వాటిని త్వరితగతిన పూర్తి చేసి సదరు నివేదికలను పరిశీలించి ప్రతి రోజు సాయంత్రం నాటికి పంపాలన్నారు. ఫామ్ 7లో ఉన్న తొలగింపులకు సంబంధించి వలసలపై ప్రత్యేక దృష్టి పెట్టాలన్నారు. డెత్ కేసులు తొలగించేటప్పుడు ఒకటికి రెండు సార్లు జాగ్రత్తగా పరిశీలించి తొలగించాలన్నారు. గ్రాడ్యుయేట్ ,ఉపాధ్యాయ ఎన్నికలకు సంబంధించి ఇంకా చాలా వరకు పెండింగ్ ఉన్నాయని, వాటిని విచారించి త్వరితగతిన పూర్తి చేసి ప్రతి రోజు సాయంత్రం నాటికి నివేదిక పంపాలన్నారు. ఈ సమీక్ష సమావేశంలో పాల్గొన్న డిఆర్ఒ నాగేశ్వరరావు, జడ్‌పిసిఇఒ నాసరరెడ్డి, హౌసింగ్ పిడి వెంకట నారాయణ, సిపిఒ అప్పలకొండ, ఎస్ఎస్ఎ పిఒ వేణుగోపాల్, డిఇఒ రంగారెడ్డి, డిపిఒ నాగరాజు నాయుడు తదితరులు పాల్గొన్నారు.

వయో పరిమితి పెంచమంటే అరెస్టులా

- డివైఎఫ్ఐ జిల్లా అధ్యక్షులు రాఘవేంద్ర

ప్రజాశక్తి-కర్నూలు కార్పొరేషన్

విజయవాడలో శాంతియుతంగా నిరసన తెలుపుతున్న నిరుద్యోగులను అక్రమంగా అరెస్టు చేసి గన్నవరం పోలీస్ స్టేషన్‌లో నిర్బంధించడాన్ని ఖండిస్తూ డివైఎఫ్ఐ ఆధ్వర్యంలో సోమవారం జిల్లా అధ్యక్షులు రాఘవేంద్ర అధ్యక్షతన కర్నూలు సుందరయ్య జంక్షన్‌లో నిరసన కార్యక్రమాన్ని చేశారు. డివైఎఫ్ఐ జిల్లా కార్యదర్శి నగేష్ మాట్లాడుతూ గత నాలుగు సంవత్సరాలుగా నోటిఫికేషన్లు లేకపోవడంతో ఇప్పుడు పీజీలు, పీహెచ్డీలు, డిగ్రీలు చదువుకొని ఎన్నో సంవత్సరాలుగా ఎస్ఐ, కానిస్టేబుల్ ఉద్యోగాలకు ప్రిపేర్ అయిన వారు అనర్హులుగా మారారని కావున తక్షణమే రాష్ట్ర ప్రభుత్వం ఎస్ఐ కానిస్టేబుల్ అభ్యర్థుల వయోపరిమితిని ఐదు సంవత్సరాలు పెంచాలని భారీగా సిలబస్ ఉన్నందువల్ల కనీసం మూడు నెలల గడువును ప్రిలిమినరీ ఎగ్జామ్‌కు ఇవ్వాలన్నారు. మాట తప్పను మడమతిప్పనన్న ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి నిరుద్యోగులకు ప్రతి సంవత్సరం 6700 ఎస్ఐ కానిస్టేబుల్ ఉద్యోగాలు ఇస్తానని ఇప్పుడు కేవలం 6500 ఉద్యోగాలకే నోటిఫికేషన్లు ఇవ్వడం ఎంతవరకు సమంజసం అని ప్రశ్నించారు. ఇచ్చిన మాట ప్రకారం మూడు సంవత్సరాలకు గాను 20100 పోస్టులకు ఉద్యోగాల సంఖ్యను పెంచాలని డిమాండ్ చేశారు. వయోపరిమితి పరీక్ష గడువు పోస్టుల సంఖ్య పెంచమని శాంతియుతంగా అడిగిన నిరుద్యోగులను డివైఎఫ్ఐ నాయకులను అక్రమంగా అరెస్టు చేసి గవర్నర్‌పేట పోలీస్ స్టేషన్లో నిర్బంధించడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నామని తెలిపారు. అరెస్టు చేసిన నిరుద్యోగులను డివైఎఫ్ఐ నాయకులను తక్షణమే విడుదల చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో డివైఎఫ్ఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి శిరీష, నగర కార్యదర్శి హుస్సేన్ బాషా కర్నూలు మండల కార్యదర్శి ప్రకాష్, నాయకులు ఇంరాన్, బాబీ, అంజి, రంగప్ప, సాయి ,అమర్, శంకర్ పాల్గొన్నారు.



నిరసనసుద్దేశించి మాట్లాడుతున్న రాఘవేంద్ర

అసంబద్ధమైన నిబంధనలు తొలగించాలి

- యుటిఎఫ్ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ఎల్లప్ప, జయరాజు

ప్రజాశక్తి -కర్నూలు కలెక్టరేట్

ఉపాధ్యాయుల బదిలీలకు సంబంధించి జారీచేసిన ఉత్తర్వులు అసంబద్ధమైన నిబంధనలు తొలగించాలని యుటిఎఫ్ జిల్లా అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు జె.ఎల్లప్ప, ఎస్ఎం.జయరాజులు డిమాండ్ చేశారు. సోమవారం నగరంలోని స్థానిక యుటిఎఫ్ జిల్లా కార్యాలయంలో జరిగిన సమావేశంలో వారు మాట్లాడుతూ రాష్ట్ర పాఠశాల విద్యాశాఖ జారీచేసిన ఉపాధ్యాయుల బదిలీల జీవోలో అనేక నిబంధనలు ఉపాధ్యాయులకు ఇబ్బంది చేసే విధంగా ఉన్నాయన్నారు. ఉపాధ్యాయులకు సర్దుబాటు జరిగిన అదనపు పాయింట్లను మాత్రం కేటాయించాలని డిమాండ్ చేశారు. 98 లోపు ఎన్రోల్ అయిన యుపి పాఠశాలలో నుండి కదిలిస్తున్న ఎస్జీటీలకు స్కూల్ అసిస్టెంట్లకు ప్రత్యేక పాయింట్లు ఇవ్వాలని డిమాండ్ చేశారు. గత బదిలీల సందర్భంగా ఉపాధ్యాయులకు ఉన్న ఆరోగ్య వెసులుబాటులకు ప్రత్యేక కేటగిరీగా పరిగణించాలని డిమాండ్ చేశారు. గుర్తింపు పొందిన ఉపాధ్యాయ సంఘం జిల్లా అధ్యక్ష ప్రధాన కార్యదర్శులకు ప్రత్యేక పాయింట్లు ఇవ్వాలన్నారు. సబ్జెక్టు కన్వర్షన్ అయినవారిపై విద్యాశాఖ స్పష్టత ఇవ్వాలని డిమాండ్ చేశారు. మున్సిపల్ ఉపాధ్యాయుల సర్వీసు రూల్స్ రూపొందించే బదిలీలు పదోన్నతులు వెంటనే చేపట్టాలని వారు డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో జిల్లా సహాధ్యక్షుడు యుఆర్ఎ రవికుమార్, జిల్లా ఆర్థిక కార్యదర్శి హేమంత్ కుమార్, జిల్లా గౌరవాధ్యక్షుడు మారెప్ప, జిల్లా నాయకులు నవీన్‌పాటి యెహోషువా, మద్దిలేటి, రంగన్న, ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

చెన్నంపల్లిలో చిరుత కలకలం..?

- గొర్రెను చీల్చేసిన చిరుత

- ఆందోళనలో గ్రామస్తులు..

ప్రజాశక్తి - తుగ్గలి

తుగ్గలి మండలం చెన్నంపల్లి కొండల్లో చిరుత కలకలం రేపింది. ఆదివారం రాత్రి గొర్రెల కాపరులు కొంతమంది కొండకు పోవడంతో విషయం బట్టబయలైంది. దీంతో గ్రామస్తులు ఆందోళన చెందుతున్నారు. కొండలో చిరుత సంచారం చేస్తున్న అడుగులు గొర్రెను చంపిన విధానం చూసి ప్రజలు భయభ్రాంతులకు గురవుతున్నారు. విషయం తెలుసుకున్న పత్తికొండ అటవీశాఖ అధికారులు సంఘటనా స్థలాన్ని పరిశీలించి వాటిని నిర్ధారణ చేశారు. చెన్నంపల్లిలో కొండలు ఎక్కువ ఉండడంతో చిరుత కచ్చితంగా ఉంటుందని ప్రజలు అంటున్నారు. ఏ క్షణమునైనా గ్రామంలోకి చిరుత రావచ్చు నాన్న అనుమానాలు స్థానికుల నుండి వ్యక్తమవుతున్నాయి. ఇప్పటికైనా అధికారుల స్పందించి చిరుత బారి నుండి తప్పించాలని చెన్నంపల్లి గ్రామ ప్రజలు కోరుతున్నారు.

సంఘటన స్థలాన్ని పరిశీలించిన అటవీ అధికారులు... తుగ్గలి మండలం చెన్నంపల్లి కోటలో చిరుత సంచారం చేస్తుందన్న సమాచారాన్ని తెలుసుకున్న పత్తికొండ సబ్ డివిజన్ అటవీ అధికారులు సోమవారం చెన్నంపల్లి కొండలను పరిశీలించారు. గొర్రెను చంపిన విధానం, అడుగులు వేసిన తీరును దానికి సంబంధించిన ఆనవాళ్లను వారు క్షుణ్ణంగా పరిశీలించారు.


గొర్రె కలేబరాన్ని పరిశీలిస్తున్న అధికారులు


సుందరయ్య కేంద్రం వద్ద ఎస్ఎఫ్ఐ జాతీయ నాయకులతో , జిల్లా నాయకులు

విద్యారంగ పరిరక్షణకు పోరాటాలు

- ఎస్ఎఫ్ఐ అఖిల భారత ఉపాధ్యక్షులు వినీష్

ప్రజాశక్తి-కర్నూలు కార్పొరేషన్

నూతన జాతీయ విద్యా విధానం పేరుతో ప్రభుత్వ విద్యను నాశనం చేసే విధంగా విద్యారంగాన్ని కార్పొరేట్ సంస్థలకు అప్పన్నంగా కట్టబెట్టడానికి కేంద్రం ప్రయత్నం చేస్తోందని, దానికి వ్యతిరేకంగా విద్యారంగాన్ని కాపాడుకోవడం కోసం విద్యార్థులు పోరాటాలకు సిద్ధం కావాలని ఎస్ఎఫ్ఐ అఖిల భారత ఉపాధ్యక్షులు వినీష్, కమిటీ సభ్యులు ఆదర్శ్ పేర్కొన్నారు. అఖిలభారత మహాసభలు ఈనెల 13 నుంచి 16 వరకూ హైదరాబాద్‌లో నిర్వహిస్తున్న సందర్భంగా కేరళ నుండి ప్రారంభమైన అమరవీరుల పతాక యాత్ర సోమవారం కర్నూలుకు చేరుకుంది. ఈ సందర్భంగా కర్నూలులో బైక్ ర్యాలీ నిర్వహించారు. అనంతరం వారు మాట్లాడుతూ దేశంలో ఒక విద్యార్థి చదవాలంటే కొన్ని లక్షలు వెచ్చించాల్సి వస్తోందని, పేదవానికి విద్య అందని ద్రాక్ష పండులా మారే ప్రమాదం పొంచి ఉందని తెలిపారు. కేంద్ర ప్రభుత్వం విద్యారంగాన్ని వ్యాపారీకరణ, కాషాయీకరణ, కార్పొరేటీకరణ చేయడానికి నూతన విద్యా విధానాన్ని అమలు చేస్తోందన్నారు. నూతన విద్యా విధానానికి వ్యతిరేకంగా విద్యారంగాన్ని అభివృద్ధి చేయడం కోసం అఖిల భారత మహాసభలు నిర్వహించుకోబోతున్నామని, విద్యార్థులంతా కలిసి ఈ మహాసభలను జయప్రదం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి అబ్దుల్లా, ఉపాధ్యక్షులు సాయి, ఉదయ్ , జిల్లా కమిటీ సభ్యులు అమర్, నరసింహ, అంజి, డివైఎఫ్ఐ జిల్లా కార్యదర్శి నగేష్, నాయకులు రాఘవేంద్ర , హుస్సేన్ బాషా పాల్గొన్నారు.

సి బెళగళ్ మండలం సంక్షిప్త సమాచారం

ప్రజాశక్తి -సి బెళగల్

మండలంలోనీ ఆయా అభివృద్ధి ప్రణాళికలో భాగంగా నేడు సర్వసభ్య సమావేశం నిర్వహించనున్నామని అధికారులందరు, నాయకులు హాజరుకావాలని ఎంపిడిఒ రాముడు పేర్కొన్నారు. ఓర్వకల్ మండలం హుస్సేనాపురం వద్ద ఈ గురువారం రోడ్డుప్రమాదంలో గాయపడ్డ ఈ మండలంలోనీ కొత్తకోట వాసి మద్దిలేటి (52)కోలుకోలేక సోమవారం మృతి చెందారు. పోలకల్ వాసి బోయ మద్దిలేటి భార్య నీలావతి, కూతురు కృష్ణవేణితో కలసి తమ ఆటోలో వెళ్తుండగా సింగవరం బ్రిడ్జ్ వద్ద ట్రక్కు ఢీకొట్టింది. ఇందులో ముగ్గురికి స్వల్పగాయాలు కాగా ఎఎస్ఐ పీరయ్య అక్కడికి చేరుకొని కర్నూలు ఆసుపత్రికి తరలించారు. 100 రోజుల్లో రీ సర్వే పూర్తి చేయాలని, అనేకం పని ఒత్తిడి తగ్గించి రాజకీయ వేధింపులు ఆపాలని మండల విఆర్ఒ లు సోమవారం తహసీల్దార్ శివశంకర్ నాయక్ కు వినతిని అందజేశారు.

జిల్లా అవతరణ నాడు 'కర్నూలు ఉత్సవం' జరపాలి

కలెక్టర్‌కు మేధావులు వినతి

ప్రజాశక్తి - కర్నూలు కలెక్టరేట్

ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ మైనారిటీ సంక్షేమ ప్రత్యేక కార్యదర్శి ఎఎం.ఇంతియాజ్ సమక్షంలో కర్నూలు జిల్లా కలెక్టర్ పి.కోటేశ్వరరావుకు కర్నూలు జిల్లా, అవతరణ నాడు 'కర్నూలు ఉత్సవం' ప్రకటించి సాంస్కృతిక కార్యక్రమాలు చేపట్టేలా చర్యలు తీసుకోవాలని జిల్లాకు చెందిన పలువురు మేధావులు సోమవారం ఒక వినతి పత్రాన్ని సమర్పించారు. ఇంతియాజ్ మాట్లాడుతూ కర్నూలు జిల్లా నుంచి స్వాతంత్రోద్యమంలో పాల్గొన్న మొదటి తరం నాయకులు, గులాం రసూల్ ఖాన్, ఉయ్యాలవాడ నరసింహారెడ్డి, ముత్యూరు గౌడప్ప తదితరుల స్ఫూర్తి ఆతర్వాతతరం నాయకులయిన గాడిచర్ల హరిసర్వోత్తమ రావు, సర్దార్ నాగప్ప, దామోదరం సంజీవయ్యలను ఎలా కార్యోన్ముఖులను చేసిందో వివరించారు. చంద్ర శేఖర కల్కూర మాట్లాడుతూ కర్నూలు ఒక గొప్ప సాంస్కృతిక , ఆధ్యాత్మక కేంద్రమని, ఈ ప్రాంతంలో అడుగడుగునా పవిత్ర క్షేత్రాలు వెలిసాయని, వాటిని పరిరక్షించే బాధ్యతతోపాటు , ఈ గొప్ప వారసత్వ సంపద సంస్కృతి నేటి తరానికి తెలిసేలా విద్యార్థులకు పాఠ్యంశాలుగా చేర్చాలన్నారు. సమన్వయకర్త మన్సూర్ రహమాన్ మాట్లాడుతూ కర్నూలు జిల్లా 1858 జులై 1న ఏర్పడిందని, 165 సంవత్సరాలు పూర్తి చేసుకొంటున్న సందర్భంగా కర్నూలు జిల్లా వైభవాన్ని నేటి తరాల వారికి తెలిసేలా చేయాలని జిల్లా కలెక్టర్‌ను అభ్యర్థించారు. కలెక్టర్ సానుకులంగా స్పందించడం ఆనందకరమని అన్నారు. ఉస్మానియాకళాశాల ప్రిన్సిపల్ సమీరుద్దీన్ మాట్లాడుతూ కర్నూలు వైభవం' కార్యక్రమాలను జిల్లావ్యాప్తంగా అన్ని విద్యా సంస్థలలో వేడుకగా జరుపుకునేలా ప్రయత్నిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ అక్తర్‌భాను జమషీడ్ అలీఖాన్, మహమ్మద్ అస్లాం దావుద్ అహ్మద్, డాక్టర్ కృష్ణారెడ్డి, ఇద్రాతుల్లా ఖాన్,సాహీర్ అహ్మద్ పాల్గొన్నారు.


కలెక్టర్‌కు వినతిపత్రం అందజేస్తున్న ఇంతియాజ్, మన్సూర్ రహిమాన్ , తదితరులు

ఆటో డ్రైవర్ కుటుంబానికి సిఐటియు ఆర్థిక చేయూత

ప్రజాశక్తి -కర్నూలు హాస్పిటల్

పెరాలసిస్ వచ్చి ఆర్థిక ఇబ్బందుల్లో ఉన్న ఆటో డ్రైవర్ కుటుంబానికి సిఐటియు ఆటో డ్రైవర్లు రూ.10 వేలు, 50 కిలోల బియ్యం అందజేసి అండగా నిలిచారు. కర్నూలు నగరంలోని ఐటిసి ఆటో స్టాండ్‌లో ఆటో నడుపుకుంటూ జీవనం సాగిస్తున్న సుంకన్నకు 20 రోజుల క్రితం పెరాలసిస్ వ్యాధి సోకి ఆటో నడవకపోవడం వల్ల కుటుంబం ఆర్థిక ఇబ్బందులతో కొట్టుమిట్టాడుతుంది. సుంకన్నకు ఒక కుమార్తె, కుమారుడు, భార్య ఉన్నారు. ఐటిసి, గుత్తి రోడ్డు పెట్రోల్ బంక్ ఆటో డ్రైవర్లు అందరూ కలిసి సుంకన్న కుటుంబానికి రూ.పదివేలు, 50 కేజీల బియ్యం సోమవార షరీఫ్ నగర్‌లో నివాసం ఉంటున్న సుంకన్న ఇంటికి వెళ్లిన సిఐటియు న్యూ సిటీ నగర ప్రధాన కార్యదర్శి సిహెచ్ సాయిబాబా,ఆటో యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి.ప్రభాకర్, న్యూ సిటీ ఆటో యూనియన్ అధ్యక్షులు ఎస్. హుస్సేన్ వలి, కెవిపిఎస్ జిల్లా నాయకులు జి యేసు, ఆటో యూనియన్ నగర న్యూ సిటీ నాయకులు శ్రీనివాసులు హాజరై సుంకన్న కుటుంబాన్ని పరామర్శించారు. సిఐటియు ఎల్లవేళలా మీకు అండగా ఉంటుందని వారు తెలిపారు. కార్యక్రమంలో ఆటో యూనియన్ సిఐటియు నాయకులు హరి, దుబ్బన్ షారోన్ ,చంద్ర, టి.రాముడు, ఆటో డ్రైవర్లు పాల్గొన్నారు.


ఆర్థిసాయం అందజేస్తున్న నాయకులు


క్రీడాకారిణికి సర్టిఫికెట్ అందజేస్తున్న డాక్టర్ శంకర్‌శర్మ

క్రీడా స్ఫూర్తితో పోటీల్లో రాణించండి

- డాక్టర్ శంకర్ శర్మ

ప్రజాశక్తి-కర్నూలు స్పోర్ట్స్ : క్రీడాకారులు స్ఫూర్తిని ప్రదర్శించి పోటీల్లో రాణించి నప్పుడే భవిష్యత్తు ఉజ్వలంగా ఉంటుందని డాక్టర్ శంకర్ శర్మ అన్నారు. సోమ వారం కర్నూలు జిల్లా ఆర్చరీ అసోసియేషన్ ఆధ్వర్యంలో స్థానిక అవుట్డోర్ స్టేడియంలో నిర్వహించిన ఆర్చరీ క్రిస్మస్ కప్ పోటీల ముగింపు కార్యక్రమానికి డాక్టర్ శంకర్ శర్మ హాజరయ్యారు. ఆయన మాట్లాడుతూ యువ క్రీడాకారులను ప్రోత్స హించే లక్ష్యంగా నిరంతరంవారి అభివద్ధికి కృషి చేస్తానన్నారు. జిల్లా క్రీడా శాఖ సిఇఒ రమణ మాట్లాడుతూ ప్రతిభగల ప్రోత్సహించేందుకు తాము క్రీడా శాఖ నుండి ఎల్లప్పుడూ సిద్ధంగా ఉంటానన్నారు. జిల్లా సెక్రెటరీ నాగరత్నమయ్య మాట్లా డుతూ క్రీడాకారులను ప్రోత్సహించేందుకు ప్రతి సంవత్సరం క్రిస్మస్ కప 'పేరుతో క్రీడా పోటీలను నిర్వహించడం ఆనవాయితీగా కొనసాగిస్తున్నా మన్నారు. ఆర్చరీ శిక్షకులు వంశీ కృష్ణ, వ్యాయామ ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



కలెక్టరేట్ ఎదుట నిరసన తెలుపుతున్న ఎపిటిఎఫ్ నాయకులు

జీతాలు తక్షణమే చెల్లించాలి: ఎపిటిఎఫ్


ప్రజాశక్తి -కర్నూలు కలెక్టరేట్

నవంబర్ నెలకు సంబంధించిన ఉద్యోగులకు,పెన్షనర్లకు చెల్లించాల్సిన జీతాలు,పెన్షన్లు తక్షణమే చెల్లించాలని ఎపిటిఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు జి.హృదయరాజు డిమాండ్ చేశారు. సోమవారం కలెక్టరేట్ ఎదుట గాంధీ విగ్రహం సమీపంలో ఎపిటిఎఫ్ ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. హృదయరాజు, జిల్లా అధ్యక్షప్రధాన కార్యదర్శులు ఇస్మాయిల్ ,మరియానందం మాట్లాడుతూ ఇంతటి ఘోరమైన పరిస్థితిని ఉద్యోగులు, పెన్షనర్లు రాష్ట్ర చరిత్రలో ఎన్నడూ ఎదుర్కోలేదన్నారు. జీతాలపై ,పెన్షన్లపై ఆధారపడి బతికే వారికి ఇంత ఆలస్యమైనా చెల్లించకపోవడం దారుణమన్నారు. సకాలంలో జీతాలు, పెన్షన్లు అందక అటు ఉద్యోగులు, పెన్షనర్లు బ్యాంకుల ద్వారా తీసుకున్న అప్పులకు వాయిదాలు సకాలంలో చెల్లించని కారణంగా అదనపు రుసుము చెల్లిచాల్సి వస్తుందన్నారు. తక్షణమే స్పందించి జీతాలు, పెన్షన్లు వెంటనే చెల్లించాలని, ప్రతినెలా ఒకటో తేదీన జీతాలు, పెన్షన్లు చెల్లించేలా ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని అన్నారు.. ఈ కార్యక్రమంలో జిల్లా గౌరవాధ్యక్షుడు కమలాకర్ రావు, వ్యాయమ ఉపాధ్యాయ సంఘ నాయకులు కిశోర్, నంద్యాల జిల్లా అధ్యక్షుడు మాధవస్వామి, నాయకులు మద్దిలేటి, పుల్లారెడ్డి, సుబ్రమణ్య శర్మ,పెద్దస్వామి,శేషయ్య, తిమ్మప్ప, సురేష్ ,నరేంద్ర, రాఘవరెడ్డిమండల అధ్యక్షప్రధానకార్యదర్శులు పాల్గొన్నారు.

శ్రీ ఆదిత్య విద్యా నిలయం పాఠశాలలో సైన్స్ ఫెయిర్

ప్రజాశక్తి-కర్నూలు కలెక్టరేట్

కల్లూరు శ్రీ ఆదిత్య విద్యా నిలయం పాఠశాలలో సైన్స్ ఫెయిర్ కార్యక్రమం వీక్షకులను ఆకట్టుకుంది. పాఠశాల విద్యార్థులు తయారుచేసిన అనేక రకాల ఆకృతులు అందరికి కనువిందు చేశాయి. ఈ సందర్భంగా పాఠశాల కరెస్పాండెట్ బి.వాసుదేవయ్య మాట్లాడుతూ సైన్స్ ఫెయిర్ వల్ల విద్యార్థులలో సృజనాత్మకత పెరుగుతుందని తెలిపారు. విద్యార్థులు తయారుచేసిన వివిధ రకాల ప్రాజెక్టులను ఈ సైన్స్ ఫెయిర్‌లో ప్రదర్శించారన్నారు. కంప్యూటర్‌లో గేమ్ క్రియేషన్, సోలార్ సిస్టం ఏ విధంగా పనిచేస్తుంది. ఫోన్ రేడియేషన్ వల్ల ప్రభావం వంటి ప్రాజెక్టులను ఈ సైన్స్ ఫెయిర్‌లో ప్రదర్శించారన్నారు. విద్యార్థులు చదువుతున్న అంశాలను ఈ ఆకృతుల ద్వారా సులువుగా నేర్చుకోవడానికి అవకాశం ఉంటుందన్నారు. ఈ కార్యక్రమంలో టీచర్స్ కె.వరలక్ష్మి, ఎస్.అఫీఫ, కె సునీత కుమారి, ఎస్.నజీమ బేగం, కె.శ్రావణి, కె.విజయలక్ష్మి, సోమేశ్వరమ్మ, శాంతమ్మ, శైలజ, అమ్రిన్, వి.రమ్య పాల్గొన్నారు.


సోలార్ సిస్టం వివరిస్తున్న విద్యార్థులు

రజకుల సమస్యలు పరిష్కరించాలి

- రజక వృత్తిదారుల సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి గురుశేఖర్

ప్రజాశక్తి - ఎమ్మిగనూరు



సదస్సు కరపత్రాన్ని విడుదల చేస్తున్న నాయకులు

రజకుల సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని ఎపి రజక వృత్తిదారుల సంఘం జిల్లా గౌరవాధ్యక్షులు సి.హనుమంతు, జిల్లా ప్రధాన కార్యదర్శి సి.గురుశేఖర్ డిమాండ్ చేశారు. సోమవారం సిఐటియు కార్యాలయంలో 'రజకుల సమస్యలు-ప్రభుత్వ విధానాలు'పై సదస్సుకు సంబంధించిన కరపత్రాన్ని విడుదల చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. రజకులు ఆర్థికంగా, రాజకీయంగా, సామాజికంగా నేటికీ దుర్భర జీవితం సాగిస్తున్నారని తెలిపారు. గ్రామాల్లో అగ్రవర్ణాల పెత్తందారులు రజకుల పట్ల వివక్ష చూపుతున్నారని చెప్పారు. శ్రమకు తగిన వేతనం పెంచమని అడిగితే గ్రామ సాంఘిక బహిష్కరణలు, దాడులు, దౌర్జన్యాలు చేస్తూ అక్రమ కేసులు పెట్టి వేధింపులకు గురి చేస్తున్నారని తెలిపారు. గ్రామాల్లో గతంలో ఇనాం భూములు ఇచ్చారని, నేడు భూములకు విలువ పెరగడం వల్ల అగ్రవర్ణ కులాలకు చెందినవారు రజకుల ఇనాం భూములను కబ్జా చేసేందుకు ప్రయత్నిస్తున్నారని చెప్పారు. జిఒ 363 ప్రకారం ధోబీఘాట్ స్థలాలను, చెరువులను, కుంటలను రజక వృత్తిదారులకే కేటాయించాలని కోరారు. జనవరి 6న కర్నూలు నగరంలో జరిగే 'రజకుల సమస్యలు-ప్రభుత్వ విధానాలు' అనే అంశంపై సదస్సు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈరన్న, ఎల్లప్ప, ఉరుకుంద, వీరేష్, రంగస్వామి, రాము, వీరభద్ర పాల్గొన్నారు.

కొత్త బ్రిడ్జి నిర్మాణం చేపట్టాలి : సిపిఎం

ప్రజాశక్తి - ఆదోని

పట్టణంలో శ్రీనివాస్ భవన్ నుంచి తిమ్మారెడ్డి బస్టాండ్ వరకు ప్రమాదకరంగా ఉన్న పాత బ్రిడ్జి స్థానంలో కొత్త బ్రిడ్జి నిర్మాణం చేపట్టాలని సిపిఎం నాయకులు డిమాండ్ చేశారు. సోమవారం పట్టణ కమిటీ ఆధ్వర్యంలో పట్టణంలోని తిమ్మారెడ్డి బస్టాండ్ దగ్గర సంతకాల సేకరణ చేపట్టారు. ఈ సందర్భంగా సిపిఎం జిల్లా నాయకులు వెంకటేశులు, పట్టణ కార్యదర్శి లక్ష్మన్న, సీనియర్ నాయకులు ఈరన్న, మహానందరెడ్డి మాట్లాడారు. బ్రిడ్జి ఇరువైపులా సైడ్ వాల్స్ పడిపోయినప్పుడు మాత్రమే తాత్కాలిక మరమ్మతులు చేయిస్తూ అధికారులు చేతులు దులుపుకుంటున్నారని విమర్శించారు. కొత్త బ్రిడ్జి నిర్మాణం కోసం ప్రజల సహకారంతో ఉద్యమ కార్యాచరణ రూపొందిస్తామని తెలిపారు. రేణుకాంబ విలాస్ దగ్గర బ్రిడ్జిపైకి ఎక్కే మెట్లు కూడా ప్రమాదకరంగా మారాయని చెప్పారు. సంబంధిత అధికారులు కొత్త బ్రిడ్జి నిర్మాణం కోసం ప్రతిపాదనలు పంపి నిర్మాణం చేపట్టి ప్రమాదాలు నివారించాలని కోరారు. బైపాస్ రోడ్డు త్వరలో మొదలవుతుందని ఎమ్మెల్యే సాయి ప్రసాద్ రెడ్డి పదేపదే చెబుతున్నా కార్యరూపం దాల్చడం లేదని తెలిపారు. సంతకాల పత్రాన్ని ఆదోని సబ్ కలెక్టర్‌కు అందిస్తామని తెలిపారు. సిపిఎం పట్టణ కార్యదర్శి వర్గసభ్యులు గోపాల్, తిప్పన్న, నాయకులు వీరేష్, నాగరాజు, కృష్ణమూర్తి, నాగేంద్ర, శ్రీనివాసులు, గౌస్, దేవేంద్ర పాల్గొన్నారు.

రైతులను ఆదుకోవాలని నిరసన

ప్రజాశక్తి - ఆలూరు

నకిలీ పత్తి విత్తనాలతో పంట నష్టపోయిన రైతులను ఆదుకోవాలని ఎపి రైతు సంఘం మండల కార్యదర్శి యు.ఈరన్న కోరారు. సోమవారం నకిలీ పత్తి విత్తనాలతో నష్టపోయిన రైతులతో కలిసి తహశీల్దార్ కార్యాలయం ముందు నిరసన చేపట్టారు. స్పందనలో తహశీల్దార్ మల్లికార్జునకు వినతిపత్రం అందజేశారు. సిఐటియు జిల్లా సహాయ కార్యదర్శి కెపి.నారాయణ స్వామి, డివైఎఫ్ఐ మండల కార్యదర్శి మైనా, రైతు ఈరన్న, ఎం.నారాయణ, కాలప్ప, బి.నారాయణ, షేక్షావలి, నగేష్, రామాంజి పాల్గొన్నారు.

బడుగు, బలహీన వర్గాలను

పట్టించుకోని వైసిపి : మాజీ ఎమ్మెల్యే బీవీ

ప్రజాశక్తి - నందవరం



సమస్యలు తెలుసుకుంటున్న మాజీ ఎమ్మెల్యే బీవీ

రాష్ట్ర ప్రభుత్వం బడుగు, బలహీన వర్గాలను పట్టించుకోవడం లేదని, రాబోయే రోజుల్లో అధికారం టిడిపిదేనని మాజీ ఎమ్మెల్యే టిడిపి రాష్ట్ర ఉపాధ్యక్షులు డాక్టర్ బి.వి.జయనాగేశ్వర రెడ్డి తెలిపారు. సోమవారం నందవరం 2వ వార్డులో 'ఇదేం ఖర్మ... మన రాష్ట్రానికి' నిర్వహించారు. ఇంటింటికీ వెళ్లి వైసిపి ప్రభుత్వ వైఫల్యాలను వివరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. వైసిపి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత బడుగు, బలహీన వర్గాలు అణచివేయబడ్డారని తెలిపారు. నిత్యావసర ధరలు అమాంతంగా పెంచేశారని విమర్శించారు. వచ్చే ఎన్నికల్లో చంద్రబాబును గెలిపించుకుంటేనే రాష్ట్రాభివృద్ధి సాధ్యమని తెలిపారు. టిడిపి జిల్లా ఉపాధ్యక్షులు దేశాయ్ మాధవరావు, మండల కన్వీనర్ చిన్న రాముడు, మండల ఉపాధ్యక్షులు కాశీంవలీ, టిడిపి నాయకులు ధర్మాపురం గోపాల్, మస్తాన్, షరీఫ్, గిర్ని ఈషా, రెహ్మాన్, వడ్డే గోపాల్, గడ్డం రామన్న, విశ్వనాథ్, నరసప్ప పాల్గొన్నారు. **మంత్రాలయం** మండలంలోని చిలుకలడోన గ్రామంలో క్లస్టర్ ఇన్‌ఛార్జీ ఎల్లారెడ్డి ఆధ్వర్యంలో టిడిపి రాష్ట్ర కార్యదర్శి పాలకుర్తి శ్రీనివాస్ 'ఇదేం ఖర్మ... మన రాష్ట్రానికి' నిర్వహించారు. మాజీ సర్పంచి హనుమంతు పాల్గొన్నారు.

ఎలా బతికేది..?

- చెత్త సేకరణ వాహన డ్రైవర్ల ఆందోళన
- నిలిచిన చెత్త సేకరణ
- అకారణంగా తొలగిస్తున్నారని ఆక్రోశం

ప్రజాశక్తి - ఆదోని

ఇంటింటి చెత్త సేకరణ కోసం ఏర్పాటు చేసిన వాహనాల డ్రైవర్లు ఆందోళన బాట పట్టారు. అకారణంగా వాహనాలు రద్దు చేసి తమ ఉద్యోగాలను తొలగిస్తున్నారని ఏజెన్సీ నిర్వాహకులపై ఆక్రోశం వెల్లగక్కారు. సమాధానం చెప్పాల్సిన అధికారులు చేతులెత్తేసి ఏజెన్సీ నిర్వాహకులను అడగాలని చెప్పడంతో వాహన డ్రైవర్లు అయోమయంలో పడ్డారు.

ఆదోని పట్టణంలో 42 వార్డులకు గాను వార్డుకు ఒకటి చొప్పున చెత్త తరలింపు వాహనం ఏర్పాటు చేశారు. ఈ బాధ్యతలను ఆదోని మున్సిపాలిటీలో రెడ్డి ఏజెన్సీకి ప్రభుత్వం అప్పగించింది. మొదట్లో డిపాజిట్ల పేరుతో ఏజెన్సీ నిర్వాహకులు ఒక్కొక్కరి నుంచి రూ.50 వేల చొప్పున వసూలు చేసినట్లు డ్రైవర్లు తెలిపారు. ఉన్నఫలంగా ఐదు వాహనాలను తొలగించడంతో తాము రోడ్డున పడ్డామని వాపోయారు. తమకు న్యాయం చేయాలని సోమవారం పట్టణంలోని మున్సిపల్ కార్యాలయం వద్ద తడి, పొడి చెత్త సేకరణ వాహన డ్రైవర్లు ఆందోళన చేపట్టారు. క్లీన్ ఆంధ్రప్రదేశ్ కార్యక్రమంలో ఇంటింటికి వెళ్లి తడి, పొడి చెత్త సేకరిస్తున్న వాహనాలను ఆదోని పట్టణంలో వార్డుకొకటి చొప్పున 42 వాహనాలు ఉండేవని, రెడ్డి ఏజెన్సీ ద్వారా వాహన డ్రైవర్లు నియామకాలు చేపట్టారని తెలిపారు. ఒక్కొక్కరికి రూ.10 వేల చొప్పున జీతభత్యాలు చెల్లించేవారన్నారు.

చెత్త పన్ను వసూలు కాక : ఆదోనిలోని పలు వార్డుల్లో చెత్త పన్ను వసూలుపై ప్రజల్లో తీవ్ర వ్యతిరేకత రావడంతో కాలనీలో పన్ను వసూలు తలనొప్పిగా మారింది. టార్గెట్ రీచ్ కాకపోవడంతో వాహనాలను క్రమంగా తగ్గిస్తూ వస్తూ తమ పొట్టగొట్టారని వాహన డ్రైవర్లు పేర్కొన్నారు. 42 గాను దఫాలవారీగా వాహనాలను తగ్గిస్తూ వచ్చారు. ఇటీవలే మరో 5 వాహనాలను తొలగించి ఇతర ప్రాంతాలకు వాహనాలను తీసుకెళ్లడంతో వాహనాలను అడ్డుకున్నామని డ్రైవర్లు తెలిపారు.

అక్రమాలకు తెర : మొదట్లో డ్రైవర్‌గా నియమించేటప్పుడు ఒక్కొక్కరి నుంచి రూ.20 వేల నుంచి రూ.50 వేల వరకు అడ్వాన్స్ తీసుకున్నారు. రెండు నెలలైనా జీతాలు లేవని, ఉన్న ఉపాధి పోయి రోడ్డుపై పడ్డామని డ్రైవర్లు ఆగ్రహం వ్యక్తం చేశారు. మున్సిపల్ అధికారుల దృష్టికి తీసుకెళ్లగా అది ఏజెన్సీకి సంబంధించిందని చేతులు దులుపుకున్నారు. డ్రైవర్లుగా నియమితులైనప్పుడు 4 ఏళ్ల అగ్రిమెంట్ ఉందని తెలిపారు. తమకు ప్రత్యామ్నాయంగా ఉపాధి చూపి న్యాయం జరిగేంత వరకు తడి, పొడి చెత్త వాహనాలను బయటకు తీయమని డ్రైవర్లు భీష్మించారు.



మున్సిపల్ కార్యాలయ గేట్ ముందు ఆందోళన చేస్తున్న వాహన డ్రైవర్లు

చెత్త పన్ను వసూలు వద్దన్న ఎమ్మెల్యే : ప్రజలకు తలనొప్పిగా ఉన్న చెత్త పన్ను వసూలు చేయవద్దని పలు సందర్భాల్లో ఎమ్మెల్యే సాయి ప్రసాద్ రెడ్డి ప్రకటించారు. స్లమ్ములో నెలకు రూ.30, రిచ్ ఏరియాలో రూ.45 వసూలు చేయాలని నిర్ణయించారు. ప్రభుత్వ నిబంధనలకు విరుద్ధంగా అన్ని ప్రాంతాల్లో రూ.45 వసూలు చేయాలని అధికారులు చర్యలు తీసుకోవడంతో ప్రజల వ్యతిరేకత మొదలైంది.

మా పొట్ట కొట్టారు - మారాజు, ట్రక్ డ్రైవర్

ఉద్యోగం వస్తుందనే ఆశతో నగదు చెల్లించి డ్రైవర్‌గా చేరాను. మొదట్లో సక్రమంగా జీతాలు ఇచ్చిన ఏజెన్సీ నిర్వాహకులు రాను రాను జాప్యం చేస్తూ వద్దనకుండా పొగ పెట్టినట్లు వ్యవహరించారు. మేము సక్రమంగా విధులు నిర్వర్తించినా పన్ను వసూలు కాలేదన్న నెపంతో వాహనాలను తగ్గించి ఇతర ప్రాంతాలకు తరలిస్తున్నారు. ఉన్నఫలంగా ఉద్యోగం తొలగించడం వల్ల మేమెలా బతికేది. ప్రభుత్వం న్యాయం చేయాలి

మాకు న్యాయం చేయాలి - ప్రసాద్, ట్రక్ డ్రైవర్

ఉదయం ఇంటింటి చెత్త సేకరణ బాధ్యతగా చేస్తున్నాం. పన్ను వసూలు చేయడంలో నిర్లక్ష్యం కారణంగా మమ్మల్ని విధుల నుంచి తొలగించడం ఎంతవరకు సమంజసం. విధుల్లోకి చేరే సమయంలో నాలుగేళ్ల అగ్రిమెంట్ రాయించుకొని అకారణంగా తొలగించే కుట్ర చేస్తున్నారు. ప్రభుత్వం జోక్యం చేసుకొని మాకు న్యాయం చేయాలి.

నీటి సంపునకు భూమిపూజ

- హామీ నిలుపుకున్న ఎమ్మెల్యే బాలనాగిరెడ్డి

ప్రజాశక్తి - మంత్రాలయం

మండలంలోని చెట్నిహల్లి గ్రామంలో నీటి సంపు నిర్మిస్తామని ఇచ్చిన హామీని ఎమ్మెల్యే వై.బాలనాగిరెడ్డి నిలుపుకున్నారు. 40 వేల లీటర్ల నీటి సామర్థ్యం గల సంపు నిర్మాణానికి సోమవారం సర్పంచి అంజినయ్య భూమి పూజ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. ఆగస్టు 20న ఎమ్మెల్యే వై.బాలనాగిరెడ్డి, వైసిపి రాష్ట్ర యూత్ కమిటీ సభ్యులు వై.ప్రదీప్ రెడ్డి 'గడపగడపకు మన ప్రభుత్వం' నిర్వహించారని తెలిపారు. గ్రామంలో నీటి ఎద్దడి ఉందని పలువురు ఎమ్మెల్యే దృష్టికి తీసుకొచ్చారని చెప్పారు. మంచి నీటి సంపు ఏర్పాటు చేసి సమస్య పరిష్కారానికి కృషి చేస్తామని హామీ ఇచ్చారని తెలిపారు. హామీలో భాగంగా ఎమ్మెల్యే బాలనాగి రెడ్డి ఆదేశాల మేరకు రూ.5 లక్షలతో తాగునీటి సంపు నిర్మాణానికి భూమి పూజ చేసి పనులు ప్రారంభించామని పేర్కొన్నారు. ఆర్‌డబ్ల్యుఎస్ ఎఇ వేద స్వరూప, మాజీ సర్పంచి అల్లింగప్ప, నాయకులు గంగుల వెంకటేష్ ఉన్నారు.

వర్షాల సమయంలో జాగ్రత్తలు తీసుకోవాలి : తహశీల్దార్

ప్రజాశక్తి - చిప్పగిరి

వర్షాలు కురుస్తున్న సమయంలో తగిన జాగ్రత్తలతో ఉండాలని తహశీల్దార్ లక్ష్మీనారాయణ మండల ప్రజలకు సూచించారు. సోమవారం తహశీల్దార్ కార్యాలయంలో ఆయన మాట్లాడారు. విద్యుత్ స్తంభాలకు చాలా దూరంగా ఉండాలన్నారు. కొంతమంది రైతులు స్తంభాలకు పశువులను కట్టేస్తున్నారని, వర్షం సమయంలో ప్రమాదకరమని అన్నారు. మట్టి మిద్దెల్లో ఉన్నవారు కూడా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. తడి ఉన్న విద్యుత్ బోర్డులను తాకకూడదని తెలిపారు. రైతులు బోరుబావులకు దగ్గర ఉన్న ట్రాన్స్‌ఫార్మర్లను, సాగునీరు అందించే మోటార్ దగ్గర చాలా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు.

కర్ణాటక మద్యం సీజ్

ప్రజాశక్తి - ఎమ్మిగనూరు రూరల్

మంత్రాలయం మండలం మాధవరం చెక్‌పోస్ట్ వద్ద వాహనాల తనిఖీలో భాగంగా కర్ణాటక మద్యం స్వాధీనం చేసుకున్నట్లు సిఐ జయరాం నాయుడు తెలిపారు. సోమవారం సెబ్ కార్యాలయంలో సెబ్ అధికారులు విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా సిఐ జయరాం నాయుడు, ఎస్ఐలు సోమశేఖర రావు, చంద్రమోహన్ మాట్లాడారు. మంత్రాలయం మండలం మాధవరం చెక్‌పోస్ట్ వద్ద వాహనాల తనిఖీ చేపట్టినట్లు తెలిపారు. టాటా ఇండిగో కారులో కర్ణాటక మద్యం 30 బాక్సుల టెట్రా ప్యాకెట్లు (2880) స్వాధీనం చేసుకున్నట్లు చెప్పారు. దీని విలువ రూ.1.20 లక్షలు ఉంటుందన్నారు. వీటిని తరలిస్తున్న పల్లెపాడు లక్ష్మయ్య, ఆదోని శివశంకర్, రాచుమర్రి ఉరుకుందుపై కేసు నమోదు చేసి, కర్ణాటక మద్యాన్ని సీజ్ చేసినట్లు తెలిపారు. హెడ్ కానిస్టేబుళ్లు చంద్రమౌళి, రబ్బాని, గోపాల్, ప్రసాద్, కానిస్టేబుళ్లు రామచంద్రుడు, నరసింహారెడ్డి, రాధమ్మ, ఇందు, చంద్రన్న సూర్యప్రకాష్ పాల్గొన్నారు.

ఇళ్ల నిర్మాణాలపై ప్రత్యేక దృష్టి : ఎమ్మెల్యే

ప్రజాశక్తి - కోసిగి రూరల్

జగనన్న కాలనీల్లో ఇళ్ల నిర్మాణాలపై ప్రత్యేక దృష్టి సారిస్తున్నట్లు ఎమ్మెల్యే వై.బాలనాగిరెడ్డి తెలిపారు. సోమవారం కోసిగిలో జగనన్న కాలనీలో గృహ నిర్మాణ శాఖ, వెంకటేశ్వర కన్‌స్ట్రక్షన్ ఆధ్వర్యంలో థర్డ్ పార్టీ వారు నిర్మించి ఇస్తున్న ఇళ్లకు భూమి పూజ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే బాలనాగిరెడ్డి మాట్లాడారు. ఇల్లు కట్టుకోలేని వారి ఒప్పందం మేరకు థర్డ్ పార్టీ ఆధ్వర్యంలో ఇల్లు నిర్మించి ఇస్తున్నట్లు తెలిపారు. జగనన్న కాలనీలో ఇప్పటివరకు 464 మంది లబ్ధిదారులు ముందుకొచ్చారని చెప్పారు. పట్టా ఇచ్చి ఇల్లు మంజూరు కానివారు ఉంటే గృహ నిర్మాణ శాఖ అధికారులను సంప్రదించాలని తెలిపారు. వైసిపి మండల ఇన్‌ఛార్జీ మురళీ మోహన్ రెడ్డి, హౌసింగ్ డిఇ కృష్ణయ్య, ఎఇ షేక్షావలీ, సర్పంచి అయ్యమ్మ, ఎంపిపి ఈరన్న, మండల సీనియర్ నాయకులు నాడిగేని నరసింహులు, మండల నాయకులు నాడిగేని నాగరాజు, మాణిక్యరాజు, జగదీష్ స్వామి, హోళగుంద కోసిగయ్య, ఉరుకుంద ఈరన్న స్వామి దేవస్థానం బోర్డు సభ్యులు బుళ్లి నరసింహులు, కాంట్రాక్టర్ బసిరెడ్డి, పి.నాగేష్, రాజేష్ పాల్గొన్నారు.



ఇళ్ల నిర్మాణానికి భూమి పూజ చేస్తున్న ఎమ్మెల్యే బాలనాగిరెడ్డి

సమస్యల పరిష్కారానికే 'గడపగడపకు' : ప్రజా సమస్యల పరిష్కారం కోసమే 'గడపగడపకు మన ప్రభుత్వం' నిర్వహిస్తున్నట్లు ఎమ్మెల్యే బాల నాగిరెడ్డి తెలిపారు. కోసిగి 1వ సచివాలయంలో ఎంపిడిఒ రాజేంద్ర ప్రసాద్ ఆధ్వర్యంలో సర్పంచి అయ్యమ్మ అధ్యక్షతన 'గడపగడపకు మన ప్రభుత్వం' నిర్వహించారు.

మార్చి వరకు సాగు నీరిస్తామని ప్రకటించాలి

- అఖిలపక్షం ఆధ్వర్యంలో తహశీల్దార్‌కు వినతి

ప్రజాశక్తి - దేవనకొండ



వినతిపత్రం సమర్పిస్తున్న అఖిలపక్ష నాయకులు

రబీ సీజన్ పూర్తయ్యే వరకు హంద్రీనీవా కింద సాగు చేసిన రైతులకు సాగునీరిస్తామని ప్రభుత్వం, అధికారులు, ప్రజా ప్రతినిధులు ప్రకటించాలని అఖిలపక్ష నాయకులు కోరారు. సోమవారం అఖిలపక్షం ఆధ్వర్యంలో తహశీల్దార్‌కు వినతిపత్రం అందజేశారు. అనంతరం తహశీల్దార్ కార్యాలయం ముందు బైఠాయించారు. ఈ సందర్భంగా సిపిఎం జిల్లా నాయకులు వీరశేఖర్, టిడిపి మండల కన్వీనర్ విజయ్ గౌడ్, సిపిఐ మండల కార్యదర్శి ఎం.నరసారావు, లోక్‌సత్తా నాయకులు రామదాసు గౌడ్, జనసేన నాయకులు మక్బుల్, కాంగ్రెస్ నాయకులు గొర్రెల శ్రీనివాసులు మాట్లాడారు. హంద్రీనీవా అధికారులు రైతుల పట్ల నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని తెలిపారు. రబీ సీజన్ మొదలయ్యే వరకు ఎలాంటి ప్రకటనా చేయకుండా రైతులు పంటలు సాగు చేసిన తర్వాత డిసెంబర్ చివరి వరకు మాత్రమే నీరిస్తామని ప్రకటించారని చెప్పారు. మండల రైతులు, హంద్రీనీవా కింద సాగు చేసుకున్న రైతులు నష్టపోతారని ఆవేదన వ్యక్తం చేశారు. టిడిపి నాయకులు బండ్లయ్య, మలకన్న, సిపిఎం నాయకులు యూసుఫ్ బాషా, అశోక్, సిపిఐ నాయకులు సుల్తాన్, మధుబాబు, రవికుమార్, వీరన్న, మురళీ పాల్గొన్నారు.

పంట నష్టపోయిన రైతులను ఆదుకోవాలి

- సిపిఐ, ఎఐకెఎస్ ఆధ్వర్యంలో రౌండ్ టేబుల్ సమావేశం

ప్రజాశక్తి-ఆలూరు

ఖరీఫ్‌లో అధిక వర్షాలతో, నకిలీ పత్తి విత్తనాలతో పంటలు నష్టపోయిన రైతులను ఆదుకోవాలని టిడిపి రైతు సంఘం రాష్ట్ర కార్యదర్శి సి.నారాయణ రెడ్డి, రైతుసంఘం (సిపిఐ) జిల్లా అధ్యక్షులు లక్ష్మణ్ రెడ్డి, రైతు సంఘం (సిపిఎం) మండల కార్యదర్శి ఈరన్న కోరారు. సోమవారం ఆలూరు జూనియర్ కళాశాల ఆడిటోరియంలో సిపిఐ మండల కార్యదర్శి రామాంజనేయులు అధ్యక్షతన రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. ప్రస్తుత ఖరీఫ్ సీజన్‌లో సకాలంలో వర్షాలు రావడంతో రైతులు ప్రధాన పంటలైన ఉల్లి, మిరప, వరి, పత్తి, వేరుశనగ, కంది, ఆముదం, జొన్న, కొర్ర తదితర పంటలు సాగు చేశారని తెలిపారు. పంటలు ఆశాజనకంగా ఉండి చేతికొచ్చే సమయంలో అక్టోబర్‌లో అధిక వర్షాలు కురవడంతో పంటలు కుళ్లిపోవడం, మొలకలు రావడంతో రైతులు తీవ్రంగా నష్టపోయారని చెప్పారు. జిల్లాలో నకిలీ పత్తి విత్తనాల దందా ఆగడాలు ఎక్కువయ్యాయని తెలిపారు. పంట పెరిగాక కేవలం మొక్కలు మాత్రమే ఉన్నాయని, కాయలు లేవని అన్నారు. జిల్లాలో అధికార పార్టీ ప్రజాప్రతినిధులే నకిలీ విత్తనాలను విక్రయిస్తున్నారని తెలిపారు. అమ్మకందారులను ప్రోత్సహించడం దుర్మార్గపు చర్య అని ఆగ్రహం వ్యక్తం చేశారు. గ్రామీణ ప్రాంతాల్లో ఆర్‌బికెలు కూడా రైతుల సమస్యలు పరిష్కరించడంలో విఫలమయ్యాయని విమర్శించారు. పంట నష్టపరిహారాన్ని అంచనా వేసేందుకు కేంద్ర పరిశీలన బృందం జిల్లాలో పర్యటించాలని, పంటల బీమా పథకం పూర్తి స్థాయిలో అమలు చేయాలని కోరారు. ఖరీఫ్ సీజన్‌లో రైతులు బ్యాంకుల్లో తీసుకున్న పంట రుణాలను మాఫీ చేయాలని డిమాండ్ చేశారు. సిపిఐ, ఎఐకెఎస్ ఆధ్వర్యంలో జిల్లాలో 4 బృందాలుగా ఏర్పడి ఈనెల 16 నుంచి 20 వరకు జరిగే రైతు రక్షణ కాలినడక యాత్రలో ప్రజలు, రైతులు పాల్గొని జయప్రదం చేయాలని కోరారు. సిపిఎం నాయకులు కెపి.నారాయణస్వామి, సిపిఐ నాయకులు భూపేష్, జనసేన నాయకులు ఛత్రపతి, సిపిఐ టౌన్ సెక్రటరీ మునిస్వామి, రైతు సంఘం మండల కార్యదర్శి హోతూరప్ప, గోపాల్, ఎఐటియుసి తాలూకా అధ్యక్షులు శివ, సిద్ధ, తెలుగు యువత జిల్లా అధికార ప్రతినిధి సురేంద్ర, ఎఐఎస్ఎఫ్ మండల అధ్యక్షులు దుర్గా నాయక్, సంతోష్, సాయికుమార్, రాజేష్ పాల్గొన్నారు.



మాట్లాడుతున్న టిడిపి రైతు సంఘం రాష్ట్ర కార్యదర్శి నారాయణరెడ్డి



వినతిపత్రం అందజేస్తున్న దివాకర్‌రెడ్డి

గంజాయి, డ్రగ్స్ సరఫరా చేసే వారిని అరెస్టు చేయాలి

- తెలుగు యువత జిల్లా ప్రధాన కార్యదర్శి పాలకుర్తి దివాకర్ రెడ్డి

ప్రజాశక్తి - మంత్రాలయం

సరిహద్దు ప్రాంతాల నుంచి యువత గంజాయి, డ్రగ్స్‌ను సరఫరా చేస్తున్నారని, వారిని వెంటనే అరెస్టు చేయాలని తెలుగు యువత జిల్లా ప్రధాన కార్యదర్శి పాలకుర్తి దివాకర్ రెడ్డి కోరారు. సోమవారం పోలీసు స్టేషన్‌లో ఎస్ఐ వేణుగోపాల్ రాజుకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. రాష్ట్రం నుంచే సరిహద్దులు దాటి దేశం మొత్తానికి గంజాయి సరఫరా అవుతోందని తెలిపారు. డ్రగ్స్ వినియోగానికి ప్రధాన కారణం నిరుద్యోగమన్నారు. జగన్మోహన్ రెడ్డి పాలనలో గంజాయి, డ్రగ్స్ మాఫియాకు రాష్ట్రం నిలయంగా మారిందని విమర్శించారు. అంతకుముందు దివాకర్ రెడ్డి ఆధ్వర్యంలో సుంకేశ్వరి గ్రామంలో 'ఇదేం ఖర్మ... మన రాష్ట్రానికి' నిర్వహించారు. రచ్చుమర్రి గ్రామంలో టిడిపి నాయకులు నరసింహులు ఆధ్వర్యంలో 'ఇదేం ఖర్మ' నిర్వహించారు. పన్నగ నాగశయన, విజయరామిరెడ్డి, సాయికుమార్ రెడ్డి, చిదానంద, ఏబు, తిక్కస్వామి గౌడు, లక్ష్మయ్య, రవి, నాగరాజు, శివ పాల్గొన్నారు.

జీతాలు చెల్లించకపోవడం దారుణం : యుటిఎఫ్

ప్రజాశక్తి - గోనెగండ్ల

ప్రభుత్వ ఉద్యోగులకు 14 రోజులు దాటినా నవంబర్‌కు సంబంధించిన జీతాలు, పెన్షనర్లకు పింఛన్లు చెల్లించకపోవడం దారుణమని యుటిఎఫ్ జిల్లా కార్యదర్శి ఎస్.నరసింహులు తెలిపారు. సోమవారం గోనెగండ్లలో యుటిఎఫ్ మండల అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు యు.చంద్రపాల్, జి.రామన్ ఆధ్వర్యంలో సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ... డిసెంబరులో 14 రోజులు గడిచినా ఉద్యోగులకు జీతాలు అందకపోవడం వల్ల ఉద్యోగులు, కుటుంబాలు ఇబ్బందులు పడుతున్నాయని తెలిపారు. రాఘవేంద్ర, జిక్రియ, వెంకట రమణ, విజయ్ కుమార్, శంకర్ నాయక్, నాగేశ్వర రావు, బాబు, ఖాజన్న, అక్బర్, హుస్సేన్, లక్ష్మణ్, సుంకన్న, మద్దిలేటి, నాగరాజు పాల్గొన్నారు.

విత్తనం విత్తింది మొదలు.. కోతలు కోసే వరకు రైతులు దగా పడుతూనే ఉంటారు. అక్రమార్జనే ధ్యేయంగా కొందరు చేసే నకిలీ విత్తనాలు, ఎరువులు, పురుగుమందుల వ్యాపారంతో రైతులు కుదేలవుతున్నారు. గ్రామీణ ప్రాంతాల్లోని రైతులను లక్ష్యంగా చేసుకుంటున్న కొందరు వ్యాపారులు విత్తనాల సమయంలో, ఎరువులు వేసే సమయంలో తమ దందా సాగిస్తూ దగా చేస్తున్నారు. ప్రస్తుతం ఎరువులు, పురుగుమందుల వేసే సీజన్ కావడంతో బయో ఫెర్టిలైజర్ కెమికల్ పేరుతో జిల్లాలో అనుమతి లేని నకిలీలను తెరచాటున అమ్మకాలు చేపడుతున్నారు.

బయో మాయ..!

- అనుమతి లేకుండా జోరుగా నకిలీ ఎరువుల విక్రయాలు

ప్రజాశక్తి-ఆదోనిరూరల్

కర్నూలు కేంద్రంగా ఉత్పత్తులను మార్కెట్‌లోకి తెస్తున్న కొన్ని కంపెనీలు జిల్లాలోకి ప్రవేశిస్తున్నాయి. గ్రామాల్లో తమకు అనుకూలమైన కొందరు వ్యాపారులను గుర్తించి, లైసెన్సులు లేని వారికి ఈ బయో ఎరువులు, కెమికల్స్ పంపించి వారి ద్వారా రైతులకు విక్రయిస్తున్నారు. ఈ నేపథ్యంలో ఉమ్మడి జిల్లాలో ఈ నకిలీ బయో ఫెర్టిలైజర్స్ వ్యాపారం జోరుగా సాగుతోంది. కొందరు వ్యాపారులు సంప్రదాయబద్ధంగా వాడుతున్న ఎరువులు కాకుండా బయోఎరువులు, కెమికల్స్ వాడాలని ప్రోత్సహిస్తున్నారు. అమ్మకాలను బట్టి కమీషన్లు ఇస్తుండడంతో బయోఎరువులు, రసాయనాలతో పాటు ఇతర పోషకాలు నేరుగా మొక్కకే అందుతాయని, కాయ, పూత ఉంటుందని, ఉత్పత్తులు అధికంగా వస్తాయని, చీడపీడలు రావని ప్రచారం సాగిస్తూ రైతులను ఆకట్టుకుంటున్నారు. తెరచాటున సాగుతున్న బయో ఎరువులు, రసాయనాలు, ఇత్తర ఉత్పత్తుల వ్యాపారం గుట్టు రట్టు కావడంతో మండలంలోని పెసలబండ గ్రామంలో అధికారులు సోమవారం దాడులు చేపట్టారు.



నకిలీ ఎరువులు, మందులను పరిశీలిస్తున్న వ్యవసాయ శాఖ

బయో ఉత్పత్తుల పట్టివేత

అనుమతి లేని ఎరువులు, మందులను గ్రామాల్లో రైతులకు అంటగడుతున్న ఓ ముఠా దందాను ఆదోని మండలం పెసలబండ గ్రామంలో వ్యవసాయాధికారులు పట్టుకున్నారు. డివిజన్ వ్యవసాయ శాఖ అధికారి గిరీష్, ఎఒ పాపిరెడ్డి వివరాల మేరకు... పెసలబండ గ్రామంలోని సిహెచ్.వెంకట్రావు నివాసంలో అనుమతులు లేని బయో ఉత్పత్తులను పట్టుకున్నారు. రెవెన్యూ, పోలీసు వారి సహకారంతో రూ.6.31 లక్షల విలువ గల ఉత్పత్తులను పంచనామ నిర్వహించి సీజ్ చేశారు. దాదాపు 9 రకాల బయో ఉత్పత్తుల నమూనాలు సేకరించి ల్యాబ్‌కు పంపారు.

వాడీవేడిగా మండల సమావేశం

- నీటి సమస్యను పరిష్కరించాలని ప్రజాప్రతినిధులు బైఠాయింపు

- అధికారుల తీరుపై ఆగ్రహం

ప్రజాశక్తి - ఆస్పరి

ఆస్పరి మండల సర్వసభ్య సమావేశం రసాభాసగా సాగింది. గ్రామాల్లో నెలకొన్న నీటి సమస్య పరిష్కరించాలని టిడిపి ప్రజాప్రతినిధులు నరసప్ప, రహీంతుల్లా బైఠాయించారు. సోమవారం మండల పరిషత్ కార్యాలయంలో ఎంపిపి సుంకర ఉమాదేవి అధ్యక్షతన మండల సర్వసభ్య సమావేశం వాడీవేడిగా సాగింది. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. గ్రామాల్లో నెలకొన్న తాగునీటి సమస్య పరిష్కారం కోసం జలజీవన్ ద్వారా ఇంటింటికీ కుళాయి కనెక్షన్ ఇవ్వాలని టిడిపి ఎంపిటిసి నరసప్ప డిమాండ్ చేశారు. ఎంపిడిఒ మాట్లాడుతూ... జలజీవన్ ద్వారా ఇంటింటికీ కుళాయి మంజూరయ్యేలా చూస్తామన్నారు. తొగలగల్లు సర్పంచి అంజినయ్య మాట్లాడుతూ... పంచాయతీ పరిధిలో పూరి గుడిసెల్లో నివాసం ఉంటున్న 40 మంది నిరుపేదలకు నూతన గృహాలు మంజూరు చేయాలని హౌసింగ్ అధికారుల చుట్టూ తిరిగినా పట్టించు కోవడం లేదని తెలిపారు. అధికార పార్టీ నాయకులకు మాత్రం ఆగమేఘాల మీద ఆన్‌లైన్‌లో నమోదు చేస్తున్నారని చెప్పారు. విచారణ చేపట్టి బాధ్యులపై చర్యలు తీసుకుంటానని ఎంపిడిఒ మల్లేశ్వరి హామీ ఇచ్చారు. డి.కోటకొండ సిపిఐ ఎంపిటిసి అటికెలగుండు రంగమ్మ మాట్లాడుతూ... గ్రామంలో ఎక్కడి సమస్యలు అక్కడే తిష్ట వేశాయని తెలిపారు. సిసి రోడ్లు, డ్రెయినేజీలు లేకపోవడంతో మురుగునీరు రోడ్లపైకి చేరి దుర్వాసన వెదజల్లుతోందని చెప్పారు. గ్రామానికి వచ్చే ప్రధాన రహదారి గుంతలమయంగా మారడంతో ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తెలిపారు. 'గడపగడపకు' కార్యక్రమంలో మంత్రి దృష్టికి తీసుకెళ్లినా పరిష్కారం కాలేదని చెప్పారు. రెవెన్యూ కార్యాలయం అవినీతికి నిలయంగా మారిందని తెలిపారు. మండలాన్ని కరువుగా ప్రకటించి సహాయక చర్యలు చేపట్టాలని, ఎంపిటిసిల గౌరవ వేతనం రూ.20 వేలకు పెంచాలని సభను వాకౌట్ చేసి, కింద కూర్చొని నినాదాలు చేస్తూ నిరసన వ్యక్తం చేశారు. ఎంపిపి సుంకర ఉమాదేవి మాట్లాడుతూ... గ్రామాల్లో నెలకొన్న సమస్యల పరిష్కారానికి ప్రతి మూడు నెలలకోసారి సమావేశం నిర్వహిస్తున్నామని తెలిపారు. డిప్యూటీ తహశీల్దార్ రమణబాబు పాల్గొన్నారు.



సమావేశంలో బైఠాయించిన ప్రజాప్రతినిధులు

రజకుల సమస్యలు పరిష్కరించాలి

- రజక వృత్తిదారుల సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి గురుశేఖర్



సదస్సు కరపత్రాన్ని విడుదల చేస్తున్న నాయకులు

ప్రజాశక్తి - ఎమ్మిగనూరు

రజకుల సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని ఎపి రజక వృత్తిదారుల సంఘం జిల్లా గౌరవాధ్యక్షులు సి.హనుమంతు, జిల్లా ప్రధాన కార్యదర్శి సి.గురుశేఖర్ డిమాండ్ చేశారు. సోమవారం సిఐటియు కార్యాలయంలో 'రజకుల సమస్యలు-ప్రభుత్వ విధానాలు'పై సదస్సుకు సంబంధించిన కరపత్రాన్ని విడుదల చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. రజకులు ఆర్థికంగా, రాజకీయంగా, సామాజికంగా నేటికీ దుర్భర జీవితం సాగిస్తున్నారని తెలిపారు. గ్రామాల్లో అగ్రవర్ణాల పెత్తందారులు రజకుల పట్ల వివక్ష చూపుతున్నారని చెప్పారు. శ్రమకు తగిన మేరలు పెంచమని అడిగితే గ్రామ సాంఘిక బహిష్కరణలు, దాడులు, దౌర్జన్యాలు చేస్తూ అక్రమ కేసులు పెట్టి వేధింపులకు గురి చేస్తున్నారని తెలిపారు. గ్రామాల్లో గతంలో ఇనాం భూములు ఇచ్చారని, నేడు భూములకు విలువ పెరగడం వల్ల అగ్రవర్ణ కులాలకు చెందినవారు రజకుల ఇనాం భూములను కబ్జా చేసేందుకు ప్రయత్నిస్తున్నారని చెప్పారు. జిఒ 363 ప్రకారం ధోబీఘాట్ స్థలాలను, చెరువులను, కుంటలను రజక వృత్తిదారులకే కేటాయించాలని కోరారు. జనవరి 6న కర్నూలు నగరంలో జరిగే 'రజకుల సమస్యలు-ప్రభుత్వ విధానాలు' అనే అంశంపై సదస్సు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈరన్న, ఎల్లప్ప, ఉరుకుంద, వీరేష్, రంగస్వామి, రాము, వీరభద్రి పాల్గొన్నారు.

కొత్త బ్రిడ్జి నిర్మాణం చేపట్టాలి : సిపిఎం

ప్రజాశక్తి - ఆదోని

పట్టణంలో శ్రీనివాస్ భవన్ నుంచి తిమ్మారెడ్డి బస్టాండ్ వరకు ప్రమాదకరంగా ఉన్న పాత బ్రిడ్జి స్థానంలో కొత్త బ్రిడ్జి నిర్మాణం చేపట్టాలని సిపిఎం నాయకులు డిమాండ్ చేశారు. సోమవారం పట్టణ కమిటీ ఆధ్వర్యంలో పట్టణంలోని తిమ్మారెడ్డి బస్టాండ్ దగ్గర సంతకాల సేకరణ చేపట్టారు. ఈ సందర్భంగా సిపిఎం జిల్లా నాయకులు వెంకటేశులు, పట్టణ కార్యదర్శి లక్ష్మన్న, సీనియర్ నాయకులు ఈరన్న, మహానందరెడ్డి మాట్లాడారు. బ్రిడ్జి ఇరువైపులా సైడ్ వాల్స్ పడిపోయినప్పుడు మాత్రమే తాత్కాలిక మరమ్మతులు చేయిస్తూ అధికారులు చేతులు దులుపుకుంటున్నారని విమర్శించారు. కొత్త బ్రిడ్జి నిర్మాణం కోసం ప్రజల సహకారంతో ఉద్యమ కార్యాచరణ రూపొందిస్తామని తెలిపారు. రేణుకాంబ విలాస్ దగ్గర బ్రిడ్జిపైకి ఎక్కే మెట్లు కూడా ప్రమాదకరంగా మారాయని చెప్పారు. సంబంధిత అధికారులు కొత్త బ్రిడ్జి నిర్మాణం కోసం ప్రతిపాదనలు పంపి నిర్మాణం చేపట్టి ప్రమాదాలను నివారించాలని కోరారు. బైపాస్ రోడ్డు త్వరలోనే మొదలవుతుందని ఎమ్మెల్యే సాయి ప్రసాద్ రెడ్డి పదేపదే చెబుతున్నా కార్యరూపం దాల్చడం లేదని తెలిపారు. సంతకాల పత్రాన్ని ఆదోని సబ్ కలెక్టర్‌కు అందిస్తామని తెలిపారు. సిపిఎం పట్టణ కార్యదర్శి వర్గసభ్యులు గోపాల్, తిప్పన్న, నాయకులు వీరేష్, నాగరాజు, కృష్ణమూర్తి, నాగేంద్ర, శ్రీనివాసులు, గౌస్, దేవేంద్ర పాల్గొన్నారు.

రైతులను ఆదుకోవాలని నిరసన

ప్రజాశక్తి - ఆలూరు

నకిలీ పత్తి విత్తనాలతో పంట నష్టపోయిన రైతులను ఆదుకోవాలని ఎపి రైతు సంఘం మండల కార్యదర్శి యు.ఈరన్న కోరారు. సోమవారం నకిలీ పత్తి విత్తనాలతో నష్టపోయిన రైతులతో కలిసి తహశీల్దార్ కార్యాలయం ముందు నిరసన చేపట్టారు. స్పందనలో తహశీల్దార్ మల్లికార్జునకు వినతిపత్రం అందజేశారు. సిఐటియు జిల్లా సహాయ కార్యదర్శి కెపి.నారాయణ స్వామి, డివైఎఫ్ఐ మండల కార్యదర్శి మైనా, రైతు ఈరన్న, ఎం.నారాయణ, కాలప్ప, బి.నారాయణ, షేకన్న, నాగేష్, రామాంజి పాల్గొన్నారు.

బడుగు, బలహీన వర్గాలను
పట్టించుకోని వైసిపి : మాజీ ఎమ్మెల్యే బీవీ

ప్రజాశక్తి - నందవరం



సమస్యలు తెలుసుకుంటున్న మాజీ ఎమ్మెల్యే బీవీ

రాష్ట్ర ప్రభుత్వం బడుగు, బలహీన వర్గాలను పట్టించుకోవడం లేదని, రాబోయే రోజుల్లో అధికారం టిడిపిదేనని మాజీ ఎమ్మెల్యే, టిడిపి రాష్ట్ర ఉపాధ్యక్షులు డాక్టర్ బీవీ.జయనాగేశ్వర రెడ్డి తెలిపారు. సోమవారం నందవరం 2వ వార్డులో 'ఇదేం ఖర్మ... మన రాష్ట్రానికి' నిర్వహించారు. ఇంటింటికి వెళ్లి వైసిపి ప్రభుత్వ వైఫల్యాలను వివరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. వైసిపి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత బడుగు, బలహీన వర్గాలను అణచివేస్తున్నారని తెలిపారు. నిత్యావసర ధరలు అమాంతంగా పెంచేశారని విమర్శించారు. వచ్చే ఎన్నికల్లో చంద్రబాబును గెలిపించుకుంటేనే రాష్ట్రాభివృద్ధి సాధ్యమని తెలిపారు. టిడిపి జిల్లా ఉపాధ్యక్షులు దేశాయ్ మాధవరావు, మండల కన్వీనర్ చిన్న రాముడు, మండల ఉపాధ్యక్షులు కాశీంవలీ, టిడిపి నాయకులు ధర్మాపురం గోపాల్, మస్తాన్, షరీఫ్, గిర్ని ఈషా, రెహ్మాన్, వడ్డే గోపాల్, గడ్డం రామన్న, విశ్వనాథ్, నరసప్ప పాల్గొన్నారు. **మంత్రాలయం** మండలంలోని చిలుకలడోన గ్రామంలో క్లస్టర్ ఇన్‌ఛార్జీ ఎల్లారెడ్డి ఆధ్వర్యంలో టిడిపి రాష్ట్ర కార్యదర్శి పాలకుర్తి శ్రీనివాస్ 'ఇదేం ఖర్మ... మన రాష్ట్రానికి' నిర్వహించారు. మాజీ సర్పంచి హనుమంతు పాల్గొన్నారు.

ఎలా బతికేది..?

- చెత్త సేకరణ వాహన డ్రైవర్ల ఆందోళన
- నిలిచిన చెత్త సేకరణ
- అకారణంగా తొలగిస్తున్నారని ఆక్రోశం

ప్రజాశక్తి - ఆదోని

ఇంటింటి చెత్త సేకరణ కోసం ఏర్పాటు చేసిన వాహనాల డ్రైవర్లు ఆందోళన బాట పట్టారు. అకారణంగా వాహనాలు రద్దు చేసి తమ ఉద్యోగాలను తొలగిస్తున్నారని ఏజెన్సీ నిర్వాహకులపై ఆక్రోశం వెల్లగక్కారు. సమాధానం చెప్పాల్సిన అధికారులు చేతులెత్తేసి ఏజెన్సీ నిర్వాహకులను అడగాలని చెప్పడంతో వాహన డ్రైవర్లు అయోమయంలో పడ్డారు.

ఆదోని పట్టణంలో 42 వార్డులకు గాను వార్డుకు ఒకటి చొప్పున చెత్త తరలింపు వాహనం ఏర్పాటు చేశారు. ఈ బాధ్యతలను ఆదోని మున్సిపాలిటీలో రెడ్డి ఏజెన్సీకి ప్రభుత్వం అప్పగించింది. మొదట్లో డిపాజిట్ల పేరుతో ఏజెన్సీ నిర్వాహకులు ఒక్కొక్కరి నుంచి రూ.50 వేల చొప్పున వసూలు చేసినట్లు డ్రైవర్లు తెలిపారు. ఉన్నపలంగా ఐదు వాహనాలను తొలగించడంతో తాము రోడ్డున పడ్డామని వాపోయారు. తమకు న్యాయం చేయాలని సోమవారం పట్టణంలోని మున్సిపల్ కార్యాలయం వద్ద తడి, పొడి చెత్త సేకరణ వాహన డ్రైవర్లు ఆందోళన చేపట్టారు. క్లీన్ ఆంధ్రప్రదేశ్ కార్యక్రమంలో ఇంటింటికి వెళ్లి తడి, పొడి చెత్త సేకరిస్తున్న వాహనాలను ఆదోని పట్టణంలో వార్డుకొకటి చొప్పున 42 వాహనాలు ఉండేవని, రెడ్డి ఏజెన్సీ ద్వారా వాహన డ్రైవర్ల నియామకాలు చేపట్టారని తెలిపారు. ఒక్కొక్కరికి రూ.10 వేల చొప్పున జీతభత్యాలు చెల్లించేవారన్నారు.

చెత్త పన్ను వసూలు కాక : ఆదోనిలోని పలు వార్డుల్లో చెత్త పన్ను వసూలుపై ప్రజల్లో తీవ్ర వ్యతిరేకత రావడంతో కాలనీలో పన్ను వసూలు తలనొప్పిగా మారింది. టార్గెట్ రీచ్ కాకపోవడంతో వాహనాలను క్రమంగా తగ్గిస్తూ వస్తూ తమ పొట్టగొట్టారని వాహన డ్రైవర్లు పేర్కొన్నారు. 42 గాను దఫాలవారీగా వాహనాలను తగ్గిస్తూ వచ్చారు. ఇటీవలే మరో 5 వాహనాలను తొలగించి ఇతర ప్రాంతాలకు వాహనాలను తీసుకెళ్లడంతో వాహనాలను అడ్డుకున్నామని డ్రైవర్లు తెలిపారు.

అక్రమాలకు తెర : మొదట్లో డ్రైవర్‌గా నియమించేటప్పుడు ఒక్కొక్కరి నుంచి రూ.20 వేల నుంచి రూ.50 వేల వరకు అడ్వాన్స్ తీసుకున్నారు. రెండు నెలలైనా జీతాలు లేవని, ఉన్న ఉపాధి పోయి రోడ్డుపై పడ్డామని డ్రైవర్లు ఆగ్రహం వ్యక్తం చేశారు. మున్సిపల్ అధికారుల దృష్టికి తీసుకెళ్లగా అది ఏజెన్సీకి సంబంధించిందని చేతులు దులుపుకున్నారు. డ్రైవర్లుగా నియమితులైనప్పుడు 4 ఏళ్ల అగ్రిమెంట్ ఉందని తెలిపారు. తమకు ప్రత్యామ్నాయంగా ఉపాధి చూపి న్యాయం జరిగేంత వరకు తడి, పొడి చెత్త వాహనాలను బయటకు తీయమని డ్రైవర్లు భీష్మించారు.



మున్సిపల్ కార్యాలయ గేట్ ముందు ఆందోళన చేస్తున్న వాహన డ్రైవర్లు

చెత్త పన్ను వసూలు వద్దన్న ఎమ్మెల్యే : ప్రజలకు తలనొప్పిగా ఉన్న చెత్త పన్ను వసూలు చేయవద్దని పలు సందర్భాల్లో ఎమ్మెల్యే సాయి ప్రసాద్ రెడ్డి ప్రకటించారు. స్లమ్ములో నెలకు రూ.30, రిచ్ ఏరియాలో రూ.45 వసూలు చేయాలని నిర్ణయించారు. ప్రభుత్వ నిబంధనలకు విరుద్ధంగా అన్ని ప్రాంతాల్లో రూ.45 వసూలు చేయాలని అధికారులు చర్యలు తీసుకోవడంతో ప్రజల వ్యతిరేకత మొదలైంది.

మా పొట్ట కొట్టారు - మారాజు, ట్రక్ డ్రైవర్

ఉద్యోగం వస్తుందనే ఆశతో నగదు చెల్లించి డ్రైవర్‌గా చేరాను. మొదట్లో సక్రమంగా జీతాలు ఇచ్చిన ఏజెన్సీ నిర్వాహకులు రాను రాను జాప్యం చేస్తూ వద్దనకుండా పొగ పెట్టినట్లు వ్యవహరించారు. మేము సక్రమంగా విధులు నిర్వర్తించినా పన్ను వసూలు కాలేదన్న నెపంతో వాహనాలను తగ్గించి ఇతర ప్రాంతాలకు తరలిస్తున్నారు. ఉన్నపలంగా ఉద్యోగం తొలగించడం వల్ల మేమెలా బతికేది. ప్రభుత్వం న్యాయం చేయాలి

మాకు న్యాయం చేయాలి - ప్రసాద్, ట్రక్ డ్రైవర్

ఉదయం ఇంటింటి చెత్త సేకరణ బాధ్యతగా చేస్తున్నాం. పన్ను వసూలు చేయడంలో నిర్లక్ష్యం కారణంగా మమ్మల్ని విధుల నుంచి తొలగించడం ఎంతవరకు సమంజసం. విధుల్లోకి చేరే సమయంలో నాలుగేళ్ల అగ్రిమెంట్ రాయించుకొని అకారణంగా తొలగించే కుట్ర చేస్తున్నారు. ప్రభుత్వం జోక్యం చేసుకొని మాకు న్యాయం చేయాలి.

నీటి సంపునకు భూమిపూజ

- హామీ నిలుపుకున్న ఎమ్మెల్యే బాలనాగిరెడ్డి

ప్రజాశక్తి - మంత్రాలయం

మండలంలోని చెట్నిహళ్లి గ్రామంలో నీటి సంపు నిర్మిస్తామని ఇచ్చిన హామీని ఎమ్మెల్యే వై.బాలనాగిరెడ్డి నిలుపుకున్నారు. 40 వేల లీటర్ల నీటి సామర్థ్యం గల సంపు నిర్మాణానికి సోమవారం సర్పంచి అంజినయ్య భూమి పూజ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. ఆగస్టు 20న ఎమ్మెల్యే వై.బాలనాగిరెడ్డి, వైసిపి రాష్ట్ర యూత్ కమిటీ సభ్యులు వై.ప్రదీప్ రెడ్డి 'గడపగడపకు మన ప్రభుత్వం' నిర్వహించారని తెలిపారు. గ్రామంలో నీటి ఎద్దడి ఉందని పలువురు ఎమ్మెల్యే దృష్టికి తీసుకొచ్చారని చెప్పారు. మంచి నీటి సంపు ఏర్పాటు చేసి సమస్య పరిష్కారానికి కృషి చేస్తామని హామీ ఇచ్చారని తెలిపారు. హామీలో భాగంగా ఎమ్మెల్యే బాలనాగిరెడ్డి ఆదేశాల మేరకు రూ.5 లక్షలతో తాగునీటి సంపు నిర్మాణానికి భూమి పూజ చేసి పనులు ప్రారంభించామని పేర్కొన్నారు. ఆర్‌డబ్ల్యుఎస్ ఎఇ వేద స్వరూప, మాజీ సర్పంచి అల్లింగప్ప, నాయకులు గంగుల వెంకటేష్ ఉన్నారు.

వర్షాల సమయంలో జాగ్రత్తలు తీసుకోవాలి : తహశీల్దార్

ప్రజాశక్తి - చిప్పగిరి

వర్షాలు కురుస్తున్న సమయంలో తగిన జాగ్రత్తలతో ఉండాలని తహశీల్దార్ లక్ష్మీనారాయణ మండల ప్రజలకు సూచించారు. సోమవారం తహశీల్దార్ కార్యాలయంలో ఆయన మాట్లాడారు. విద్యుత్ స్తంభాలకు చాలా దూరంగా ఉండాలన్నారు. కొంతమంది రైతులు స్తంభాలకు పశువులను కట్టేస్తున్నారని, వర్షం సమయంలో ప్రమాదకరమని అన్నారు. మట్టి మిద్దెల్లో ఉన్నవారు కూడా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. తడి ఉన్న విద్యుత్ బోర్డులను తాకకూడదని తెలిపారు. రైతులు బోరుబావులకు దగ్గర ఉన్న ట్రాన్స్‌ఫార్మర్లను, సాగునీరు అందించే మోటార్ దగ్గర చాలా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు.

కర్ణాటక మద్యం సీజ్

ప్రజాశక్తి - ఎమ్మిగనూరు రూరల్

మంత్రాలయం మండలం మాధవరం చెక్‌పోస్ట్ వద్ద వాహనాల తనిఖీలో భాగంగా కర్ణాటక మద్యం స్వాధీనం చేసుకున్నట్లు సిఐ జయరాం నాయుడు తెలిపారు. సోమవారం సెబ్ కార్యాలయంలో సెబ్ అధికారులు విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా సిఐ జయరాం నాయుడు, ఎస్ఐలు సోమశేఖర రావు, చంద్రమోహన్ మాట్లాడారు. మంత్రాలయం మండలం మాధవరం చెక్‌పోస్ట్ వద్ద వాహనాల తనిఖీ చేపట్టినట్లు తెలిపారు. టాటా ఇండిగో కారులో కర్ణాటక మద్యం 30 బాక్సుల టెట్రా ప్యాకెట్లు (2880) స్వాధీనం చేసుకున్నట్లు చెప్పారు. దీని విలువ రూ.1.20 లక్షలు ఉంటుందన్నారు. వీటిని తరలిస్తున్న పల్లెపాడు లక్ష్మయ్య, ఆదోని శివశంకర్, రాచుమర్రి ఉరుకుందుపై కేసు నమోదు చేసి, కర్ణాటక మద్యాన్ని సీజ్ చేసినట్లు తెలిపారు. హెడ్ కానిస్టేబుళ్లు చంద్రమౌళి, రబ్బాని, గోపాల్, ప్రసాద్, కానిస్టేబుళ్లు రామచంద్రుడు, నరసింహారెడ్డి, రాధమ్మ, ఇందు, చంద్రన్న సూర్యప్రకాష్ పాల్గొన్నారు.

ఇళ్ల నిర్మాణాలపై ప్రత్యేక దృష్టి : ఎమ్మెల్యే

ప్రజాశక్తి - కోసిగి రూరల్

జగనన్న కాలనీల్లో ఇళ్ల నిర్మాణాలపై ప్రత్యేక దృష్టి సారిస్తున్నట్లు ఎమ్మెల్యే వై.బాలనాగిరెడ్డి తెలిపారు. సోమవారం కోసిగిలో జగనన్న కాలనీలో గృహ నిర్మాణ శాఖ, వెంకటేశ్వర కన్‌స్ట్రక్షన్ ఆధ్వర్యంలో థర్డ్ పార్టీ వారు నిర్మించి ఇస్తున్న ఇళ్లకు భూమి పూజ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే బాలనాగిరెడ్డి మాట్లాడారు. ఇల్లు కట్టుకోలేని వారి ఒప్పందం మేరకు థర్డ్ పార్టీ ఆధ్వర్యంలో ఇల్లు నిర్మించి ఇస్తున్నట్లు తెలిపారు. జగనన్న కాలనీలో ఇప్పటివరకు 464 మంది లబ్ధిదారులు ముందుకొచ్చారని చెప్పారు. పట్టా ఇచ్చి ఇల్లు మంజూరు కానివారు ఉంటే గృహ నిర్మాణ శాఖ అధికారులను సంప్రదించాలని తెలిపారు. వైసిపి మండల ఇన్‌ఛార్జీ మురళీ మోహన్ రెడ్డి, హౌసింగ్ డిఇ కృష్ణయ్య, ఎఇ షేక్షావలీ, సర్పంచి అయ్యమ్మ, ఎంపిపి ఈరన్న, మండల సీనియర్ నాయకులు నాడిగేని నరసింహులు, మండల నాయకులు నాడిగేని నాగరాజు, మాణిక్యరాజు, జగదీష్ స్వామి, హోళగుంద కోసిగయ్య, ఉరుకుంద ఈరన్న స్వామి దేవస్థానం బోర్డు సభ్యులు బుళ్లి నరసింహులు, కాంట్రాక్టర్ బసిరెడ్డి, పి.నాగేష్, రాజేష్ పాల్గొన్నారు.



ఇళ్ల నిర్మాణానికి భూమి పూజ చేస్తున్న ఎమ్మెల్యే బాలనాగిరెడ్డి

సమస్యల పరిష్కారానికే 'గడపగడపకు' : ప్రజా సమస్యల పరిష్కారం కోసమే 'గడపగడపకు మన ప్రభుత్వం' నిర్వహిస్తున్నట్లు ఎమ్మెల్యే బాల నాగిరెడ్డి తెలిపారు. కోసిగి 1వ సచివాలయంలో ఎంపిడిఒ రాజేంద్ర ప్రసాద్ ఆధ్వరంలో సర్పంచి అయ్యమ్మ అధ్యక్షతన 'గడపగడపకు మన ప్రభుత్వం' నిర్వహించారు.

మార్చి వరకు సాగు నీరిస్తామని ప్రకటించాలి

- అఖిలపక్షం ఆధ్వర్యంలో తహశీల్దార్‌కు వినతి

ప్రజాశక్తి - దేవనకొండ



వినతిపత్రం సమర్పిస్తున్న అఖిలపక్ష నాయకులు

రబీ సీజన్ పూర్తయ్యే వరకు హంద్రీనీవా కింద సాగు చేసిన రైతులకు సాగునీరిస్తామని ప్రభుత్వం, అధికారులు, ప్రజా ప్రతినిధులు ప్రకటించాలని అఖిలపక్ష నాయకులు కోరారు. సోమవారం అఖిలపక్షం ఆధ్వర్యంలో తహశీల్దార్‌కు వినతిపత్రం అందజేశారు. అనంతరం తహశీల్దార్ కార్యాలయం ముందు బైఠాయించారు. ఈ సందర్భంగా సిపిఎం జిల్లా నాయకులు వీరశేఖర్, టిడిపి మండల కన్వీనర్ విజయ్ గౌడ్, సిపిఐ మండల కార్యదర్శి ఎం.నరసారావు, లోక్‌సత్తా నాయకులు రామదాసు గౌడ్, జనసేన నాయకులు మక్బుల్, కాంగ్రెస్ నాయకులు గొర్రెల శ్రీనివాసులు మాట్లాడారు. హంద్రీనీవా అధికారులు రైతుల పట్ల నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని తెలిపారు. రబీ సీజన్ మొదలయ్యే వరకు ఎలాంటి ప్రకటనా చేయకుండా రైతులు పంటలు సాగు చేసిన తర్వాత డిసెంబర్ చివరి వరకు మాత్రమే నీరిస్తామని ప్రకటించారని చెప్పారు. మండల రైతులు, హంద్రీనీవా కింద సాగు చేసుకున్న రైతులు నష్టపోతారని ఆవేదన వ్యక్తం చేశారు. టిడిపి నాయకులు బండ్లయ్య, మలకన్న, సిపిఎం నాయకులు యూసుఫ్ బాషా, అశోక్, సిపిఐ నాయకులు సుల్తాన్, మధుబాబు, రవికుమార్, వీరన్న, మురళీ పాల్గొన్నారు.

పంట నష్టపోయిన రైతులను ఆదుకోవాలి

- సిపిఐ, ఎఐకెఎస్ ఆధ్వర్యంలో రౌండ్ టేబుల్ సమావేశం

ప్రజాశక్తి-ఆలూరు

ఖరీఫ్‌లో అధిక వర్షాలతో, నకిలీ పత్తి విత్తనాలతో పంటలు నష్టపోయిన రైతులను ఆదుకోవాలని టిడిపి రైతు సంఘం రాష్ట్ర కార్యదర్శి సి.నారాయణ రెడ్డి, రైతుసంఘం (సిపిఐ) జిల్లా అధ్యక్షులు లక్ష్మణ్ రెడ్డి, రైతు సంఘం (సిపిఎం) మండల కార్యదర్శి ఈరన్న కోరారు. సోమవారం ఆలూరు జూనియర్ కళాశాల ఆడిటోరియంలో సిపిఐ మండల కార్యదర్శి రామాంజనేయులు అధ్యక్షతన రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. ప్రస్తుత ఖరీఫ్ సీజన్‌లో సకాలంలో వర్షాలు రావడంతో రైతులు ప్రధాన పంటలైన ఉల్లి, మిరప, వరి, పత్తి, వేరుశనగ, కంది, ఆముదం, జొన్న, కొర్ర తదితర పంటలు సాగు చేశారని తెలిపారు. పంటలు ఆశాజనకంగా ఉండి చేతికొచ్చే సమయంలో అక్టోబర్‌లో అధిక వర్షాలు కురవడంతో పంటలు కుళ్లిపోవడం, మొలకలు రావడంతో రైతులు తీవ్రంగా నష్టపోయారని చెప్పారు. జిల్లాలో నకిలీ పత్తి విత్తనాల దందా ఆగడాలు ఎక్కువయ్యాయని తెలిపారు. పంట పెరిగాక కేవలం మొక్కలు మాత్రమే ఉన్నాయని, కాయలు లేవని అన్నారు. జిల్లాలో అధికార పార్టీ ప్రజాప్రతినిధులే నకిలీ విత్తనాలను విక్రయిస్తున్నారని తెలిపారు. అమ్మకందారులను ప్రోత్సహించడం దుర్మార్గపు చర్య అని ఆగ్రహం వ్యక్తం చేశారు. గ్రామీణ ప్రాంతాల్లో ఆర్‌బికెలు కూడా రైతుల సమస్యలు పరిష్కరించడంలో విఫలమయ్యాయని విమర్శించారు. పంట నష్టపరిహారాన్ని అంచనా వేసేందుకు కేంద్ర పరిశీలన బృందం జిల్లాలో పర్యటించాలని, పంటల బీమా పథకం పూర్తి స్థాయిలో అమలు చేయాలని కోరారు. ఖరీఫ్ సీజన్‌లో రైతులు బ్యాంకుల్లో తీసుకున్న పంట రుణాలను మాఫీ చేయాలని డిమాండ్ చేశారు. సిపిఐ, ఎఐకెఎస్ ఆధ్వర్యంలో జిల్లాలో 4 బృందాలుగా ఏర్పడి ఈనెల 16 నుంచి 20 వరకు జరిగే రైతు రక్షణ కాలినడక యాత్రలో ప్రజలు, రైతులు పాల్గొని జయప్రదం చేయాలని కోరారు.



మాట్లాడుతున్న టిడిపి రైతు సంఘం రాష్ట్ర కార్యదర్శి నారాయణరెడ్డి

సిపిఎం నాయకులు కెపి.నారాయణస్వామి, సిపిఐ నాయకులు భూపేష్, జనసేన నాయకులు ఛత్రపతి, సిపిఐ టౌన్ సెక్రటరీ మునిస్వామి, రైతు సంఘం మండల కార్యదర్శి హోతూరప్ప, గోపాల్, ఎఐటియుసి తాలూకా అధ్యక్షులు శివ, సిద్ధ, తెలుగు యువత జిల్లా అధికార ప్రతినిధి సురేంద్ర, ఎఐఎస్ఎఫ్ మండల అధ్యక్షులు దుర్గా నాయక్, సంతోష్, సాయికుమార్, రాజేష్ పాల్గొన్నారు.



వినతిపత్రం అందజేస్తున్న దివాకర్‌రెడ్డి

గంజాయి, డ్రగ్స్ సరఫరా చేసే వారిని అరెస్టు చేయాలి

- తెలుగు యువత జిల్లా ప్రధాన కార్యదర్శి పాలకుర్తి దివాకర్ రెడ్డి

ప్రజాశక్తి - మంత్రాలయం

సరిహద్దు ప్రాంతాల నుంచి యువత గంజాయి, డ్రగ్స్‌ను సరఫరా చేస్తున్నారని, వారిని వెంటనే అరెస్టు చేయాలని తెలుగు యువత జిల్లా ప్రధాన కార్యదర్శి పాలకుర్తి దివాకర్ రెడ్డి కోరారు. సోమవారం పోలీసు స్టేషన్‌లో ఎస్ఐ వేణుగోపాల్ రాజుకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. రాష్ట్రం నుంచే సరిహద్దులు దాటి దేశం మొత్తానికి గంజాయి సరఫరా అవుతోందని తెలిపారు. డ్రగ్స్ వినియోగానికి ప్రధాన కారణం నిరుద్యోగమన్నారు. జగన్మోహన్ రెడ్డి పాలనలో గంజాయి, డ్రగ్స్ మాఫియాకు రాష్ట్రం నిలయంగా మారిందని విమర్శించారు. అంతకుముందు దివాకర్ రెడ్డి ఆధ్వర్యంలో సుంకేశ్వరి గ్రామంలో 'ఇదేం ఖర్మ... మన రాష్ట్రానికి' నిర్వహించారు. రచ్చుమర్రి గ్రామంలో టిడిపి నాయకులు నరసింహులు ఆధ్వర్యంలో 'ఇదేం ఖర్మ' నిర్వహించారు. పన్నగ నాగశయన, విజయరామిరెడ్డి, సాయికుమార్ రెడ్డి, చిదానంద, ఏబు, తిక్కస్వామి గౌడు, లక్ష్మయ్య, రవి, నాగరాజు, శివ పాల్గొన్నారు.

జీతాలు చెల్లించకపోవడం దారుణం : యుటిఎఫ్

ప్రజాశక్తి - గోనెగండ్ల

ప్రభుత్వ ఉద్యోగులకు 14 రోజులు దాటినా నవంబర్‌కు సంబంధించిన జీతాలు, పెన్షనర్లకు పింఛన్లు చెల్లించకపోవడం దారుణమని యుటిఎఫ్ జిల్లా కార్యదర్శి ఎస్.నరసింహులు తెలిపారు. సోమవారం గోనెగండ్లలో యుటిఎఫ్ మండల అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు యు.చంద్రపాల్, జి.రామన్ ఆధ్వర్యంలో సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ... డిసెంబరులో 14 రోజులు గడిచినా ఉద్యోగులకు జీతాలు అందకపోవడం వల్ల ఉద్యోగులు, కుటుంబాలు ఇబ్బందులు పడుతున్నాయని తెలిపారు. రాఘవేంద్ర, జిక్రియ, వెంకటరమణ, విజయ్ కుమార్, శంకర్ నాయక్, నాగేశ్వర రావు, బాబు, ఖాజన్న, అక్బర్, హుస్సేన్, లక్ష్మణ్, సుంకన్న, మద్దిలేటి, నాగరాజు పాల్గొన్నారు.

బయో మాయ..!

- అనుమతి లేకుండా జోరుగా నకిలీ ఎరువుల విక్రయాలు

విత్తనం విత్తింది మొదలు.. కోతలు కోసే వరకు రైతులు దగా పడుతూనే ఉంటారు. అక్రమార్జనే ధ్యేయంగా కొందరు చేసే నకిలీ విత్తనాలు, ఎరువులు, పురుగుమందుల వ్యాపారంతో రైతులు కుదేలవుతున్నారు. గ్రామీణ ప్రాంతాల్లోని రైతులను లక్ష్యంగా చేసుకుంటున్న కొందరు వ్యాపారులు విత్తనాల సమయంలో, ఎరువులు వేసే సమయంలో తమ దందా సాగిస్తూ దగా చేస్తున్నారు. ప్రస్తుతం ఎరువులు, పురుగుమందుల వేసే సీజన్ కావడంతో బయో ఫెర్టిలైజర్ కెమికల్ పేరుతో జిల్లాలో అనుమతి లేని నకిలీలను తెరచాటున అమ్మకాలు చేపడుతున్నారు.

ప్రజాశక్తి-ఆదోనిరూరల్

కర్నూలు కేంద్రంగా ఉత్పత్తులను మార్కెట్‌లోకి తెస్తున్న కొన్ని కంపెనీలు జిల్లాలోకి ప్రవేశిస్తున్నాయి. గ్రామాల్లో తమకు అనుకూలమైన కొందరు వ్యాపారులను గుర్తించి, లైసెన్సులు లేని వారికి ఈ బయో ఎరువులు, కెమికల్స్ పంపించి వారి ద్వారా రైతులకు విక్రయిస్తున్నారు. ఈ నేపథ్యంలో ఉమ్మడి జిల్లాలో ఈ నకిలీ బయో ఫెర్టిలైజర్స్ వ్యాపారం జోరుగా సాగుతోంది. కొందరు వ్యాపారులు సంప్రదాయబద్ధంగా వాడుతున్న ఎరువులు కాకుండా బయోఎరువులు, కెమికల్స్ వాడాలని ప్రోత్సహిస్తున్నారు. అమ్మకాలను బట్టి కమీషన్లు ఇస్తుండడంతో బయోఎరువులు, రసాయనాలతో పాటు ఇతర పోషకాలు నేరుగా మొక్కకే అందుతాయని, కాయ, పూత ఉంటుందని, ఉత్పత్తులు అధికంగా వస్తాయని, చీడపీడలు రావని ప్రచారం సాగిస్తూ రైతులను ఆకట్టుకుంటున్నారు. తెరచాటున సాగుతున్న బయో ఎరువులు, రసాయనాలు, ఇతర ఉత్పత్తుల వ్యాపారం గుట్టు రట్టు కావడంతో మండలంలోని పెసలబండ గ్రామంలో అధికారులు సోమవారం దాడులు చేపట్టారు.



నకిలీ ఎరువులు, మందులను పరిశీలిస్తున్న వ్యవసాయ శాఖ

బయో ఉత్పత్తుల పట్టివేత

అనుమతి లేని ఎరువులు, మందులను గ్రామాల్లో రైతులకు అంటగడుతున్న ఓ ముఠా దందాను ఆదోని మండలం పెసలబండ గ్రామంలో వ్యవసాయాధికారులు పట్టుకున్నారు. డివిజన్ వ్యవసాయ శాఖ అధికారి గిరీష్, ఎఒ పాపిరెడ్డి వివరాల మేరకు... పెసలబండ గ్రామంలోని సిహెచ్.వెంకట్రావు నివాసంలో అనుమతులు లేని బయో ఉత్పత్తులను పట్టుకున్నారు. రెవెన్యూ, పోలీసు వారి సహకారంతో రూ.6.31 లక్షల విలువ గల ఉత్పత్తులను పంచనామ నిర్వహించి సీజ్ చేశారు. దాదాపు 9 రకాల బయో ఉత్పత్తుల నమూనాలు సేకరించి ల్యాబ్‌కు పంపారు.

వాడీవేడిగా మండల సమావేశం

- నీటి సమస్యను పరిష్కరించాలని ప్రజాప్రతినిధులు బైఠాయింపు
- అధికారుల తీరుపై ఆగ్రహం

ప్రజాశక్తి - ఆస్పరి

ఆస్పరి మండల సర్వసభ్య సమావేశం రసాభాసగా సాగింది. గ్రామాల్లో నెలకొన్న నీటి సమస్య పరిష్కరించాలని టిడిపి ప్రజాప్రతినిధులు నరసప్ప, రహీంతుల్లా బైఠాయించారు. సోమవారం మండల పరిషత్ కార్యాలయంలో ఎంపిపి సుంకర ఉమాదేవి అధ్యక్షతన మండల సర్వసభ్య సమావేశం వాడీవేడిగా సాగింది. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. గ్రామాల్లో నెలకొన్న తాగునీటి సమస్య పరిష్కారం కోసం జలజీవన్ ద్వారా ఇంటింటికీ కుళాయి కనెక్షన్ ఇవ్వాలని టిడిపి ఎంపిటిసి నరసప్ప డిమాండ్ చేశారు. ఎంపిడిఒ మాట్లాడుతూ... జలజీవన్ ద్వారా ఇంటింటికీ కుళాయి మంజూరయ్యేలా చూస్తామన్నారు. తొగలగల్లు సర్పంచి అంజినయ్య మాట్లాడుతూ... పంచాయతీ పరిధిలో పూరి గుడిసెల్లో నివాసం ఉంటున్న 40 మంది నిరుపేదలకు నూతన గృహాలు మంజూరు చేయాలని హౌసింగ్ అధికారుల చుట్టూ తిరిగినా పట్టించు కోవడం లేదని తెలిపారు. అధికార పార్టీ నాయకులకు మాత్రం ఆగమేఘాల మీద ఆన్‌లైన్‌లో నమోదు చేస్తున్నారని చెప్పారు. విచారణ చేపట్టి బాధ్యులపై చర్యలు తీసుకుంటానని ఎంపిడిఒ మల్లేశ్వరి హామీ ఇచ్చారు. డి.కోటకొండ సిపిఐ ఎంపిటిసి అటికెలగుండు రంగమ్మ మాట్లాడుతూ... గ్రామంలో ఎక్కడి సమస్యలు అక్కడే తిష్ట వేశాయని తెలిపారు. సిసి రోడ్లు, డ్రెయినేజీలు లేకపోవడంతో మురుగునీరు రోడ్లపైకి చేరి దుర్వాసన వెదజల్లుతోందని చెప్పారు. గ్రామానికి వచ్చే ప్రధాన రహదారి గుంతలమయంగా మారడంతో ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తెలిపారు. 'గడపగడపకు' కార్యక్రమంలో మంత్రి దృష్టికి తీసుకెళ్లినా పరిష్కారం కాలేదని చెప్పారు. రెవెన్యూ కార్యాలయం అవినీతికి నిలయంగా మారిందని తెలిపారు. మండలాన్ని కరువుగా ప్రకటించి సహాయక చర్యలు చేపట్టాలని, ఎంపిటిసిల గౌరవ వేతనం రూ.20 వేలకు పెంచాలని సభను వాకౌట్ చేసి, కింద కూర్చొని నినాదాలు చేస్తూ నిరసన వ్యక్తం చేశారు. ఎంపిపి సుంకర ఉమాదేవి మాట్లాడుతూ... గ్రామాల్లో నెలకొన్న సమస్యల పరిష్కారానికి ప్రతి మూడు నెలలకోసారి సమావేశం నిర్వహిస్తున్నామని తెలిపారు. డిప్యూటీ తహశీల్దార్ రమణబాబు పాల్గొన్నారు.



సమావేశంలో బైఠాయించిన ప్రజాప్రతినిధులు

15, 16న సర్పంచులకు, ఎంపిటిసిలకు శిక్షణ : ఎంపిడిఒ

ప్రజాశక్తి - కొలిమిగుండ్ల

మండలంలోని ఆయా గ్రామాల సర్పంచులకు, ఎంపిటిసిలకు ఈ నెల 15, 16న శిక్షణా కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు ఎంపిడిఒ సుబ్బరాజు తెలిపారు. సోమవారం ఆయన మాట్లాడుతూ గ్రామ సర్పంచులకు, ఎంపిటిసిలకు, మండల అధికారులకు, శాఖ సచివాలయ ఉద్యోగులకు 2023-24కి సంబంధించి గ్రామ పంచాయతీ అభివృద్ధి ప్రణాళిక అంశంపై శిక్షణా కార్యక్రమం నిర్వహిసున్నట్లు చెప్పారు. మండల పరిషత్ అధ్యక్షుడి కారేపాకుల నాగవేణి ఆధ్వర్యంలో ఈ శిక్షణా కార్యక్రమం మండల పరిషత్ కార్యాలయంలో జరుగుతుందన్నారు. ఈ నెల 15వ తేదీన కొలిమిగుండ్ల, మీర్జాపురం, బెలుం, బెలుం శింగవరం, పెట్నికోట, తుమ్మలపెంట, బి ఉప్పలూరు, ఎర్రగుడి, కమ్మవారిపల్లె, కోటపాడు, పెద్దవెంతర్ల, 16న అంకిరెడ్డి పల్లె, కనకాద్రిపల్లె, ఇటిక్యాల, చింతలయపల్లె, కలవటాల, నందిపాడు, తిమ్మనాయిని పేట, తోళ్లమడుగు, అబ్దుల్లాపురం, ఉమ్మాయిపల్లి తండా, బందార్లపల్లె గ్రామాల వారికి ఉంటుందన్నారు.

ఆర్‌టిసి నూతన బస్ సర్వీస్ ప్రారంభం

ప్రజాశక్తి - నందికొట్కూరు

నందికొట్కూరు పట్టణంలోని ఆర్టీసీ డిపోలో నందికొట్కూరు టు కర్నూలుకు నూతన బస్సు సర్వీసును ఎమ్మెల్యే ఆర్థర్ సోమవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే నూతన బస్సుల పనితీరును స్వయంగా బస్సు నడిపి తనిఖీ చేశారు. పరిమిత వేగంతో బస్సులు నడపాలని డ్రైవర్లకు ఎమ్మెల్యే సుచించారు. కార్యక్రమంలో ఆర్‌టిసి డిపో మేనేజర్ నాగేశ్వరరావు, ఉర్దూ అకాడమీ రాష్ట్ర డైరెక్టర్ అబ్దుల్ షుకూర్, కౌన్సిలర్లు ఉండవల్లి ధర్మారెడ్డి, మొల్ల జాకీర్ హుస్సేన్, సింగిల్ విండో చైర్మన్ సగినేల ఉసేనయ్య, మాజీ సింగిల్ విండో చైర్మన్ చందమాల బాలస్వామి, వైసిపి నాయకులు తమ్మడపల్లి విక్టర్, పేరుమాళ్ళ జాన్, బస్సు యజమాని నాగ మద్దిలేటి తదితరులు పాల్గొన్నారు.

దిశా చట్టంపై అవగాహన అవసరం : ఎస్ఐ

ప్రజాశక్తి - బనగానపల్లె

బాలికలు, మహిళలు దిశా చట్టంపై అవగాహన కలిగి ఉండాలని ఎస్సై రామిరెడ్డి, అమరావతి ముస్లిం మహిళ అసోసియేషన్ అధ్యక్షురాలు షేక్ రజియా పేర్కొన్నారు. సోమవారం పట్టణంలోని కస్తూరిబా పాఠశాలలో దిశా చట్టంపై అవగాహన సదస్సు హెచ్ఆర్‌సి ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మహిళలు, బాలికలపై జరుగుతున్న లైంగిక వేధింపుల నివారణ కోసం దిశా, ఫోక్సో చట్టాలను ప్రభుత్వాలు ఏర్పాటు చేసిందన్నారు. చట్టాలపై విద్యార్థినిలు అవగాహన కలిగి ఉండాలన్నారు. కార్యక్రమంలో ఆల్ ఇండియా కన్స్యూమర్ వెల్ఫేర్ కౌన్సిల్ వైస్ చైర్మన్ కోడి నాగేష్ బాబు, కన్వీనర్ వైవి మల్లారెడ్డి, హ్యూమన్ రైట్స్ అండ్ యాంటీ కరప్షన్ ఫోర్స్ రాష్ట్ర కన్వీనర్ డి నాగస్వామి, జిల్లా అధ్యక్షులు నంద్యాల జిల్లా కార్యదర్శి షాషావలి, కళాశాల ప్రిన్సిపాల్ రేణుక దేవి, ఉపాధ్యాయులు, విద్యార్థినులు పాల్గొన్నారు.

ఎస్‌సి, ఎస్‌టి విజిలెన్స్ కమిటీ మెంబర్‌కు సన్మానం

ప్రజాశక్తి - నందికొట్కూరు

నంద్యాల జిల్లా ఎస్సీ ఎస్టీ విజిలెన్స్ కమిటీ మెంబర్‌గా ఎన్నికైన దిలీప్ రాజును మాల మహానాడు నాయకులు సోమవారం స్థానిక మాల మహానాడు కార్యాలయంలో ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా మాల మహానాడు రాష్ట్ర ఉపాధ్యక్షులు డి. జయ రాముడు పాల్గొని మాట్లాడారు. దిలీప్ రాజు దళితులకు న్యాయం చేయాలని, మరిన్ని ఉన్నత స్థాయి పదవులకు చేరుకోవాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో తాలూకా అధ్యక్షులు నగేష్, సీనియర్ నాయకులు డాక్టర్ రాజు, నాయకులు పాల్గొన్నారు.

తడిసిన వరి ధాన్యాన్ని ఎఒ పరిశీలన

ప్రజాశక్తి - బండి ఆత్మకూర్

మండలంలోని పెద్ద దేవలాపురంలో మాండూస్ తుఫాన్ ప్రభావంతో తడిసిన వరి ధాన్యాన్ని, పొలాల్లో నేలవాలిన వరి పంటలను మండల వ్యవసాయ అధికారి స్వాతి సోమవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ నష్టపోయిన వరి ధాన్యాన్ని గుర్తించి రైతన్నలకు న్యాయం జరిగేలా కృషి చేస్తామని తెలిపారు. కార్యక్రమంలో ఏఈ వసుదానంద, వ్యవసాయ సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

ఆశా వర్కర్లకు వేతనం రూ. 26 వేలు ఇవ్వాలి : సిఐటియు



వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

ప్రజాశక్తి - నందికొట్కూరు

ఆశా వర్కర్లకు కనీస వేతనం రూ. 26 వేలు ఇవ్వాలని సిఐటియు జిల్లా నాయకులు కె.భాస్కర్ రెడ్డి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఆశాల సమస్యలు పరిష్కరించాలని కోరుతూ సోమవారం స్థానిక తహశీల్దార్ ఆఫీస్ ముందు నిరసన తెలిపి డిప్యూటీ తహశీల్దార్ పద్మాతమ్మకు వినతి పత్రం అందజేశారు. ఈ కార్యక్రమానికి ఆశా వర్కర్ల యూనియన్ నాయకురాలు నజీర్నిస అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా సిఐటియు జిల్లా నాయకులు కే.భాస్కర్ రెడ్డి, టౌన్ కార్యదర్శి గోపాలకృష్ణ మాట్లాడారు. ఆశాలకుఉద్యోగ భద్రత కల్పిస్తూ సంక్షేమ పథకాలు అమలు చేయాలన్నారు. రాజకీయ వేధింపులు వెంటనే నిలిపివేయాలన్నారు. ఆశా కార్యకర్తలు డ్యూటీ సమయంలో మరణిస్తే వారి ఇంటి సభ్యుల్లో ఒకరికి ఉద్యోగం ఇవ్వాలన్నారు. అలాగే ఎక్స్‌గ్రేషియా చెల్లించాలన్నారు. కార్యక్రమంలో టౌన్ రూరల్ అధ్యక్షులు ఆర్.జయరాణి, వి.ఆంజనేయులు, ఆశా వర్కర్లు రత్నమ్మ, ప్రభావతి, కృష్ణవేణి నాగస్వాములమ్మ తదితరులు పాల్గొన్నారు.

మెస్, కాస్మోటిక్ చార్జీలు పెంచాలని భిక్షాటన, ధర్నా

ప్రజాశక్తి - నంద్యాల

ఎస్సీ ఎస్టీ, బిసి, మైనార్టీ సంక్షేమ హాస్టల్ విద్యార్థులకు పెరిగిన ధరలకు అనుగుణంగా మెస్, కాస్మోటిక్ చార్జీలను పెంచాలని పిడిఎస్‌యు జిల్లా అధ్యక్షులు ఎస్‌ఎండి.రఫీ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సోమవారం స్థానిక పద్మావతి సర్కిల్‌లో విద్యార్థులతో భిక్షాటన చేపట్టి, అనంతరం ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ హాస్టల్స్‌కు సన్నబియ్యం సరఫరా చేయాలన్నారు. ఖాళీగా ఉన్న హాస్టల్ వార్డెన్, కమాటి, కుక్, వాచ్ మెన్ పోస్టులను భర్తీ చేయాలని డిమాండ్ చేశారు. ఎస్సీ ఎస్టీ, బిసి, మైనార్టీ వర్గాల వారికి పోస్ట్ గ్రాడ్యుయేషన్ విద్యను దూరం చేసే 77జీవోను రద్దు చేయాలని కోరారు. అద్దె భవనాల్లో కొనసాగుతున్న హాస్టల్స్‌కు సొంత భవనాలు ఏర్పాటు చేయాలన్నారు. కేంద్ర ప్రభుత్వం 1 నుండి 8 తరగతులకు ఇచ్చే స్కాలర్ షిప్స్ రద్దు చేయడాన్ని విరమించుకోవాలని డిమాండ్ చేశారు. నేడు జరిగే రాష్ట్ర మంత్రివర్గ సమావేశంలో సమస్యలను, ఫీజు రియంబర్స్ మెంట్ విషయాలను చర్చించి న్యాయం చేయాలని కోరారు. పిడిఎస్యు డివిజన్ అధ్యక్షులు దస్తగిరి, ప్రధాన కార్యదర్శి నవీన్, ఉపాధ్యక్షులు హాజీష్, నాని, కళ్యాణ్, సహాయ కార్యదర్శి రాహుల్, విజయ్, విద్యార్థులు పాల్గొన్నారు.



భిక్షాటన చేస్తూ నిరసన తెలుపుతున్న నాయకులు, విద్యార్థులు

ఆదర్శ పాఠశాలలో స్టెమ్ ల్యాబ్ ప్రారంభం

ప్రజాశక్తి - పగిడ్యాల

పగిడ్యాలలోని ఆదర్శ పాఠశాలలో స్టెమ్ ల్యాబ్‌ను ఎంపిపి మండ్ల మల్లేశ్వరి, మాజీ జెడ్పిటిసి పుల్యాల నాగిరెడ్డి సోమవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. సిఎం జగన్‌మోహన్‌రెడ్డి విద్య కోసం ఎంతో కృషి చేస్తున్నారని తెలిపారు. ల్యాబ్ విద్యార్థులకు ఎలా ఉపయోగపడుతుందని వారు ఆదర్శ పాఠశాల సిబ్బందిని అడిగారు. స్టెమ్ ల్యాబ్ సైన్స్ అండ్ టెక్నాలజీ, ఇంజనీరింగ్, మేథమెటిక్స్ సంబంధించిన సబ్జెక్టులు ఉపాధ్యాయులు విద్యార్థులకు బోధించే సౌకర్యం ఉంటుందని వారు చెప్పారు. విద్యార్థులు ప్రత్యక్షంగా తిలకించి పూర్తి స్థాయిలో అర్థం చేసుకునే అవకాశం ఉందని సిబ్బంది తెలిపారు. కార్యక్రమంలో ఎంఇఒ సుభాన్, సర్పంచు పెరుమాళ్ల శేషన్న తదితరులు పాల్గొన్నారు.



ల్యాబ్ ను ప్రారంభిస్తున్న ఎంపిపి మండ్ల మల్లేశ్వరి

మధ్యాహ్న భోజనంలో నాణ్యత తగ్గితే చర్యలు

మధ్యాహ్న బోజన పథకంలో నాణ్యత తగ్గితే కఠిన చర్యలు తప్పవని ఎంఇఒ సుభాన్ నిర్వాహకులకు హెచ్చరించారు. ఆదర్శ పాఠశాలలో మధ్యాహ్న భోజనాన్ని వారు తనిఖీ చేశారు. అన్నం సక్రమంగా ఉడకలేదని, ఇలా ఉంటే పిల్లలు ఎలా తింటారని నిర్వాహకులను ప్రశ్నించారు. వర్షానికి కట్టెలు తడిసిపోయాయని, అందువలే అన్నం సక్రమంగా ఉడకలేదని నిర్వాహకులు చెప్పారు. కట్టెలు తడవ కుండా చూసుకోవాలని మాజీ జెడ్పిటిసి పుల్యాల నాగిరెడ్డి వారికి సూచించారు. మరోసారి ఇలా జరగకుండా చూసుకోవాలన్నారు.



మధ్యాహ్న భోజన పథకాన్ని తనిఖీ చేస్తున్న ఎంఇఒ, మాజీ జెడ్పిటిసి, సర్పంచు



గుంతలమయంగా ఉన్న రహదారి

అడుగుకో గుంత..

- గుంతల మయంగా రహదారి
- ఇబ్బందులు పడుతున్న వాహనదారులు..

ప్రజాశక్తి - మహానంది

నంద్యాల-గిద్దలూరు జాతీయ రహదారిలో అడుగుకో గుంత ఉండడంతో వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ప్రయాణం ప్రమాదకరంగా మారింది. మహానంది మండల పరిధిలోని గాజులపల్లి గ్రామ సమీపంలో ఉన్న ఆంజనేయ కొట్టాల చెక్‌పోస్ట్ వద్ద జాతీయ రహదారిపై రోడ్డు అడుగుకు ఒక గుంతతో గుంతలమయంగా మారింది. వాహన దారులకు, ప్రజలకు తీవ్రఇబ్బందిగా మారింది. వాహన దారులు నిత్యం ఇబ్బందులు పడుతున్నారు. సంబంధిత అధికారులు పట్టించుకోకపోవడంతో వాహనదారులు, ప్రజలు బహిరంగంగానే విమర్శలు చేస్తున్నారు. దెబ్బతిన్న రహదారులకు ఎప్పటికప్పుడు మరమ్మతులు చేపట్టకపోవడంతో వర్షాల సమయంలో గోతుల్లో నీరు నిలిచిపోతుంది. వాహనాల రద్దీ నేపథ్యంలో రహదారులు మరింత దెబ్బతిని పెద్దపెద్ద గోతులు ఏర్పడుతున్నాయి. గోతులమయంగా తయారైన రహదారులలో ప్రయాణిస్తున్న ప్రజల ఒళ్లు హూనం అవుతోంది. ప్రధానంగా రాత్రి సమయాల్లో వాహన దారులు తీవ్ర ఇక్కట్లు పడడమే కాక గోతుల్లో పడి గాయాలపాలవుతున్నట్లు వాహనదారులు ఆరోపిస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి గతుకులమయంగా మారిన రహదారులకు మరమ్మతులు చేపట్టాలని ప్రజలు, వాహనదారులు కోరుతున్నారు.

ఉపాధ్యాయులపై వివక్ష తగదు

డోన్ : ప్రభుత్వ ఉపాధ్యాయులకు జీతాలు చెల్లించడంలో రాష్ట్ర ప్రభుత్వం పూర్తిగా వివక్ష చూపిస్తుందని బహుజన్ స్టూడెంట్స్ ఫెడరేషన్ రాష్ట్ర అధ్యక్షులు ఎస్.విజయభాస్కర్ అన్నారు. సోమవారం ఆయన మాట్లాడుతూ ఇప్పటికైనా రాష్ట్ర ప్రభుత్వం ఆలోచించి ఉపాధ్యాయులకు తక్షణమే జీతాలు చెల్లించాలని కోరారు. నాయకులు చిరంజీవి, వెంకటేష్, సుంకన్న పాల్గొన్నారు.

చిగురుమాను పేటలో ప్రభుత్వ పాఠశాలలను ఏర్పాటు చేయాలి

నంద్యాల అర్బన్ : డోన్ పట్టణం చిగురుమాను పేటలో ఉండే 'శ్రీ వెంకటేశ్వర హరిజన కమిటీ' ప్రైవేట్ స్కూల్ స్థలం ప్రభుత్వానిదని, ఆ స్థలాన్ని స్వాధీనం చేసుకొని ప్రభుత్వ పాఠశాలలను ఏర్పాటు చేసి నాడు-నేడు కింద అభివృద్ధి చేయాలని ఎఐఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో జిల్లా కలెక్టర్‌కు వినతిపత్రం సమర్పించారు. కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి ధనుంజయుడు, జిల్లా సహాయ కార్యదర్శి సూర్య ప్రతాప్, జిల్లా ఉపాధ్యక్షుడు సురేష్, నాయకులు రవి, వరదరాజులు, మనోజ్ తదితరులు పాల్గొన్నారు.

అందరి సంక్షేమానికి ప్రభుత్వం కృషి : హఫీజ్‌ఖాన్

ప్రజాశక్తి- కర్నూలు క్రైమ్

ముఖ్యమంత్రి వై.యస్ జగన్ మోహన్ రెడ్డి అర్హులైన ప్రతి ఒక్కరికీ సంక్షేమ పథకాలు అందేలా గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం అమలు చేస్తున్నారని కర్నూలు ఎమ్మెల్యే హాఫిజ్ ఖాన్ అన్నారు. సోమవారం కర్నూలు నగరంలోని జొహరాపురం 44వ సచివాలయం పరిధిలోని గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సంధర్భంగా కర్నూలు ఎమ్మెల్యే హాఫిజ్ ఖాన్ మాట్లాడుతూ రాజకీయాలకు అతీతంగా దళిత, గిరిజన, బలహీన వర్గాల ప్రజల సంక్షేమం కోసం వైసిపి ప్రభుత్వం కృషి చేస్తుందని తెలిపారు. వర్షాన్ని కూడా లెక్క చేయకుండా ప్రతి గడపకు వెళ్లి సంక్షేమ పథకాల గురించి ప్రజలను అడిగి తెలుసుకున్నారు. వచ్చే ఎన్నికల్లో జగనన్నని ఆశీర్వదించాలని కోరారు. ఈ కార్యక్రమంలో స్థానిక వార్డు కార్పొరేటర్ పల్లవి, వైసిపి నాయకులు మల్లికార్జున, చిన్న బాబు, కార్యకర్తలు, అధికారులు సచివాలయ సిబ్బంది, వాలంటీర్లు పాల్గొన్నారు.

ఆర్‌టిసి ఖాళీ స్థలంలో వ్యాపారానికి ఆహ్వానం

ప్రజాశక్తి-డోన్

ఎపిఎస్ఆర్‌టిసి డోన్ డిపో పరిధిలోని ఖాళీ స్థలంకు, డోన్ బస్‌స్టేషన్ పరిధిలోని 5953 చదరపు అడుగుల విస్తీర్ణం, వెల్దుర్తి బస్‌స్టేషన్ పరిధిలో4501 ఖాళీ స్థలంలో వ్యాపార నిమిత్తం అనుమతించుకుటకు స్థానిక వ్యాపారులు అద్దెప్రాతిపదికన టెండర్లు పిలువనున్నట్లు డోన్ డిపోమేనేజర్ ఎం.శశిభూషణ్ ఒక ప్రకటనలో తెలిపారు. పట్టణ పరిసర ప్రాంత ప్రజలకు , ఆసక్తి గల వ్యాపార వేత్తలు ఈనెల 14న సాయంత్రం డిపోమేనేజర్ కార్యాలయంలో ఏర్పాటు చేసే ప్రీ బిడ్డింగు మీటింగులో పాల్గొనాలని కోరారు. డెండర్లు సమర్పించుటలకు ఈనెల 20 చివరి తేదిగా నిర్ధారించామని తెలిపారు. పూర్తి వివరాలకు ఆర్‌టిసి వెబ్‌సైట్ www.apsrtc.gov.in లో టెండర్లు చూడాలన్నారు. 9490413703, 7382870111, 9959225795 ఫోన్లనుసంప్రదించాలన్నారు.

రూ 1.50 లక్ష పెట్టుబడి నష్టం

ప్రజాశక్తి- పత్తికొండ

నకిలీపత్తివిత్తనాలతో పత్తికొండ మండలంలో రైతులు భారీగా నష్టపోయారు. రైతుల వివరాల మేరకు పత్తికొండ మండలం చిన్నహుల్తి గ్రామానికి చెందిన రైతు అల్లి సాహెబ్ అయిదు ఎకరాలలో పత్తి పంట సాగు చేశారు. వెంకట సాయి ఏజెన్సీ ఫర్టిలైజర్ షాపులో నందిని సీడ్స్ పత్తి విత్తనాలను కొనుగోలు చేశారు. పత్తి పంట వేసి ఐదు నెలలుత0తత1 కావస్తున్నా పిందా, పూత, కాయలు లేకపోవడంతో నష్టపోయాయని ఆవేదన వ్యక్తం చేశారు. నకిలీ పత్తి విత్తనాలతో నష్టపోయిన రైతు మండల వ్యవసాయ అధికారి వెంకటరాముడుకు సోమవారం కలిసి సమస్యలతో కూడిన వినతిపత్రాన్ని అందజేశారు. రైతు సంఘం మండల కార్యదర్శి సిద్ధి గౌడ్ చిన్న హుల్తి గ్రామ రైతులు తదితరులు పాల్గొన్నారు.

ఈ తాండ్రపాడు లో రైతు సంఘం జండావిష్కరణ

ప్రజాశక్తి -కర్నూలు క్రైమ్



కర్నూల్ మండలం ఈ. తాండ్రపాడు గ్రామంలో ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం ఆధ్వర్యంలో ఆ సంఘం నాయకులు జెండా ఆవిష్కరణ చేశారు. ఆల్ ఇండియా రైతు సంఘం మహాసభలు కేరళ రాష్ట్రంలో జరుగుతున్న సందర్భంగా గ్రామంలో జెండా ఆవిష్కరణ చేశారు. . ఈ జెండా ఆవిష్కరణ సీనియర్ రైతులు ఇ.లక్ష గౌడు, తెలుగు నరసింహులు, గ్రామ సర్పంచి ఎస్. బాలపీర మాట్లాడుతూ దేశంలో రైతులు నరేంద్ర మోడీ ప్రభుత్వాన్ని మెడలు వంచి మూడు నల్ల చట్టాలను రద్దు చేయడం రైతులు గర్వించదగిన విషయమని చెప్పారు. రైతులకు నష్టపరిహారం, ఇన్సూరెన్స్, పంటకు గిట్టుబాటు ధర కల్పించడంలేదని అన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు రైతులను ఎంత మాత్రం పట్టించుకోవడం లేదని, మన రాష్ట్రంలో మోటార్లకి మీటర్లు పెట్టడాన్ని ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం వ్యతిరేకిస్తుందన్నారు. దేశంలో రాష్ట్రంలో అనేక మంది రైతులు ఆత్మహత్య చేసుకున్నారన్నారు. చనిపోయిన రైతులకు ఎక్స్గ్రేస్ కూడా ఇవ్వలేనిది మోడీ ప్రభుత్వం అని చెప్పారు. రైతులు బోండా ఈరన్న, టీ. వెంకటస్వామి,కే. రాజు,మద్దిలేటి,నడిపి మద్దిలేటి,బీ. మునుస్వామి, పిఎండి హుస్సేన్, తదితరులు పాల్గొన్నారు.

మెడిసిన్ విద్యార్థికి పుస్తకాలు వితరణ

ప్రజాశక్తి-కర్నూలు క్రైమ్

మెడిసిన్ లో ఎంబీబీఎస్ సీటును సాధించిన విద్యార్థినికి కర్నూలు ఎమ్మెల్యే హాఫీజ్ ఖాన్, 24వ వార్డు వైసిపి నాయకులు డిష్ రాజు ఆమె చదువులకు అవసరమైన పుస్తకాలను వితరణ చేశారు. కర్నూలు నగరంలోనీ స్థానిక 24వ వార్డు లక్ష్మి నగర్‌కు చెందిన ఉమాగౌరి కుమార్తె అచ్యుతశ్రీ ఇటీవలే కర్నూలు మెడికల్ కాలేజీలో ఎంబిబిఎస్ సీట్ సాధించింది. స్థానిక వైసిప వార్డు నాయకుడు డిష్ రాజు, ఎమ్మెల్యే హాఫిజ్ ఖాన్ చేతులు మీదగా అచ్యుతశ్రీ చదువుకోసం అవసరమైన పుస్తకాలను అందజేశారు. అచ్యుతశ్రీ మాట్లాడుతూ ప్రతి విద్యార్థికి ఏదో ఒక విధమైన ప్రతిభ ఉంటుందని, దాన్ని గ్రహించి మన మేధస్సును మన ప్రతిభ పై ఉంచాలన్నారు. కష్టపడి మనం అనుకున్నది సాదించాలన్నారు. సమాజంలో కొందరికి పరిస్థితులు సహకరించని కారణంగా ముందుకు పోలేకపోతున్నారన్నారు. అలాంటి వారికి సమాజం తరుపున ప్రతీ ఒక్కరు అండగా ధైర్యంగా ఉండాలనే భరోసా కలిపించాలన్నారు. ఇలాంటి సహాయమే నేడు నాకు దక్కిందని, అది తన అదృష్టంగా భావిస్తున్నానన్నారు. ఉన్నత చదువు పూర్తి చేయటం కోసం అవసరమైన పుస్తకాలను నాకు అందజేసిన ఎమ్మెల్యే హాఫిజ్ ఖాన్‌కు, వైసిపి నాయకులు డిష్‌రాజుకు కృతజ్ఞతలు తెలిపారు.



పుస్తకాలను అందజేస్తున్న ఎమ్మెల్యే హాఫీజ్‌ఖాన్

అధిక వర్షాలకు రైతులు జాగ్రత్తలు పాటించాలి

వ్యవసాయ శాఖ జె.డి వరలక్ష్మి

ప్రజాశక్తి-కర్నూలు అగ్రికల్చర్ : ప్రస్తుతం కర్నూలు జిల్లాలో డిసెంబర్ 10 నుండి 13 వరకు కురిసిన వర్షాలకు వరి, మినుము, శనగ, ప్రత్తి, వేరుశనగ, మొక్కజొన్న, కంది, మిరప, ఉల్లి పండ్లు కూరగాయల పంటల పొలాల్లో అధిక తేమ , వర్షపు నీటి ముంపునకు గురై మొక్కలకు "మొదలు కుళ్ళు, వేరు కుళ్ళు ఆశించి నష్టం కలుగ జేయడానికి అవకాశం ఉందన్నారు. అధిక వర్షాల వల్ల కంది, శనగ పంటలో పూమొగ్గ, పూత , కాయలు రాలి పోడానికి అవకాశం ఉందన్నారు. పంటలవారీగా రైతులు కింద తెలిపిన సలహాలు , సూచనలను పాటించాలని వ్యవసాయ శాఖ జెడి వరలక్ష్మి ఒక ప్రకటనలో తెలిపారు. అధిక వర్షాల వల్ల పంటలను ఎలా కాపాడుకోవాలని రైతులకు కొన్ని సూచనలు చేశారు.**వరి:** వరిపంటపొలములో వర్షపు నీరు నిలబడినప్పుడు నీటిని కాలువలు తీసి పూర్తిగా బయటకు పంపాలి. వరి ప్రస్తుతం పంట కోత దశలో ఉన్నది. వరి రకం బిపిటి- 5204 రకం మొలక రావడానికి అవకాశం ఉంది. రైతులు మొలకలు రాకుండా ఉండడానికి 5శాతం ఉప్పు ద్రావణాన్ని పిచికారి చేయాలి. వరి పొలంలో కంకులు వాలి పోయి ఉంటే ఆ దుబ్బులను పైకి లేపి కట్టలుగా కట్టాలి. వర్షాలు ఆగిన తర్వాత పొలాలు ఆరిన తర్వాత ఎకరానికి యూరియా: 25 కేజీ లు, మ్యూరేట్ ఆఫ్ పొటాష్ 25 కేజీ లు వేసుకోవాలి .కాటుక తెగులు వచ్చే అవకాశం ఉన్నందున రైతులు ఎకరాకు ప్రోపి కొనజోల్ (టిల్ట్) 200 గ్రా ములు లేదా హెక్సా కొనజోల్ (కాంటాప్) 400 గ్రాములు ను 200 లీటర్ల నీటిలో కలిపి పిచికారి చేసుకోవాలి. **మొక్కజొన్న:** మొక్కజొన్నలో కాండం తొలుచు పురుగు వచ్చే అవకాశం ఉన్నందున రైతులు ఎకరాకు 60 మి.లీ ల క్లోరాన్ ట్రిలినిప్రోల్ సాయంత్రం వేళలో ఆకుల సుడి మధ్యలో తడుచునట్లు పిచికారి చేయాలి. పురుగు ఉధృతి అధికంగా ఉన్నచో ఎకరాకు 3కిలోల కార్బోఫ్యూరాన్ గుళికలను ఆకుల సుడి మధ్యలో వేయాలి. **కంది:** కంది పంటలో ఆకుచుట్టు పురుగు , మారుక మచ్చల పురుగు వచ్చు అవకాశం ఉన్నది. రైతులు ఆకుచుట్టు పురుగు నివారణకు మోనోక్రోటోఫాస్ 1.6 మి.లీ /లీటరు నీటికి లేదా క్వినాల్ ఫాస్ 2 మి.లీ /లీటరు నీటికి చొప్పున పిచికారి చేయాలి. మారుక మచ్చల పురుగు నివారణకు క్లోరాన్ ట్రిలినిప్రోల్ 0.3 మి.లీ /లీటరు నీటికి లేదా ఇమామేక్టిన్ బెంజోయేట్ 0.4 గ్రాములు /లీటరు నీటికి లేదా స్పినోసాడ్ 0.3 మి.లీ /లీటరు నీటికి చొప్పున పిచికారి చేసుకోవాలన్నారు. **సాధారణ సూచన:** రైతులు అధిక వర్షాలకు పంటపొలంలో నీరు నిలబడినచో వాటిని కాల్వల ద్వారా పూర్తిగా బయటకు పంపాలన్నారు. నీటి ముంపు నుండి పంటను రక్షించుకోవడానికి పొటాషియం నైట్రేట్ (మల్టీ- కె) ఎకరానికి 2 కేజీలు, బోరాన్ 300 గ్రాములు, యురియా 2 కేజీలు లేదా డై అమ్మోనియం ఫాస్ఫేట్ 2కేజీలు 200 లీటర్ల నీటిలో కలిపి మొక్కలు బాగా తడిచే టట్లు 7 రోజుల వ్యవధిలో సూర్యరశ్మి ఉన్నప్పుడు పిచికారి చేసుకోవాలని సూచించారు. త0తత

చట్టపరంగా న్యాయం చేస్తాం :ఎస్‌పి

ప్రజాశక్తి-కర్నూలు క్రైమ్

స్పందనకు వచ్చిన ఫిర్యాదులపై చట్టపరంగా విచారణ జరిపి న్యాయం చేస్తామని జిల్లా ఎస్‌పి సిద్ధార్థ కౌశల్ అన్నారు. జిల్లా పోలీసు కార్యాలయంలో ఎస్‌పి సిద్ధార్థ్ కౌశల్ సోమవారం స్పందన కార్యక్రమం నిర్వహించారు. జిల్లాలోని వివిధ ప్రాంతాల నుండి స్పందనకు వచ్చిన ప్రజల సమస్యల వినతులను స్వీకరించి ఫిర్యాది దారులతో జిల్లా ఎస్‌పి మాట్లాడి వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. స్పందన కార్యక్రమానికి ఈ రోజు మొత్తం 106 ఫిర్యాదులు వచ్చాయి. వచ్చిన ఫిర్యాదుల్లో కొన్ని ...రైల్వే ఉద్యోగం ఇప్పిస్తామని చెప్పి ఒక వ్యక్తి డబ్బులు తీసుకుని మోసం చేశారని కర్నూలు కు చెందిన ప్రదీప్ ఫిర్యాదు చేశారు. ఆర్మీ ఉద్యోగం ఇప్పిస్తామని చెప్పి ఒక వ్యక్తి డబ్బులు తీసుకొని మోసం చేశా దని, డబ్బులు తిరిగి ఇవ్వకుండా ఇబ్బందులకు గురి చేస్తున్నారని కర్నూలు కు చెందిన షాజిదా ఫిర్యాదు చేశారు. తెలిసిన బంధువు నాకు కళ్ళు కనబడవని తెలుసు కుని తనకు పింఛన్ ఇప్పిస్తానని చెప్పి తీసుకెళ్ళి, అనుమానం రాకుండా మా పొలంను అక్రమంగా రిజిష్టర్ చేయించుకుని మోసం చేశారని ఓర్వకల్లు మండలం, నన్నూరు గ్రామానికి చెందిన వెంకటరెడ్డి ఫిర్యాదు చేశారు. ఫోర్జరీ సంతకాలతో తన ఫ్లాట్‌ను కొందరు అక్రమంగా రిజిస్ట్రేషన్ చేయించుకున్నారని కర్నూలు, బి.క్యాంపు సిండికేట్ బ్యాంక్ కాలనీకి చెందిన వీరానందస్వామి ఫిర్యాదు చేశారు. తన కుమార్తెను మానసికంగా హింసించి ఇంటి నుండి గెంటివేసిన అల్లుడిపై చర్యలు తీసుకోవాలని కర్నూలుకు చెందిన షరీఫున్నీసా బేగం ఫిర్యాదు చేశారు.

ఎల్.బండ తండా గ్రామంలో కొందరు వ్యక్తులు కలిసి విస్తృతంగా నాటు సారా కాస్తున్నారని, అరికట్టాలని వెల్దుర్తి మండలం , ఎల్ . బండ గ్రామానికి చెందిన స్వామినాయక్ ఫిర్యాదు చేశారు. స్పందన కార్యక్రమానికి వచ్చిన ఫిర్యాదులన్నింటిపై చట్ట ప్రకారం విచారణ జరిపి, బాధితులకు న్యాయం చేస్తామని, సమస్యలను త్వరితగతిన పరిష్కరి స్తామని ఈ సందర్భంగా జిల్లా ఎస్‌పి సిద్ధార్థ్ కౌశల్ హామీ ఇచ్చారు. ఈ స్పందన కార్యక్రమంలో సెబ్ అడిషనల్ ఎస్‌పి కృష్ణకాంత్ పటేల్, అడిషనల్ ఎస్‌పి అడ్మిన్ డి. ప్రసాద్, డిఎస్‌పి నాగభూషణం పాల్గొన్నారు.



ఫిర్యాలు స్వీకరిస్తున్న ఎస్‌పి సిద్దార్థ్ కౌశల్



పథకాలను వివరిస్తున్న ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్‌రెడ్డి

జగన్ పాలన జన రంజకం: కాటసాని

ప్రజాశక్తి -కర్నూలు హాస్పిటల్

రాష్ట్రంలో అన్ని వర్గాల ప్రజలకు నవరత్నాల పథకం అందజేస్తూ సీఎం జగన్మోహన్ రెడ్డి పాలన జనరంజకంగా కొనసాగుతోందని ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్ రెడ్డి అన్నారు. సోమవారం కాటసాని రాంభూపాల్ రెడ్డి ఆధ్వర్యంలో కల్లూరు అర్బన్ 37 వ వార్డు 94 వ సచివాలయం వీకర్ సెక్షన్ కాలనీలో గడప, గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ఎమ్యెల్యే కాలనీలోని ప్రతీ గడపకు వెళ్లి రాష్ట్రంలో ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్ రెడ్డి చేస్తున్న జనరంజక పాలన, అవినీతి రహిత పాలన గురించి ప్రజలకు వివరిస్తూ జగనన్న ప్రభుత్వాన్ని దీవించాలని కోరారు. ప్రభుత్వం అందించే సంక్షేమ పథకాలను అర్హత కలిగిన ప్రతీ ఒక్కరికి అందేలా చూడాలని సంబంధిత సచివాలయ సిబ్బందిని ఆదేశించారు. ఈకార్యక్రమంలో డిప్యూటీ మేయర్ సిద్దారెడ్డి రేణుక, స్థానిక వార్డ్ కార్పొరేటర్ అయేషా సిద్ధిఖా, కార్పొరేటర్లు గాజులశ్వేతారెడ్డి, ఎ.నాగలక్ష్మీరెడ్డి, నారాయణరెడ్డి, దండు లక్ష్మీకాంత్ రెడ్డి, నాయకులు షరీఫ్, వైజా బాలచంద్రా రెడ్డి, వైసిపి యువజన విభాగం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి అక్కిమి హనుమంతు రెడ్డి, బిసి విభాగం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సత్యం యాదవ్, నాయకులు ఉలిందకొండ కెవి.రమణారెడ్డి, సచివాలయ సిబ్బంది, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

సేవ చేసే వారిని గుర్తించాలి : టిజి.భరత్

ప్రజాశక్తి- కర్నూలు హాస్పిటల్


సమాజంలో సేవ చేసే వారిని గుర్తిస్తే మరిన్ని సేవా కార్యక్రమాలు చేస్తారని కర్నూలు నియోజకవర్గ టిడిపి ఇంచార్జి టిజి.భరత్ అన్నారు. సోమవారం నగరంలోని 48 వ వార్డులో షేర్‌షాసూరి చారిటబుల్ ట్రస్టు ఆధ్వర్యంలో టిజిబి యూత్ తరుపున ఉచిత కంటి అద్దాల పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన టిజి భరత్ స్థానికులకు కంటి అద్దాలు పంపిణీ చేశారు. ఆయన మాట్లాడుతూ ఇటీవల నిర్వహించిన ఉచిత కంటి వైద్య శిబిరంలో వైద్య పరీక్షలు చేయించుకున్న 150 మందికి అద్దాలు అవసరమని డాక్టర్లు చెప్పారన్నారు. అందరికి ఉచితంగా అద్దాలు అందజేస్తున్నట్లు చెప్పారు. ప్రజలు సేవ చేసే వారిని గుర్తించి ప్రోత్సహిస్తే మరిన్ని సేవా కార్యక్రమాలు చేయడానికి అవకాశం ఉంటుందన్నారు.

మైనారిటీలకు మౌలానా ఆజాద్ స్కాలర్‌షిప్‌లను కొనసాగించాలి

ప్రజాశక్తి-కర్నూలు కార్పొరేషన్

బిజెపి ప్రభుత్వం మౌలానా ఆజాద్ స్కాలర్‌షిపులను రద్దును ఉపసంహరించుకోవాలని ఆవాజ్ నగర కార్యదర్శి పి.ఇక్బాల్ హుస్సేన్, నగర నాయకులు ముహమ్మద్ షరీఫ్ లు సోమవారం ఒక సంయుక్త ప్రకటనలో డిమాండ్ చేశారు. పార్లమెంట్ సాక్షిగా నిసిగ్గుగా బిజెపి ప్రభుత్వ మంత్రి స్మృతి ఇరానీ మైనారిటీలకు మౌలానా ఆజాద్ స్కాలర్‌షిప్ ఇచ్చేది లేదని చేసిన ప్రకటనను వెనక్కి తీసుకోవాలని వారు డిమాండ్ చేశారు. ముస్లిం మైనారిటీ సంక్షేమ పథకాలను ఒక్కోటి రద్దు చేస్తూ వస్తున్నారని దుయ్యబట్టారు. బిజెపి దళితుల, మైనార్టీల, సిక్కు, జైన్ తదితర అణగారిన ప్రజల హక్కులను తొక్కి వేస్తుందని వారు ఆగ్రహం వ్యక్తం చేశారు. మొన్ననేమో మైనారిటీ మెరిట్ స్కాలర్‌షిప్పులను రద్దుచేసి, బిజెపి ఈరోజు మౌలానా ఆజాద్ స్కాలర్‌షిప్‌లను రద్దు చేయడం భావ్యం కాదని ఆగ్రహం వ్యక్తం చేశారు. తక్షణమే రద్దు చేసిన మౌలానా అజాద్ స్కాలర్ షిప్, మెరిట్ స్కాలర్‌షిప్‌లను అందజేయాలని కోరారు.

ప్రజాశక్తి
మంగళవారం 13 డిసెంబర్ 2022 5 నంద్యాల





పిఒకు వినతిపత్రం అందజేస్తున్న యుటిఎఫ్ నేతలు

రైతులకు మాండూస్ దెబ్బ

- ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షం
- పలు పంటలకు తీవ్ర నష్టం

ప్రజాశక్తి-కర్నూలు ప్రతినిధి

ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా రైతులకు మాండూస్ దెబ్బ తగులుతోంది. ఎడతెరిపి లేకుండా వర్షం కురుస్తుండటంతో ఓ వైపు పొలాల్లోని పంట నేలకొరగగా మరో వైపు కల్లాల్లోని ధాన్యం పాడయింది. ఇలా మాండూస్‌తో జిల్లా రైతులు తీవ్రంగా నష్టపోతున్నారు..

ఉమ్మడి కర్నూలు జిల్లాలోని రైతులను మాండూస్ తుపాను వణికిస్తోంది. చిరు జల్లుల నుంచి మోస్తరు వర్షంతోపాటు ఈదురు గాలులు వీస్తుండటంతో పంటలు దెబ్బతింటున్నాయి. పలు ప్రాంతాల్లో మిరప రైతులు కాయలు కోసి కల్లాల్లో ఆరబెట్టారు. ఈ సమయంలో వర్షం పడటంతో తడిసి ముద్దయింది. కళ్ల ముందే దిగుబడులు తడిసిపోవడంతో పలువురు కన్నీళ్లు పెట్టుకున్నారు. కర్నూలు జిల్లాలో 6,74,864, నంద్యాల జిల్లా పరిధిలో 82,224 ఎకరాల్లో పత్తి సాగైంది. ఇప్పటికే ఒకటి, రెండుసార్లు పత్తి తీయడం పూర్తైంది. మూడో విడత పత్తి తీసేందుకు సిద్ధ మవుతున్న సమయంలో వర్షం పడటంతో తడిసి పనికిరాకుండా పోతోంది. ఏటా నవంబరు ఆఖరు, డిసెంబరులో పడుతున్న వర్షాలతో అన్నదాతలు నష్టపోతూనే ఉన్నారు. జిల్లాలోని కొన్ని ప్రాంతాల్లో మిరప పంట 70 నుంచి 90 రోజుల మధ్యలో ఉంది. ఈ దశలో వర్షం కొనసాగితే భూమిలో తేమ శాతం పెరిగి మొక్కకు ఆహారం తీసుకునే శక్తి తగ్గిపోతుంది. ఫలితంగా దిగుబడులపై ప్రభావం పడుతుంది.



బనగానపల్లెలో వర్షానికి నేలకొరిగిన వరి పైరు

కాయలు తెల్లగా మారిపోయే ప్రమాదముంది. ఖరీఫ్ సీజన్లో రైతులు మొక్కజొన్న సాగు చేయగా ప్రస్తుతం నూర్పిడి చేసి కల్లాల్లో ఆరబెట్టారు. ఈ దశలో వర్షం రావడంతో తడిసిపోయాయి. నాణ్యత దెబ్బతినడంతోపాటు వాటిని నిల వేసేందుకు రైతులు ఇబ్బందులు పడుతున్నారు. రబీ సీజన్లో నవంబరు రెండో వారం నుంచి ఉమ్మడి జిల్లాలో మొక్క జొన్న సాగు మొదలైంది. కొందరు తొలకరిలోంచే విత్తనాలు నాటారు. ఈ పరిస్థితుల్లో పొలాల్లో నీరు నిలిస్తే మొక్కలు చనిపోతాయని పలువురు ఆవేదన చెందుతున్నారు. చేతికొచ్చిన వరి పంట కోత కోసుకోలేక, కోసిన వరి ధాన్యం కల్లాల్లో ఉండి తడవకుండా పట్టాలు కప్పుకుంటూ రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. పంట చేతికొచ్చే సమయంలో మాండూస్ తుపాను రావడంతో రైతులు దిక్కుతోచని స్థితిలో పడ్డారు. అధికారులు కష్టపడి పని చేస్తే నోటికాడ వచ్చిన పంట తుపాను దెబ్బకు దెబ్బతిందని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

27 మండలాల్లో వర్షం..

నంద్యాల జిల్లా వ్యాప్తంగా సోమవారం 27 మండలాల్లో వర్షం కురిసింది. ఆదివారం రాత్రి నుంచి సోమవారం సాయంత్రం వరకూ వాన పడింది. అత్యధికంగా శ్రీశైలం మండలంలో 23 మిల్లీమీటర్లు, అత్యల్పంగా బనగానపల్లె, శిరివెళ్ల మండలాల్లో 0.4 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదైంది. జిల్లా వ్యాప్తంగా సరాసరిన 3.7 మిల్లీమీటర్ల వర్షం కురిసింది.

తుఫాన్ పట్ల అప్రమత్తంగా ఉండండి : జిల్లా కలెక్టర్

నంద్యాల కలెక్టరేట్ : బంగాళాఖాతంలో ఏర్పడిన మాండూస్ తుఫాన్ కారణంగా జిల్లాలో కురుస్తున్న వర్షాల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని జిల్లా కలెక్టర్ మనజీర్ జిలాని సామూన్ సోమవారం ఒక ప్రకటనలో విజ్ఞప్తి చేశారు. పాత మిద్దెలు, గోడలు కూలిపోవడం, చెట్లు నేలకొరగడం, విద్యుత్ స్తంభాలు, కరెంట్ తీగలు తెగిపోయిన ప్రదేశాల్లో ప్రజలు మరింత అప్రమత్తంగా ఉండాలన్నారు. తుఫాన్ ప్రభావిత ప్రాంతాల్లో ప్రత్యేక దృష్టి సారించి జరిగిన నష్టాన్ని అంచనా వేసేందుకు చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. మాండూస్ తుఫాన్ పట్ల అధికారులు అప్రమత్తంగా ఉండి ఎప్పటికప్పుడు పరిస్థితులను గమనిస్తూ అవసరమైన తక్షణ చర్యలు తీసుకునేందుకు సిద్ధంగా ఉండాలని తెలిపారు.

గిరిజన పాఠశాలల్లో ఉపాధ్యాయుల
సమస్యలు పరిష్కరించాలి

- ఐటిడిఎ పిఒకు యుటిఎఫ్ వినతి

ప్రజాశక్తి-శ్రీశైలం ప్రాజెక్టు

శ్రీశైలం ఐటిడిఎ పరిధిలో గిరిజన పాఠశాలల్లో పని చేస్తున్న గిరిజన ఉపాధ్యాయుల సమస్యలను పరిష్కరించాలని యుటిఎఫ్ రాష్ట్ర సహాధ్యక్షులు కె.సురేష్ కుమార్ డిమాండ్ చేశారు. ఈ మేరకు సుండిపెంటలోని ఐటిడిఎ పిఒ కార్యాలయంలో ఐటిడిఎ పిఒ బి.రవీంద్రారెడ్డికి సోమవారం యుటిఎఫ్ ఆధ్వర్యంలో వినతిపత్రం సమర్పించారు. అక్టోబర్ 22న ఐటిడిఎ ఎపిఒ మురళిని కలిసి ఉపాధ్యాయుల సమస్యలను ఆయన దృష్టికి తీసుకు వచ్చామన్నారు. గిరిజన పాఠశాలల్లో నాన్ టీచింగ్ సిబ్బంది లేక విద్యార్థులు అవస్థలు పడుతున్నారన్నారు. అలాగే జీవో 3ని పునరుద్ధరించాలని, సిఆర్‌టి ఉపాధ్యాయులను రెగ్యులర్ చేయాలని, 12 నెలల వేతనం ఇవ్వాలని కోరారు. వినతిపత్రం అంద చేసిన వారిలో యుటిఎఫ్ జిల్లా అధ్యక్షులు పివి.ప్రసాద్, జిల్లా ప్రధాన కార్యదర్శి సుధాకర్ ఉన్నారు.

సిపిఎం ఆధ్వర్యంలో ఉచిత గుండె వైద్య శిబిరం

ప్రజాశక్తి-డోన్

పట్టణంలోని బేతంచెర్ల సర్కిల్లోని లారీ వర్కర్స్ యూనియన్ ఆఫీస్ దగ్గర ఉన్న సిపిఎం కార్యాలయంలో పార్టీ ఆధ్వర్యంలో సోమవారం ఉచిత గుండె వైద్య శిబిరం నిర్వహించారు. కర్నూలుకు చెందిన కిమ్స్ హాస్పిటల్ వైద్యులు కార్డియాలజిస్ట్ డాక్టర్ మురళి కృష్ణ, జనరల్ ఫిజీషియన్స్ మహమ్మద్, రామతులసి రెడ్డి, టెక్నీషియన్స్ సుప్రజ, విజయ లక్ష్మి, విజేంద్ర, సిద్దు తదితరులు పాల్గొని దాదాపు 200 మందికి పైగా ప్రజలకు వైద్య పరీక్షలు చేశారు. ఈ సందర్భంగా సిపిఎం పట్టణ, మండల కార్యదర్శులు నక్కి శ్రీకాంత్, కె.నాగరాజు మాట్లాడుతూ సిపిఎం ప్రజా సమస్యలపై పోరాడడమే కాకుండా ఇలాంటి సామాజిక కార్యక్రమాలు కూడా నిర్వహిస్తూ ముందుకు సాగుతుందని తెలిపారు.



వైద్య పరీక్షలు చేస్తున్న వైద్యులు

పేద ప్రజలకు మరిన్ని మెరుగైన వైద్య సేవలు అందించేందుకు మరిన్ని ఉచిత వైద్య శిబిరాలు ఏర్పాటు చేస్తామన్నారు. కార్యక్రమంలో సిఐటియు నాగ మద్దయ్య, ఐద్వా జిల్లా ఉపాధ్యక్షురాలు షేమిమ్ బేగం, ఎస్ఎఫ్ఐ మండల అధ్యక్ష కార్యదర్శులు అశోక్, తెలుగు విజయ్, సుమన్, ఇర్ఫాన్ తదితరులు పాల్గొన్నారు.

విద్య వ్యాపారీకరణకు వ్యతిరేకించండి

- ఎస్ఎఫ్ఐ జాతీయ కమిటీ ఉపాధ్యక్షులు వినిష్
- డోన్‌కు చేరిన ఎస్ఎఫ్ఐ అమరవీరుల పతాకయాత్ర

ప్రజాశక్తి - డోన్

విద్యా వ్యాపారీకరణకు వ్యతిరేకంగా విద్యార్థులు పోరాటానికి సిద్ధం కావాలని ఎస్ఎఫ్ఐ జాతీయ కమిటీ ఉపాధ్యక్షులు వినిష్, ఎస్ఎఫ్ఐ జాతీయ కమిటీ సభ్యులు ఆదర్శ్, ఎస్ఎఫ్ఐ కేరళ రాష్ట్ర ఉపాధ్యక్షులు అక్షయ్, ఎస్ఎఫ్ఐ ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్ర కమిటీ సహాయ కార్యదర్శి అబ్దుల్లాలు పిలుపునిచ్చారు. ఎస్ఎఫ్ఐ అఖిలభారత మహాసభలు ఈనెల 13 నుంచి 16 వరకు హైదరాబాద్ ఉస్మానియా యూనివర్సిటీలో నిర్వహిస్తున్న సందర్భంగా కేరళ నుండి అమరవీరుల పతాకయాత్ర ప్రారంభమై సోమవారం డోన్ పట్టణానికి వచ్చిన సందర్భంగా విద్యార్థి, యువజన ప్రజాసంఘాలు స్వాగతం పలికాయి. పట్టణంలో విద్యార్థులతో ప్రదర్శన అనంతరం సమైక్యాంధ్ర కట్టవద్ద బహిరంగ సభ నిర్వహించారు. ఎస్ఎఫ్ఐ జాతీయ కమిటీ ఉపాధ్యక్షులు వినీష్ మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం విద్యను నూతన జాతీయ విద్యా విధానం పేరుతో ప్రభుత్వ విద్యను నాశనం చేసే విధంగా విద్యారంగాన్ని కార్పొరేట్ సంస్థలకు అప్పన్నంగా కట్టబెట్టడానికి



మాట్లాడుతున్న ఎస్ఎఫ్ఐ జాతీయ కమిటీ ఉపాధ్యక్షులు వినిష్

ప్రయత్నం చేస్తుందన్నారు. దానికి వ్యతిరేకంగా విద్యారంగాన్ని కాపాడుకోవడం కోసం విద్యార్థులు పోరాటాలకు సిద్ధం కావాలన్నారు. జాతీయ కమిటీ సభ్యులు ఆదర్శ్ మాట్లాడుతూ మనదేశంలో ఒక విద్యార్థి చదవాలంటే రూ.కొన్ని లక్షల వెచ్చించాల్సి వస్తుందన్నారు. పేదవానికి విద్య అందని ద్రాక్షలా మారిందన్నారు. ఇప్పుడే ఈ కేంద్ర ప్రభుత్వం విద్యారంగాన్ని వ్యాపారీకరణ కాషాయీకరణ కార్పొరేటీకరణ చేయడానికి నూతన విద్యా విధానాన్ని అమలు చేస్తుందన్నారు. ఈ నూతన విద్యా విధానానికి వ్యతిరేకంగా విద్యారంగా అభివృద్ధి చేయడం కోసం అఖిలభారత మహాసభ నిర్వహించుకోబోతున్నామని, విద్యార్థులంతా కలిసి ఈ మహాసభలను జయప్రదం చేయాలని కోరారు. ఎస్ఎఫ్ఐ కేరళ రాష్ట్ర ఉపాధ్యక్షులు అక్షయ్ మాట్లాడుతూ నూతన జాతీయ విద్యా విధానాన్ని రద్దు చేయాలన్నారు. ఎస్ఎఫ్ఐ ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్ర కమిటీ సహాయ కార్యదర్శి అబ్దుల్లా మాట్లాడుతూ విద్యారంగానికి అధిక నిధులు కేటాయించాలన్నారు. ఎస్ఎఫ్ఐ నంద్యాల జిల్లా కార్యదర్శి ఎ.నిరంజన్, డోన్ మండల అధ్యక్ష, కార్యదర్శులు అశోక్, తెలుగు విజయ్ కుమార్ లు మాట్లాడుతూ డోన్ నియోజకవర్గంలో మైనింగ్ కళాశాల ఏర్పాటు చేయాలన్నారు. అమరవీరుల పతాక యాత్రకు యుటిఎఫ్ రాష్ట్ర ఆడిట్ కమిటీ సభ్యులు ఎం.వెంకట సుబ్బారెడ్డి, ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడు లక్ష్మణ్, జిల్లా నాయకులు మధు, కిరణ్, డోన్ మండల గర్ల్స్ కన్వీనర్ ఇర్ఫానా బేగం, నాయకులు మాబు, సునీల్ డివైఎఫ్ఐ నాయకులు హబిబ్‌బాష,ఐద్వా నాయకురాలు షమీం బేగం తదితరులు స్వాగతం పలికిన వారిలో ఉన్నారు.

ఫిర్యాదులపై వెంటనే స్పందించండి : కలెక్టర్

ప్రజాశక్తి - నంద్యాల కలెక్టరేట్

స్పందన ద్వారా స్వీకరించిన ప్రజా ఫిర్యాదులపై వెంటనే స్పందించి ఎప్పటికప్పుడు పరిష్కరించేందుకు చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ మనజీర్ జిలాని సామూన్ జిల్లా అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్లోని వైఎస్సార్ సెంటినరీ హాలులో ప్రజా సమస్యల పరిష్కార వేదిక స్పందన కార్యక్రమం నిర్వహించారు. జిల్లా నలుమూలల నుండి వచ్చిన ఫిర్యాదుదారుల నుండి జిల్లా కలెక్టర్‌తో పాటు జాయింట్ కలెక్టర్ టి. నిశాంతి దరఖాస్తులు స్వీకరించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ ఏ ఒక్క దరఖాస్తు బియాండ్ ఎస్ఎల్ఏలోకి వెళ్లకుండా గడువులోగా నాణ్యతతో పరిష్కరించాలన్నారు. ప్రతి దరఖాస్తుకు ప్రాపర్ ఎండార్స్మెంట్ ఇవ్వడంతో పాటు స్పీకింగ్ ఆర్డర్స్ ఇవ్వాలన్నారు. అర్జీలు ఎట్టి పరిస్థితిలో రీఓపన్ కాకూడదన్నారు. స్పందన రీఓపెన్ కేసులకు సంబంధించి ఆర్ఓఆర్ ఫైనల్ కేసులు ఎక్కువగా వస్తున్నాయని, సంబంధిత ఆర్డీవోలు ప్రత్యేక దృష్టి సారించి ఎందుకు వస్తున్నాయో కారణాలు విశ్లేషించాలన్నారు. ప్రతిరోజు అరగంట పాటు స్పందన సమస్యలపై దృష్టి పెడితే పరిష్కారం అవుతాయన్నారు. అంగన్వాడీ కేంద్రాలలో పిల్లల బరువు, ఎత్తు పెంపుదలపై సిడిపిఒలు, సూపర్వైజర్లు ప్రత్యేక శ్రద్ధ తీసుకొని చెక్ చేయాలన్నారు. గర్భిణులు, బాలింతలు, కిశోర బాలికల్లో రక్తహీనతను అధిగమించేందుకు ఐసిడిఎస్, డిఎంహెచ్ఒ, డీఈవో, డిఆర్డిఏ శాఖలు ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. అన్ని శాఖల్లో కోర్టుకు సంబంధించిన కంటెంప్ట్ కేసులకు కౌంటర్ ఫైల్ చేయడంతో పాటు మధ్యంతర, తుది ఉత్తర్వులను అమలు పరచాలన్నారు. వార్తా పత్రికల్లో ప్రతిరోజు వచ్చే ప్రతికూల వార్తలపై వెంటనే స్పందించి యాక్షన్ టేకెన్ రిపోర్ట్‌లతో పాటు రీజాయిండర్లు పంపాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో జిల్లా రెవెన్యూ అధికారి బి.పుల్లయ్య, అన్ని శాఖల జిల్లా అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.



మాట్లాడుతున్న కలెక్టర్ మనజీర్ జిలానీ సామూన్

జాతీయ పోటీలకు విద్యార్థిని ఎంపిక

ప్రజాశక్తి - చాగలమర్రి

చాగలమర్రి పట్టణ లోని వాసవి జూనియర్ కళాశాలకు చెందిన విద్యార్థిని షెహనాజ్ జాతీయ స్థాయి పోటీలకు ఎంపికైనట్లు కళాశాల ప్రిన్సిపాల్ శివరామ్ రెడ్డి సోమవారం తెలిపారు. కళాశాలలో ఏర్పాటు చేసిన అభినందన సభలో ఆయన మాట్లాడుతూ ఈ నెల 4న నంద్యాలలో జరిగిన రాష్ట్ర స్థాయి బేస్‌బాల్ పోటీలలో తమ



పోటీలకు ఎంపికైన విద్యార్థినితో కళాశాల యాజమాన్యం

విద్యార్థిని షెహనాజ్ అత్యంత ప్రతిభ కనబరచి జాతీయ స్థాయికి ఎంపికైనట్లు వివరించారు. జాతీయ స్థాయికి ఎంపికైన విద్యార్థినిని అభినందించి ప్రోత్సాహకాన్ని అందజేశారు. కార్యక్రమంలో కళాశాల అధ్యక్షులు సత్యనారాయణ, సలహాదారుడు పుల్లారెడ్డి, అధ్యాపక బృందం పాల్గొన్నారు.

జిల్లా మహాసభను జయప్రదం చేయండి : సిఐటియు

ప్రజాశక్తి - వెలుగోడు

నంద్యాల జిల్లాలో జరిగే సిఐటియు జిల్లా రెండో మహాసభను జయప్రదం చేయాలని ఆ సంఘం మండల కార్యదర్శి శ్రీనివాసులు కోరారు. సోమవారం వెలుగోడులోని సిఐటియు కార్యాలయంలో సిఐటియు జిల్లా మహాసభను జయప్రదం కోరుతూ మండల అధ్యక్షుడు వి.నాగమోహన్ అధ్యక్షతన ముఖ్య కార్యకర్తల సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అసంఘటిత రంగా కార్మికులకు జీవిత బీమా కల్పించాలని, బజారు హమాలీలకు, రైస్ మిల్లు హమాలీలకు వారి ఆర్థిక అభివృద్ధికి నిధి ఏర్పాటు చేసి, అలాగే కేంద్ర ప్రభుత్వం లేబర్ కొత్త చట్టాలను రద్దుచేసి, పాత వాటిని పున: సమీక్షించాలన్నారు. అసంఘటిత రంగ కార్మికులకు ప్రభుత్వం కల్పించిన జీవో ప్రకారం వారికి సమాన పనికి సమాన వేతనం ఇవ్వాలన్నారు. వెలుగోడు మండలంలోని బజార్ హమాలీలు, రైస్ మిల్లు హమాలీలు, ఆటో కార్మికులు, గ్రామపంచాయతీ కార్మికులు, విబి కేసు, వీఆర్ఏలు, ఆశా, అంగన్వాడి కార్యకర్తలు, స్వచ్ఛభారత్ కార్మికులు జిల్లా మహాసభలో పాల్గొని జయప్రదం చేయాలని కోరారు. కార్యక్రమంలో కెవిపిఎస్ జిల్లా ప్రధాన కార్యదర్శి కే.రామదాసు, సిఐటియు నాయకులు జి.భాష, వెంకటయ్య, కిషోర్, రహంతుల్లా, ఎర్ర భాష, నబి రసూల్, కృష్ణ, నాగన్న, రాజు తదితరులు పాల్గొన్నారు

ఆన్‌లైన్ వ్యాపారంలో మోసపోయిన ఆటో డ్రైవర్

ప్రజాశక్తి - ఆళ్లగడ్డ

ఆన్‌లైన్ మోసాలపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలని పోలీస్ శాఖ హెచ్చరిస్తున్నా పలువురు మోసపోతూనే ఉన్నారు. అలాంటి ఘటన ఆళ్లగడ్డ పట్టణంలో చోటుచేసుకుంది. రామలక్ష్మి కొట్టాలకు చెందిన ఆటో డ్రైవర్ నాసారి కాశయ్య ఆన్లైన్ వ్యాపారానికి మోసపోయానని సోమవారం ఆళ్లగడ్డ పట్టణ పోలీసులకు ఫిర్యాదు చేశారు. బాధితుడు కాశయ్య చెప్పిన వివరాలు ఇలా ఉన్నాయి. మీషో ఆన్లైన్ షాపింగ్ ప్రైవేట్ లిమిటెడ్ పేరుతో రూ. 9,40,000 గెలిచినట్లు తనకు మెసేజ్ వచ్చిందని, డబ్బు రావాలంటే ముందుగా 37,600 రూపాయల నగదును తాము పంపిన సెల్ నెంబర్‌కు ఫోన్ పే చేయాలని కంపెనీ వారు చెప్పడంతో వెంటనే వారికి అమౌంట్‌ను ఫోన్‌పే ద్వారా చెల్లించాడు. ఈ నెల 7వ తేదీన వారికి డబ్బు చెల్లించాడు. తనకు గెలిచిన మొత్తం ఇప్పటికీ వేయకపోవడంతో తాను మోసపోయానని గుర్తించి వెంటనే సదరు కంపెనీ వివరాలను పోలీసులకు ఫిర్యాదులో నమోదు చేయించాడు. తనలాగా మరెవరూ ఆన్లైన్ మోసానికి గురి కావద్దని బాధితుడు వాపోయాడు.

మంచి సేవల ద్వారానే గుర్తింపు

ప్రజాశక్తి - బేతంచెర్ల

సమాజంలో మంచి సేవలు చేస్తేనే గుర్తింపు లభిస్తుందని వాసవి క్లబ్ బేతంచెర్ల రీజనల్ చైర్మన్లు సతీష్, సుబ్రహ్మణ్యం అన్నారు. సోమవారం హైదరాబాద్‌లో అంతర్జాతీయ వాసవి క్లబ్ సదస్సు జరిగింది. ఈ సదస్సులో వాసవి క్లబ్ ఇంటర్నేషనల్ అధ్యక్షుడు పి సుదర్శన్, గవర్నర్ గుండా నాగ సుప్రజల చేతుల మీదుగా వాసవి క్లబ్ ఉత్తమ ప్రెసిడెంట్ అవార్డును బేతంచెర్ల అధ్యక్షుడు బొగ్గవరపు ధనుంజయ అందుకున్నారు.

అఖిల భారత రైతు మహాసభను జయప్రదం చేయండి

- ఎపి రైతు సంఘం జిల్లా ఉపాధ్యక్షులు వి.సుబ్బరాయుడు

ప్రజాశక్తి - డోన్

కేరళ రాష్ట్రం త్రిశూర్‌లో ఈ నెల 13 నుండి 16 వరకు జరుగుతున్న అఖిల భారత రైతు మహాసభలను జయప్రదం చేయాలని ఏపి రైతు సంఘం నంద్యాల జిల్లా ఉపాధ్యక్షులు వి.సుబ్బరాయుడు కోరారు. మహాసభకు సంఘీభావంగా సోమవారం స్థానిక కొండపేటలోని సిఐటియు కార్యాలయం దగ్గర ప్రజా సంఘాల ఆధ్వర్యంలో సీనియర్ నాయకులు జి.కొండయ్య ఏఐకెఎస్ జెండాను ఆవిష్కరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ వ్యవసాయ రంగం రోజురోజుకు సంక్షోభంలో కూరుకుపోతుందని అన్నారు. రైతాంగ పరిస్థితి మరింత క్షీణిస్తున్నదని చెప్పారు.వ్యవసాయం గిట్టుబాటు కాక, రైతులు అప్పుల ఊబిలో నుండి బయట పడలేక ఆత్మహత్యలు చేసుకుంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. వ్యవసాయాన్ని లాభసాటిగా మారుస్తామని, స్వామినాథన్ సూచనల ప్రకారం మద్దతు ధరల చట్టం తెస్తామని కల్లబొల్లి హామీలతో అధికారంలోకి వచ్చిన నరేంద్ర మోడీ ప్రభుత్వం వ్యవసాయ రంగాన్ని కార్పొరేట్ శక్తులకు అప్పగించేందుకు అప్రజాస్వామికంగా రైతుల మెడకు ఉరి తాళ్ల లాంటి మూడు నల్ల చట్టాలను తేవడం దుర్మార్గమని ఆగ్రహం వ్యక్తం చేశారు. వీటికి వ్యతిరేకంగా దేశంలోని 540 రైతు సంఘాలు ఐక్యమై నిర్బంధాలను ఎదుర్కొని అన్ని వర్గాల ప్రజల మద్దతుతో ఏడాది పాటు సాగించిన ఉద్యమానికి తలొగ్గిన ప్రభుత్వం చట్టాలను వెనక్కి తీసుకుందన్నారు. ఉద్యమ ఉపసంహరణ సందర్భంగా మద్దతు ధరల చట్టం తెస్తామని, విద్యుత్తు సవరణ చట్టం నుండి వ్యవసాయ రంగానికి మినహాయింపు ఇస్తామని, రైతులపై పెట్టిన కేసులు ఉపసంహరిస్తామని రాతపూర్వకంగా హామీ ఇచ్చిన ప్రభుత్వం, హామీకి భిన్నంగా రైతు సంఘాలతో చర్చించకుండా, మద్దతు ధరల అంశం లేకుండా ఏకపక్షంగా తన అనుయాయులతో కమిటీని వేసి విద్యుత్తు సవరణ చట్టాన్ని యధాతథంగా పార్లమెంటులో ప్రవేశపెట్టడం రైతాంగాన్ని మరోమారు మోసగించడమే అన్నారు. ఈ నేపథ్యంలో రైతులను రక్షించుకుందాం, వ్యవసాయాన్ని కాపాడుకుందాం అనే నినాదంతో జరుగుతున్న అఖిలభారత రైతు మహాసభలలో దేశవ్యాప్తంగా



జెండావిష్కరణ చేస్తున్న సీనియర్ నాయకులు జి.కొండయ్య

2000 మంది కేంద్ర, రాష్ట్ర ముఖ్య రైతు నాయకులు నాలుగు రోజులపాటు పాల్గొని రైతాంగ సమస్యలపై చర్చించి, వాటి పరిష్కారానికి ఉద్యమ కార్యాచరణ రూపొందిస్తారన్నారు. నంద్యాల జిల్లా నుండి రైతులు పెద్ద ఎత్తున పాల్గొని జయప్రదం చేయాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు టి.శివరాం, కె.నాగరాజు, నక్కీ శ్రీకాంత్, బి.నాగమద్దయ్య, సిఐటియు బేతంచెర్ల నాయకులు ఎల్లయ్య, షాదిక్ హుస్సేన్, ప్రజా సంఘాల నాయకులు లక్ష్మన్న, ఓబులేసు, హుస్సేన్ పీరా, షమీంబేగం, షబానా, విజయ్ కుమార్, అశోక్, ఇర్ఫాన్ తదితరులు పాల్గొన్నారు.

మద్దిలేటి స్వామిని దర్శించుకున్న జడ్పిటిసి

ప్రజాశక్తి - బేతంచర్ల

మండలంలోని ఆర్ఎస్ రంగాపురం గ్రామ పరిధిలో వెలసిన వైష్ణవ పుణ్యక్షేత్రం మద్దిలేటి లక్ష్మీ నరసింహ స్వామిని డోన్ జడ్పిటిసి బద్దెల రాజ్ కుమార్ సోమవారం దర్శించుకున్నారు. స్వామి, అమ్మవార్లను దర్శించుకుని పూజలు నిర్వహించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ తిరుమల దేవస్థానం మాదిరిగా మద్దిలేటి స్వామి దేవాలయాన్ని కూడా రాష్ట్ర ఆర్థిక శాఖ మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్ రెడ్డి అభివృద్ధి చేస్తున్నట్లు తెలిపారు. అనంతరం నూతనంగా మద్దిలేటి స్వామి దేవస్థానం చైర్మన్ బిఎస్ రామచంద్రుడిని, ఈవో పాండురంగారెడ్డిని పట్టు వస్త్రాలతో, శాలువాలతో సత్కరించారు. అనంతరం జడ్పిటిసి బద్దెల రాజ్ కుమార్‌ను కూడా మర్యాదపూర్వకంగా ఆలయ ఇఒ పాండురంగారెడ్డి, చైర్మన్ రామచంద్రుడు శాలువాలతో సత్కరించారు.



దేవస్థానం చైర్మన్ రామచంద్రుడును సన్మానిస్తున్న జడ్పిటిసి

రాష్ట్రానికి పట్టిన కర్మ పోవాలంటే
టిడిపిని ఆదరించండి : మాజీ ఎమ్మెల్యే

ప్రజాశక్తి - కోయిలకుంట్ల

రాష్ట్రానికి పట్టిన ఖర్మ పోవాలంటే రాబోయే ఎన్నికల్లో తెలుగుదేశం పార్టీని ఆదరించాలని బనగానపల్లె మాజీ ఎమ్మెల్యే బీసీ జనార్దన్ రెడ్డి ప్రజలను కోరారు. తెలుగుదేశం పార్టీ జాతీయ అధ్యక్షులు నారా చంద్రబాబునాయుడు ఆదేశాల మేరకు మండలంలోని పొట్టిపాడు గ్రామంలో సోమవారం 'ఇదేం కర్మ మనరాష్ట్రానికి' అనే కార్యక్రమాన్ని మాజీ ఎమ్మెల్యే ఆధ్వర్యంలో నిర్వహించారు. ముందుగా బిసి జనార్దన్ రెడ్డి గ్రామానికి చేరుకోగానే గ్రామ నాయకులు, కార్యకర్తలు ఘనంగా స్వాగతం పలికారు. అనంతరం ఆయన గ్రామంలో ఇంటింటికి వెళ్లి వైసిపి పాలనలో ప్రజలు ఎదుర్కొంటున్న ఇబ్బందులు, కష్టాలను అడిగి తెలుసుకున్నారు. రాష్ట్రానికి పట్టిన ఖర్మ పోవాలంటే రాబోయే ఎన్నికల్లో తెలుగుదేశం పార్టీని అధికారంలోకి తేవాలన్నారు. వైసిపి అధికారంలోకి వచ్చాక పెరిగిన నిత్యవసర ధరలు, గ్యాస్, కరెంట్ బిల్లులు, ఇంటి పన్నులు అన్నింటిపై చర్చించి, తెలుగుదేశం ప్రభుత్వంలో ప్రజలు ఎలా ఉన్నారో ఇప్పుడు ఎన్ని కష్టాలు పడుతున్నారో అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో మార్కెట్ యార్డ్ మాజీ చైర్మన్ గడ్డం నాగేశ్వర్ రెడ్డి, మండల అధ్యక్షుడు మద్దిలేటి, బివి ప్రసాద్ రెడ్డి, కాట్రెడ్డి మల్లికార్జునరెడ్డి, గ్రామ నాయకులు సుబ్బారెడ్డి, సుందరేశ్వర్ రెడ్డి, వల్లంపాడు జగదీశ్వర్ రెడ్డి, వల్లంపాడు నారాయణ రెడ్డి, కలుగొట్ల గడ్డం నాగార్జున రెడ్డి, కంపమల్ల సుబ్బారెడ్డి, చిన్న కొప్పెర్ల వెంకట సుబ్బారెడ్డి, గుల్లదుర్తి పరమేశ్వర రెడ్డి, యగ్గోని విష్ణువర్ధన్ రెడ్డి, గడ్డం అమరనాథరెడ్డి, బిజినవేముల డి.హుస్సేన్, పెనుగొండ రాజశేఖర్, కులాయి భాష, మండల, గ్రామాల నాయకులు, కార్యకర్తలు, బిసి అభిమానులు పాల్గొన్నారు. **సంజామల :** సంజామలలో టిడిపి నాయకులు ఇదేం కర్మ రాష్ట్రానికి కార్యక్రమం సోమవారం నిర్వహించారు. నాయకులు ఇంటింటికి వెళ్లి వైసిపి ప్రభుత్వ వైఫల్యాలను వివరించారు. తోకల చిన్న మద్దిలేటి, కోడూరు సుబ్బరామకృష్ణయ్య, సానం రవికుమార్, తోట శ్రీనివాస్ రెడ్డి, పొంతాల మధు యాదవ్, మోటార్ నాగేశ్వరరావు, కోరసుబ్బయ్య తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే బిసి జనార్ధన్ రెడ్డి



మురికి కుంటను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే శిల్పా చక్రపాణి రెడ్డి

అర్హులందరికీ సంక్షేమ పథకాలు : ఎమ్మెల్యే

ప్రజాశక్తి - వెలుగోడు

అర్హులందరికీ సంక్షేమ పథకాలు అందించడమే వైసిపి ప్రభుత్వ ధ్యేయమని శ్రీశైలం ఎమ్మెల్యే శిల్పా చక్రపాణి రెడ్డి పేర్కొన్నారు. సోమవారం మండలంలోని రేగడ గూడూరు గ్రామంలో వర్షాన్ని సైతం లెక్కచేయకుండా గడపగడపకు మనం ప్రభుత్వం కార్యక్రమంలో ఎమ్మెల్యే పాల్గొన్నారు. గ్రామంలో కొత్త మజీద్ పేట నుండి ఎమ్మెల్యే ఇంటింటికి వెళ్లి జనరంజక పాలన, అవినీతి రహిత పాలన గురించి ప్రజలకు వివరిస్తూ జగనన్న ప్రభుత్వాన్ని దీవించాలని కోరారు. ప్రభుత్వం అందించే సంక్షేమ పథకాలను అర్హత కలిగిన ప్రతీ ఒక్కరికి అందేలా చూడాలని సంబంధిత సచివాలయ సిబ్బందిని ఆదేశించారు. కాలనీలో ఏమైనా సమస్యలు ఉన్నాయా అని తెలుసుకుంటూ సంబంధిత అధికారులను పిలిచి వెంటనే పరిష్కరించాలని ఆదేశించారు. కార్యక్రమంలో ఎంపిపి లాలం, అంబాల ప్రభాకర్ రెడ్డి, తిరుపం రెడ్డి, నందిరెడ్డి గారి రామిరెడ్డి, గ్రామ సర్పంచి దర్గా రజియాబి, అంబాల దుబ్బ జయరాం రెడ్డి, మాభాష, నీలకంటి మస్తాన్వలి, దేశం కుళాయి స్వామి రెడ్డి, దేశం శ్రీనివాసరెడ్డి, వైస్ ఎంపిపి నసిరుద్దీన్, వెలుగోడు మేజర్ గ్రామపంచాయతీ సర్పంచ్ వేల్పుల జైపాల్, వంగల నాగేశ్వర్ రెడ్డి, రామ్మోహన్ రెడ్డి, విజయ భాస్కర్ రెడ్డి, ఇలియాస్ ఖాన్, అమీర్ అలీ ఖాన్, తెలుగు రమణ, ఖాదర్ వలీ, వలి, ఎం.సుధాకర్ రెడ్డి, బి.శివ శంకర్ నాయుడు, సుదర్శన్, రమణ, అచ్చయ్య, సచివాలయ సిబ్బంది, వాలంటీర్లు పాల్గొన్నారు.

విఆర్ఒల సమస్యలు పరిష్కరించాలని వినతి

రుద్రవరం : విఆర్వోల సమస్యలను వెంటనే పరిష్కరించాలని కోరుతూ తహశీల్దార్ వెంకట శివకు సోమవారం వీఆర్వోల సంఘం ఆధ్వర్యంలో మెమోరాండం అందజేశారు. ఈ సందర్భంగా వీఆర్వోలు మల్లేశ్వరప్ప, పుల్లయ్య, ఓబులేసు, ఫక్రుద్దీన్, వెంకటనారాయణ, ఓబయ్య, యువకాంతు, మధుసూదన్, నీలకంఠేశ్వరరావు, తదితరులు మాట్లాడుతూ పని భారం తగ్గించాలని, ఇతర డిపార్ట్మెంట్ పనులను చేయించడం, అర్హతలు ఉన్న విఆర్ఓలకు ప్రమోషన్లు కల్పించడం, తదితర సమస్యలను పరిష్కరించాలని కోరారు.



తహశీల్దార్‌కు వినతి అందజేస్తున్న నాయకులు

రజకుల సమస్యలు పరిష్కరించాలి

- రజక వృత్తిదారుల సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి గురుశేఖర్

ప్రజాశక్తి - ఎమ్మిగనూరు



సదస్సు కరపత్రాన్ని విడుదల చేస్తున్న నాయకులు

రజకుల సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని ఎపి రజక వృత్తిదారుల సంఘం జిల్లా గౌరవాధ్యక్షులు సి.హనుమంతు, జిల్లా ప్రధాన కార్యదర్శి సి.గురుశేఖర్ డిమాండ్ చేశారు. సోమవారం సిఐటియు కార్యాలయంలో 'రజకుల సమస్యలు-ప్రభుత్వ విధానాలు'పై సదస్సుకు సంబంధించిన కరపత్రాన్ని విడుదల చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. రజకులు ఆర్థికంగా, రాజకీయంగా, సామాజికంగా నేటికీ దుర్భర జీవితం సాగిస్తున్నారని తెలిపారు. గ్రామాల్లో అగ్రవర్ణాల పెత్తందారులు రజకుల పట్ల వివక్ష చూపుతున్నారని చెప్పారు. శ్రమకు తగిన వేతనం పెంచమని అడిగితే గ్రామ సాంఘిక బహిష్కరణలు, దాడులు, దౌర్జన్యాలు చేస్తూ అక్రమ కేసులు పెట్టి వేధింపులకు గురి చేస్తున్నారని తెలిపారు. గ్రామాల్లో గతంలో ఇనాం భూములు ఇచ్చారని, నేడు భూముల విలువ పెరగడం వల్ల అగ్రవర్ణ కులాలకు చెందినవారు రజకుల ఇనాం భూములను కబ్జా చేసేందుకు ప్రయత్నిస్తున్నారని చెప్పారు. జిఒ 363 ప్రకారం ధోబీఘాట్ స్థలాలు, చెరువులు, కుంటలను రజక వృత్తిదారులకే కేటాయించాలని కోరారు. జనవరి 6న కర్నూలు నగరంలో జరిగే 'రజకుల సమస్యలు-ప్రభుత్వ విధానాలు' అనే అంశంపై సదస్సు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈరన్న, ఎల్లప్ప, ఉరుకుందు, వీరేష్, రంగస్వామి, రాము, వీరభద్ర పాల్గొన్నారు.

కొత్త బ్రిడ్జి నిర్మాణం చేపట్టాలి : సిపిఎం

ప్రజాశక్తి - ఆదోని

పట్టణంలోని శ్రీనివాస్ భవన్ నుంచి తిమ్మారెడ్డి బస్టాండ్ వరకు ప్రమాదకరంగా ఉన్న పాత బ్రిడ్జి స్థానంలో కొత్త బ్రిడ్జి నిర్మాణం చేపట్టాలని సిపిఎం నాయకులు డిమాండ్ చేశారు. సోమవారం పట్టణ కమిటీ ఆధ్వర్యంలో పట్టణంలోని తిమ్మారెడ్డి బస్టాండ్ దగ్గర సంతకాల సేకరణ చేపట్టారు. ఈ సందర్భంగా సిపిఎం జిల్లా నాయకులు వెంకటేశులు, పట్టణ కార్యదర్శి లక్ష్మన్న, సీనియర్ నాయకులు ఈరన్న, మహానందరెడ్డి మాట్లాడారు. బ్రిడ్జి ఇరువైపులా సైడ్ వాల్స్ పడిపోయినప్పుడు మాత్రమే తాత్కాలిక మరమ్మతులు చేయిస్తూ అధికారులు చేతులు దులుపుకుంటున్నారని విమర్శించారు. కొత్త బ్రిడ్జి నిర్మాణం కోసం ప్రజల సహకారంతో ఉద్యమ కార్యాచరణ రూపొందిస్తామని తెలిపారు. రేణుకాంబ విలాస్ దగ్గర బ్రిడ్జిపైకి ఎక్కే మెట్లు కూడా ప్రమాదకరంగా మారాయని చెప్పారు. సంబంధిత అధికారులు కొత్త బ్రిడ్జి నిర్మాణం కోసం ప్రతిపాదనలు పంపి నిర్మాణం చేపట్టి ప్రమాదాలను నివారించాలని కోరారు. బైపాస్ రోడ్డు త్వరలోనే మొదలవుతుందని ఎమ్మెల్యే సాయి ప్రసాద్ రెడ్డి పదేపదే చెబుతున్నా కార్యరూపం దాల్చడం లేదని తెలిపారు. సంతకాల పత్రాన్ని ఆదోని సబ్ కలెక్టర్‌కు అందిస్తామని తెలిపారు. సిపిఎం పట్టణ కార్యదర్శి వర్గసభ్యులు గోపాల్, తిప్పన్న, నాయకులు వీరేష్, నాగరాజు, కృష్ణమూర్తి, నాగేంద్ర, శ్రీనివాసులు, గౌస్, దేవేంద్ర పాల్గొన్నారు.

రైతులను ఆదుకోవాలని నిరసన

ప్రజాశక్తి - ఆలూరు

నకిలీ పత్తి విత్తనాలతో పంట నష్టపోయిన రైతులను ఆదుకోవాలని ఎపి రైతు సంఘం మండల కార్యదర్శి యు.ఈరన్న కోరారు. సోమవారం నకిలీ పత్తి విత్తనాలతో నష్టపోయిన రైతులతో కలిసి తహశీల్దార్ కార్యాలయం ముందు నిరసన చేపట్టారు. స్పందనలో తహశీల్దార్ మల్లికార్జునకు వినతిపత్రం అందజేశారు. సిఐటియు జిల్లా సహాయ కార్యదర్శి కెపి.నారాయణ స్వామి, డివైఎఫ్ఐ మండల కార్యదర్శి మైనా, రైతు ఈరన్న, ఎం.నారాయణ, కాల్వప్ప, బి.నారాయణ, షేక్షావలి, నాగేష్, రామాంజి పాల్గొన్నారు.

బడుగు, బలహీన వర్గాలను
పట్టించుకోని వైసిపి : మాజీ ఎమ్మెల్యే బీవీ

ప్రజాశక్తి - నందవరం



సమస్యలు తెలుసుకుంటున్న మాజీ ఎమ్మెల్యే బీవీ

రాష్ట్ర ప్రభుత్వం బడుగు, బలహీన వర్గాలను పట్టించుకోవడం లేదని, రాబోయే రోజుల్లో అధికారం టిడిపిదేనని మాజీ ఎమ్మెల్యే, టిడిపి రాష్ట్ర ఉపాధ్యక్షులు డాక్టర్ బీవీ.జయనాగేశ్వర రెడ్డి తెలిపారు. సోమవారం నందవరం 2వ వార్డులో 'ఇదేం ఖర్మ... మన రాష్ట్రానికి' నిర్వహించారు. ఇంటింటికీ వెళ్లి వైసిపి ప్రభుత్వ వైఫల్యాలను వివరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. వైసిపి ప్రభుత్వ అధికారంలోకి వచ్చిన తర్వాత బడుగు, బలహీన వర్గాలను అణచివేస్తున్నారని తెలిపారు. నిత్యావసర ధరలు అమాంతంగా పెంచేశారని విమర్శించారు. వచ్చే ఎన్నికల్లో చంద్రబాబును గెలిపించుకుంటేనే రాష్ట్రాభివృద్ధి సాధ్యమని తెలిపారు. టిడిపి జిల్లా ఉపాధ్యక్షులు దేశాయ్ మాధవరావు, మండల కన్వీనర్ చిన్న రాముడు, మండల ఉపాధ్యక్షులు కాశీంవలీ, టిడిపి నాయకులు ధర్మాపురం గోపాల్, మస్తాన్, షరీఫ్, గిర్ని ఈషా, రెహ్మాన్, వడ్డే గోపాల్, గడ్డం రామన్న, విశ్వనాథ్, నరసప్ప పాల్గొన్నారు. **మంత్రాలయం** మండలంలోని చిలుకలడోన గ్రామంలో క్లస్టర్ ఇన్‌ఛార్జీ ఎల్లారెడ్డి ఆధ్వర్యంలో టిడిపి రాష్ట్ర కార్యదర్శి పాలకుర్తి శ్రీనివాస్ 'ఇదేం ఖర్మ... మన రాష్ట్రానికి' నిర్వహించారు. మాజీ సర్పంచి హనుమంతు పాల్గొన్నారు.

ఎలా బతికేది..?

- చెత్త సేకరణ వాహన డ్రైవర్ల ఆందోళన
- నిలిచిన చెత్త సేకరణ
- అకారణంగా తొలగిస్తున్నారని ఆక్రోశం

ప్రజాశక్తి - ఆదోని

ఇంటింటి చెత్త సేకరణ కోసం ఏర్పాటు చేసిన వాహనాల డ్రైవర్లు ఆందోళన బాట పట్టారు. అకారణంగా వాహనాల రద్దు చేసి తమ ఉద్యోగాలను తొలగిస్తున్నారని ఏజెన్సీ నిర్వాహకులపై ఆక్రోశం వెళ్లగక్కారు. సమాధానం చెప్పాల్సిన అధికారులు చేతులెత్తేసి ఏజెన్సీ నిర్వాహకులను అడగాలని చెప్పడంతో వాహన డ్రైవర్లు అయోమయంలో పడ్డారు.

ఆదోని పట్టణంలో 42 వార్డులకు గాను వార్డుకు ఒకటి చొప్పున చెత్త తరలింపు వాహనం ఏర్పాటు చేశారు. ఈ బాధ్యతలను ఆదోని మున్సిపాలిటీలో రెడ్డి ఏజెన్సీకి ప్రభుత్వం అప్పగించింది. మొదట్లో డిపాజిట్ పేరుతో ఏజెన్సీ నిర్వాహకులు ఒక్కొక్కరి నుంచి రూ.50 వేల చొప్పున వసూలు చేసినట్లు డ్రైవర్లు తెలిపారు. ఉన్నపలంగా ఐదు వాహనాలను తొలగించడంతో తాము రోడ్డున పడ్డామని వాపోయారు. తమకు న్యాయం చేయాలని సోమవారం పట్టణంలోని మున్సిపల్ కార్యాలయం వద్ద తడి, పొడి చెత్త సేకరణ వాహన డ్రైవర్లు ఆందోళన చేపట్టారు. క్లీన్ ఆంధ్రప్రదేశ్ కార్యక్రమంలో ఇంటింటికి వెళ్లి తడి, పొడి చెత్త సేకరిస్తున్న వాహనాలను ఆదోని పట్టణంలో వార్డుకొకటి చొప్పున 42 వాహనాలు ఉండేవని, రెడ్డి ఏజెన్సీ ద్వారా వాహన డ్రైవర్ల నియామకాలు చేపట్టారని తెలిపారు. ఒక్కొక్కరికి రూ.10 వేల చొప్పున జీతభత్యాలు చెల్లించేవారన్నారు.

చెత్త పన్ను వసూలు కాక : ఆదోనిలోని పలు వార్డుల్లో చెత్త పన్ను వసూలుపై ప్రజల్లో తీవ్ర వ్యతిరేకత రావడంతో కాలనీల్లో పన్ను వసూలు తలనొప్పిగా మారింది. టార్గెట్ రీచ్ కాకపోవడంతో వాహనాలను క్రమంగా తగ్గిస్తూ వస్తూ తమ పొట్టగొట్టారని వాహన డ్రైవర్లు పేర్కొన్నారు. 42 గాను దఫాలవారీగా వాహనాలను తగ్గిస్తూ వచ్చారు. ఇటీవలే మరో 5 వాహనాలను తొలగించి ఇతర ప్రాంతాలకు వాహనాలను తీసుకెళ్లడంతో వాహనాలను అద్దుకున్నామని డ్రైవర్లు తెలిపారు.

అక్రమాలకు తెర : మొదట్లో డ్రైవర్‌గా నియమించేటప్పుడు ఒక్కొక్కరి నుంచి రూ.20 వేల నుంచి రూ.50 వేల వరకు అడ్వాన్స్ తీసుకున్నారు. రెండు నెలలైనా జీతాలు లేవని, ఉన్న ఉపాధి పోయి రోడ్డుపై పడ్డామని డ్రైవర్లు ఆగ్రహం వ్యక్తం చేశారు. మున్సిపల్ అధికారులు దృష్టికి తీసుకెళ్లగా అది ఏజెన్సీకి సంబంధించిందని చేతులు దులుపుకున్నారు. డ్రైవర్లుగా నియమితులైనప్పుడు 4 ఏళ్ల అగ్రిమెంట్ ఉందని తెలిపారు. తమకు ప్రత్యామ్నాయంగా ఉపాధి చూపి న్యాయం జరిగేంత వరకు తడి, పొడి చెత్త వాహనాలను బయటకు తీయమని డ్రైవర్లు భీష్మించారు.

చెత్త పన్ను వసూలు వద్దన్న ఎమ్మెల్యే : ప్రజలకు తలనొప్పిగా ఉన్న చెత్త పన్ను వసూలు చేయవద్దని పలు సందర్భాల్లో ఎమ్మెల్యే సాయి ప్రసాద్ రెడ్డి ప్రకటించారు. స్లమ్మ్‌లో నెలకు రూ.30, రిచ్ ఏరియాలో రూ.45 వసూలు చేయాలని నిర్ణయించారు. ప్రభుత్వ నిబంధనలకు విరుద్ధంగా అన్ని ప్రాంతాల్లో రూ.45 వసూలు చేయాలని అధికారులు చర్యలు తీసుకోవడంతో ప్రజల వ్యతిరేకత మొదలైంది.

మా పొట్ట కొట్టారు - మారాజా, ట్రక్ డ్రైవర్

ఉద్యోగం వస్తుందనే ఆశతో నగదు చెల్లించి డ్రైవర్‌గా చేరాను. మొదట్లో సక్రమంగా జీతాలు ఇచ్చిన ఏజెన్సీ నిర్వాహకులు రాను రాను జాప్యం చేస్తూ వద్దనకుండా పొగ పెట్టినట్లు వ్యవహరించారు. మేము సక్రమంగా విధులు నిర్వర్తించినా పన్ను వసూలు కాలేదన్న నెపంతో వాహనాలను తగ్గించి ఇతర ప్రాంతాలకు తరలిస్తున్నారు. ఉన్నపలంగా ఉద్యోగం తొలగించడం వల్ల మేమేం బతికేది. ప్రభుత్వం న్యాయం చేయాలి

మాకు న్యాయం చేయాలి - ప్రసాద్, ట్రక్ డ్రైవర్

ఉదయం ఇంటింటి చెత్త సేకరణ బాధ్యతగా చేస్తున్నాం. పన్ను వసూలు చేయడంలో నిర్లక్ష్యం కారణంగా మమ్మల్ని విధుల నుంచి తొలగించడం ఎంతవరకు సమంజసం. విధుల్లోకి చేరే సమయంలో నాలుగేళ్ల అగ్రిమెంట్ రాయించుకొని అకారణంగా తొలగించే కుట్ర చేస్తున్నారు. ప్రభుత్వం జోక్యం చేసుకొని మాకు న్యాయం చేయాలి.



మున్సిపల్ కార్యాలయ గేట్ ముందు ఆందోళన చేస్తున్న వాహన డ్రైవర్లు

నీటి సంపునకు భూమిపూజ

- హామీ నిలుపుకున్న ఎమ్మెల్యే బాలనాగిరెడ్డి

ప్రజాశక్తి - మంత్రాలయం

మండలంలోని చెట్నిహళ్లి గ్రామంలో నీటి సంపు నిర్మిస్తామని ఇచ్చిన హామీని ఎమ్మెల్యే వై.బాలనాగిరెడ్డి నిలుపుకున్నారు. 40 వేల లీటర్ల నీటి సామర్థ్యం గల సంపు నిర్మాణానికి సోమవారం సర్పంచి అంజినయ్య భూమి పూజ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. ఆగస్టు 20న ఎమ్మెల్యే వై.బాలనాగిరెడ్డి, వైసిపి రాష్ట్ర యూత్ కమిటీ సభ్యులు వై.ప్రదీప్ రెడ్డి 'గడపగడపకు మన ప్రభుత్వం' నిర్వహించారని తెలిపారు. గ్రామంలో నీటి ఎద్దడి ఉందని పలువురు ఎమ్మెల్యే దృష్టికి తీసుకొచ్చారని చెప్పారు. మంచి నీటి సంపు ఏర్పాటు చేసి సమస్య పరిష్కారానికి కృషి చేస్తామని హామీ ఇచ్చారని తెలిపారు. హామీలో భాగంగా ఎమ్మెల్యే బాలనాగిరెడ్డి ఆదేశాల మేరకు రూ.5 లక్షలతో తాగునీటి సంపు నిర్మాణానికి భూమి పూజ చేసి పనులు ప్రారంభించామని పేర్కొన్నారు. ఆర్‌డబ్ల్యుఎస్ ఎఇ వేద స్వరూప, మాజీ సర్పంచి అల్లింగప్ప, నాయకులు గంగుల వెంకటేష్ ఉన్నారు.

వర్షాల సమయంలో జాగ్రత్తలు తీసుకోవాలి : తహశీల్దార్

ప్రజాశక్తి - చిప్పగిరి

వర్షాలు కురుస్తున్న సమయంలో తగిన జాగ్రత్తలతో ఉండాలని తహశీల్దార్ లక్ష్మీనారాయణ మండల ప్రజలకు సూచించారు. సోమవారం తహశీల్దార్ కార్యాలయంలో ఆయన మాట్లాడారు. విద్యుత్ స్తంభాలకు చాలా దూరంగా ఉండాలన్నారు. కొంతమంది రైతులు స్తంభాలకు పశువులను కట్టేస్తున్నారని, వర్షం సమయంలో ప్రమాదకరమని అన్నారు. మట్టి మిద్దెల్లో ఉన్నవారు కూడా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. తడి ఉన్న విద్యుత్ బోర్డులను తాకకూడదని తెలిపారు. రైతులు బోరుబావులకు దగ్గర ఉన్న ట్రాన్స్‌ఫార్మర్లను, సాగునీరు అందించే మోటార్ దగ్గర చాలా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు.

కర్ణాటక మద్యం సీజ్

ప్రజాశక్తి - ఎమ్మిగనూరు రూరల్

మంత్రాలయం మండలం మాధవరం చెక్‌పోస్ట్ వద్ద వాహనాల తనిఖీలో భాగంగా కర్ణాటక మద్యం స్వాధీనం చేసుకున్నట్లు సిఐ జయరాం నాయుడు తెలిపారు. సోమవారం సెబ్ కార్యాలయంలో సెబ్ అధికారులు విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా సిఐ జయరాం నాయుడు, ఎస్‌ఐలు సోమశేఖర రావు, చంద్రమోహన్ మాట్లాడారు. మంత్రాలయం మండలం మాధవరం చెక్‌పోస్ట్ వద్ద వాహనాల తనిఖీ చేపట్టినట్లు తెలిపారు. టాటా ఇండిగో కారులో కర్ణాటక మద్యం 30 బాక్సుల టెట్రా ప్యాకెట్లు (2880) స్వాధీనం చేసుకున్నట్లు చెప్పారు. దీని విలువ రూ.1.20 లక్షలు ఉంటుందన్నారు. వీటిని తరలిస్తున్న పల్లెపాడు లక్ష్మయ్య, ఆదోని శివశంకర్, రాచుమర్రి ఉరుకుందుపై కేసు నమోదు చేసి, కర్ణాటక మద్యాన్ని సీజ్ చేసినట్లు తెలిపారు. హెడ్ కానిస్టేబుళ్లు చంద్రమౌళి, రబ్బాని, గోపాల్, ప్రసాద్, కానిస్టేబుళ్లు రామచంద్రుడు, నరసింహారెడ్డి, రాధమ్మ, ఇందు, చంద్రన్న సూర్యప్రకాష్ పాల్గొన్నారు.

ఇళ్ల నిర్మాణాలపై ప్రత్యేక దృష్టి : ఎమ్మెల్యే

ప్రజాశక్తి - కోసిగి రూరల్

జగనన్న కాలనీల్లో ఇళ్ల నిర్మాణాలపై ప్రత్యేక దృష్టి సారిస్తున్నట్లు ఎమ్మెల్యే వై.బాలనాగిరెడ్డి తెలిపారు. సోమవారం కోసిగిలో జగనన్న కాలనీలో గృహ నిర్మాణ శాఖ, వెంకటేశ్వర కన్‌స్ట్రక్షన్ ఆధ్వర్యంలో థర్డ్ పార్టీ వారు నిర్మించి ఇస్తున్న ఇళ్లకు భూమి పూజ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే బాలనాగిరెడ్డి మాట్లాడారు. ఇల్లు కట్టుకోలేని వారి ఒప్పందం మేరకు థర్డ్ పార్టీ ఆధ్వర్యంలో ఇల్లు నిర్మించి ఇస్తున్నట్లు తెలిపారు. జగనన్న కాలనీలో ఇప్పటివరకు 464 మంది లబ్ధిదారులు ముందుకొచ్చారని చెప్పారు. పట్టా ఇచ్చి ఇల్లు మంజూరు కానివారు ఉంటే గృహ నిర్మాణ శాఖ అధికారులను సంప్రదించాలని తెలిపారు. వైసిపి మండల ఇన్‌ఛార్జీ మురళీ మోహన్ రెడ్డి, హౌసింగ్ డిఇ కృష్ణయ్య, ఎఇ షేక్షావలీ, సర్పంచి అయ్యమ్మ, ఎంపిపి ఈరన్న, మండల సీనియర్ నాయకులు నాడిగేని నరసింహులు, మండల నాయకులు నాడిగేని నాగరాజు, మాణిక్యరాజు, జగదీష్ స్వామి, హోళగుంద కోసిగయ్య, ఉరుకుంద ఈరన్న స్వామి దేవస్థానం బోర్డు సభ్యులు బుళ్లి నరసింహులు, కాంట్రాక్టర్ బసిరెడ్డి, పి.నాగేష్, రాజేష్ పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారానికే 'గడపగడపకు' : ప్రజా సమస్యల పరిష్కారం కోసమే 'గడపగడపకు మన ప్రభుత్వం' నిర్వహిస్తున్నట్లు ఎమ్మెల్యే బాల నాగిరెడ్డి తెలిపారు. కోసిగి 1వ సచివాలయంలో ఎంపిడిఒ రాజేంద్ర ప్రసాద్ ఆధ్వర్యంలో సర్పంచి అయ్యమ్మ అధ్యక్షతన 'గడపగడపకు మన ప్రభుత్వం' నిర్వహించారు.



ఇళ్ల నిర్మాణానికి భూమి పూజ చేస్తున్న ఎమ్మెల్యే బాలనాగిరెడ్డి

మార్చి వరకు సాగు నీరిస్తామని ప్రకటించాలి

- అఖిలపక్షం ఆధ్వర్యంలో తహశీల్దార్‌కు వినతి

ప్రజాశక్తి - దేవనకొండ



వినతిపత్రం సమర్పిస్తున్న అఖిలపక్ష నాయకులు

రబీ సీజన్ పూర్తయ్యే వరకు హంద్రీనీవా కింద సాగు చేసిన రైతులకు సాగునీరిస్తామని ప్రభుత్వం, అధికారులు, ప్రజా ప్రతినిధులు ప్రకటించాలని అఖిలపక్ష నాయకులు కోరారు. సోమవారం అఖిలపక్షం ఆధ్వర్యంలో తహశీల్దార్‌కు వినతిపత్రం అందజేశారు. అనంతరం తహశీల్దార్ కార్యాలయం ముందు బైఠాయించారు. ఈ సందర్భంగా సిపిఎం జిల్లా నాయకులు వీరశేఖర్, టిడిపి మండల కన్వీనర్ విజయ్ గౌడ్, సిపిఐ మండల కార్యదర్శి ఎం.నరసారావు, లోక్‌సత్తా నాయకులు రామదాసు గౌడ్, జనసేన నాయకులు మక్బుల్, కాంగ్రెస్ నాయకులు గొర్రెల శ్రీనివాసులు మాట్లాడారు. హంద్రీనీవా అధికారులు రైతుల పట్ల నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని తెలిపారు. రబీ సీజన్ మొదలయ్యే వరకు ఎలాంటి ప్రకటనా చేయకుండా రైతులు పంటలు సాగు చేసిన తర్వాత డిసెంబర్ చివరి వరకు మాత్రమే నీరిస్తామని ప్రకటించారని చెప్పారు. మండల రైతులు, హంద్రీనీవా కింద సాగు చేసుకున్న రైతులు నష్టపోతారని ఆవేదన వ్యక్తం చేశారు. టిడిపి నాయకులు బండ్లయ్య, మలకన్న, సిపిఎం నాయకులు యూసుఫ్ బాషా, అశోక్, సిపిఐ నాయకులు సుల్తాన్, మధుబాబు, రవికుమార్, వీరన్న, మురళీ పాల్గొన్నారు.

పంట నష్టపోయిన రైతులను ఆదుకోవాలి

- సిపిఐ, ఎఐకెఎస్ ఆధ్వర్యంలో రౌండ్ టేబుల్ సమావేశం

ప్రజాశక్తి-ఆలూరు

ఖరీఫ్‌లో అధిక వర్షాలతో, నకిలీ పత్తి విత్తనాలతో పంటలు నష్టపోయిన రైతులను ఆదుకోవాలని టిడిపి రైతు సంఘం రాష్ట్ర కార్యదర్శి సి.నారాయణ రెడ్డి, రైతుసంఘం (సిపిఐ) జిల్లా అధ్యక్షులు లక్ష్మణ్ రెడ్డి, రైతు సంఘం (సిపిఎం) మండల కార్యదర్శి ఈరన్న కోరారు. సోమవారం ఆలూరు జూనియర్ కళాశాల ఆడిటోరియంలో సిపిఐ మండల కార్యదర్శి రామాంజనేయులు అధ్యక్షతన రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. ప్రస్తుత ఖరీఫ్ సీజన్‌లో సకాలంలో వర్షాలు రావడంతో రైతులు ప్రధాన పంటలైన ఉల్లి, మిరప, వరి, పత్తి, వేరుశనగ, కంది, ఆముదం, జొన్న, కొర్ర తదితర పంటలు సాగు చేశారని తెలిపారు. పంటలు ఆశాజనకంగా ఉండి చేతికొచ్చే సమయంలో అక్టోబర్‌లో అధిక వర్షాలు కురవడంతో పంటలు కుళ్లిపోవడం, మొలకలు రావడంతో రైతులు తీవ్రంగా నష్టపోయారని చెప్పారు. జిల్లాలో నకిలీ పత్తి విత్తనాల దందా ఆగడాలు ఎక్కువయ్యాయని తెలిపారు. పంట పెరిగాక కేవలం మొక్కలు మాత్రమే ఉన్నాయని, కాయలు లేవని అన్నారు. జిల్లాలో అధికార పార్టీ ప్రజాప్రతినిధులే నకిలీ విత్తనాలను విక్రయిస్తున్నారని తెలిపారు. అమ్మకందారులను ప్రోత్సహించడం దుర్మార్గపు చర్య అని ఆగ్రహం వ్యక్తం చేశారు. గ్రామీణ ప్రాంతాల్లో ఆర్‌బికెలు కూడా రైతుల సమస్యలు పరిష్కరించడంలో విఫలమయ్యాయని విమర్శించారు. పంట నష్టపరిహారాన్ని అంచనా వేసేందుకు కేంద్ర పరిశీలన బృందం జిల్లాలో పర్యటించాలని, పంటల బీమా పథకం పూర్తి స్థాయిలో అమలు చేయాలని కోరారు. ఖరీఫ్ సీజన్‌లో రైతులు బ్యాంకుల్లో తీసుకున్న పంట రుణాలను మాఫీ చేయాలని డిమాండ్ చేశారు. సిపిఐ, ఎఐకెఎస్ ఆధ్వర్యంలో జిల్లాలో 4 బృందాలుగా ఏర్పడి ఈనెల 16 నుంచి 20 వరకు జరిగే రైతు రక్షణ కాలినడక యాత్రలో ప్రజలు, రైతులు పాల్గొని జయప్రదం చేయాలని కోరారు. సిపిఎం నాయకులు కెపి.నారాయణస్వామి, సిపిఐ నాయకులు భూపేష్, జనసేన నాయకులు ఛత్రపతి, సిపిఐ టౌన్ సెక్రటరీ మునిస్వామి, రైతు సంఘం మండల కార్యదర్శి హోతూరప్ప, గోపాల్, ఎఐటియుసి తాలూకా అధ్యక్షులు శివ, సిద్ధ, తెలుగు యువత జిల్లా అధికార ప్రతినిధి సురేంద్ర, ఎఐఎస్ఎఫ్ మండల అధ్యక్షులు దుర్గా నాయక్, సంతోష్, సాయికుమార్, రాజేష్ పాల్గొన్నారు.



మాట్లాడుతున్న టిడిపి రైతు సంఘం రాష్ట్ర కార్యదర్శి నారాయణరెడ్డి



వినతిపత్రం అందజేస్తున్న దివాకర్‌రెడ్డి

గంజాయి, డ్రగ్స్ సరఫరా చేసే వారిని అరెస్టు చేయాలి

- తెలుగు యువత జిల్లా ప్రధాన కార్యదర్శి పాలకుర్తి దివాకర్ రెడ్డి

ప్రజాశక్తి - మంత్రాలయం

సరిహద్దు ప్రాంతాల నుంచి యువత గంజాయి, డ్రగ్స్‌ను సరఫరా చేస్తున్నారని, వారిని వెంటనే అరెస్టు చేయాలని తెలుగు యువత జిల్లా ప్రధాన కార్యదర్శి పాలకుర్తి దివాకర్ రెడ్డి కోరారు. సోమవారం పోలీసు స్టేషన్‌లో ఎస్ఐ వేణుగోపాల్ రాజుకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. రాష్ట్రం నుంచే సరిహద్దులు దాటి దేశం మొత్తానికి గంజాయి సరఫరా అవుతోందని తెలిపారు. డ్రగ్స్ వినియోగానికి ప్రధాన కారణం నిరుద్యోగమన్నారు. జగన్మోహన్ రెడ్డి పాలనలో గంజాయి, డ్రగ్స్ మాఫియాకు రాష్ట్రం నిలయంగా మారిందని విమర్శించారు. అంతకుముందు దివాకర్ రెడ్డి ఆధ్వర్యంలో సుంకేశ్వరి గ్రామంలో 'ఇదేం ఖర్మ... మన రాష్ట్రానికి' నిర్వహించారు. రచ్చుమర్రి గ్రామంలో టిడిపి నాయకులు నరసింహులు ఆధ్వర్యంలో 'ఇదేం ఖర్మ' నిర్వహించారు. పన్నగ నాగశయన, విజయరామిరెడ్డి, సాయికుమార్ రెడ్డి, చిదానంద, ఏబు, తిక్కస్వామి గౌడు, లక్ష్మయ్య, రవి, నాగరాజు, శివ పాల్గొన్నారు.

జీతాలు చెల్లించకపోవడం దారుణం : యుటిఎఫ్

ప్రజాశక్తి - గోనెగండ్ల

ప్రభుత్వ ఉద్యోగులకు 14 రోజులు దాటినా నవంబర్‌కు సంబంధించిన జీతాలు, పెన్షనర్లకు పింఛన్లు చెల్లించకపోవడం దారుణమని యుటిఎఫ్ జిల్లా కార్యదర్శి ఎస్.నరసింహులు తెలిపారు. సోమవారం గోనెగండ్లలో యుటిఎఫ్ మండల అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు యు.చంద్రపాల్, జి.రామన్ ఆధ్వర్యంలో సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ... డిసెంబరులో 14 రోజులు గడిచినా ఉద్యోగులకు జీతాలు అందకపోవడం వల్ల ఉద్యోగులు, కుటుంబాలు ఇబ్బందులు పడుతున్నాయని తెలిపారు. రాఘవేంద్ర, జిక్రియ, వెంకటరమణ, విజయ్ కుమార్, శంకర్ నాయక్, నాగేశ్వర రావు, బాబు, ఖాజన్న, అక్బర్, హుస్సేన్, లక్ష్మణ్, సుంకన్న, మద్దిలేటి, నాగరాజు పాల్గొన్నారు.

బయో మాయ..!

- అనుమతి లేకుండా జోరుగా నకిలీ ఎరువుల విక్రయాలు

విత్తనం విత్తింది మొదలు.. కోతలు కోసే వరకు రైతులు దగా పడుతూనే ఉంటారు. అక్రమార్జనే ధ్యేయంగా కొందరు చేసే నకిలీ విత్తనాలు, ఎరువులు, పురుగుమందుల వ్యాపారంతో రైతులు కుదేలవుతున్నారు. గ్రామీణ ప్రాంతాల్లోని రైతులను లక్ష్యంగా చేసుకుంటున్న కొందరు వ్యాపారులు విత్తనాల సమయంలో, ఎరువులు వేసే సమయంలో తమ దందా సాగిస్తూ దగా చేస్తున్నారు. ప్రస్తుతం ఎరువులు, పురుగుమందుల వేసే సీజన్ కావడంతో బయో ఫెర్టిలైజర్ కెమికల్ పేరుతో జిల్లాలో అనుమతి లేని నకిలీలను తెరచాటున అమ్మకాలు చేపడుతున్నారు.

ప్రజాశక్తి-ఆదోనిరూరల్

కర్నూలు కేంద్రంగా ఉత్పత్తులను మార్కెట్‌లోకి తెస్తున్న కొన్ని కంపెనీలు జిల్లాలోకి ప్రవేశిస్తున్నాయి. గ్రామాల్లో తమకు అనుకూలమైన కొందరు వ్యాపారులను గుర్తించి, లైసెన్సులు లేని వారికి ఈ బయో ఎరువులు, కెమికల్స్ పంపించి వారి ద్వారా రైతులకు విక్రయిస్తున్నారు. ఈ నేపథ్యంలో ఉమ్మడి జిల్లాలో ఈ నకిలీ బయో ఫెర్టిలైజర్స్ వ్యాపారం జోరుగా సాగుతోంది. కొందరు వ్యాపారులు సంప్రదాయబద్ధంగా వాడుతున్న ఎరువులు కాకుండా బయోఎరువులు, కెమికల్స్ వాడాలని ప్రోత్సహిస్తున్నారు. అమ్మకాలను బట్టి కమీషన్లు ఇస్తుండడంతో బయోఎరువులు, రసాయనాలతో పాటు ఇతర పోషకాలు నేరుగా మొక్కకే అందుతాయని, కాయ, పూత ఉంటుందని, ఉత్పత్తులు అధికంగా వస్తాయని, చీడపీడలు రావని ప్రచారం సాగిస్తూ రైతులను ఆకట్టుకుంటున్నారు. తెరచాటున సాగుతున్న బయో ఎరువులు, రసాయనాలు, ఇత్తర ఉత్పత్తుల వ్యాపారం గుట్టు రట్టు కావడంతో మండలంలోని పెసలబండ గ్రామంలో అధికారులు సోమవారం దాడులు చేపట్టారు.

బయో ఉత్పత్తుల పట్టివేత

అనుమతి లేని ఎరువులు, మందులను గ్రామాల్లో రైతులకు అంటగడుతున్న ఓ ముఠా దందాను ఆదోని మండలం పెసలబండ గ్రామంలో వ్యవసాయాధికారులు పట్టుకున్నారు. డివిజన్ వ్యవసాయ శాఖ అధికారి గిరీష్, ఎఒ పాపిరెడ్డి వివరాల మేరకు... పెసలబండ గ్రామంలోని సిహెచ్.వెంకట్రావు నివాసంలో అనుమతులు లేని బయో ఉత్పత్తులను పట్టుకున్నారు. రెవెన్యూ, పోలీసు వారి సహకారంతో రూ.6.31 లక్షల విలువ గల ఉత్పత్తులను పంచనామ నిర్వహించి సీజ్ చేశారు. దాదాపు 9 రకాల బయో ఉత్పత్తుల నమూనాలు సేకరించి ల్యాబ్‌కు పంపారు.



నకిలీ ఎరువులు, మందులను పరిశీలిస్తున్న వ్యవసాయ శాఖ

వాడీవేడిగా మండల సమావేశం

- నీటి సమస్యను పరిష్కరించాలని ప్రజాప్రతినిధులు బైఠాయింపు
- అధికారుల తీరుపై ఆగ్రహం

ప్రజాశక్తి - ఆస్పరి

ఆస్పరి మండల సర్వసభ్య సమావేశం రసాభాసగా సాగింది. గ్రామాల్లో నెలకొన్న నీటి సమస్య పరిష్కరించాలని టిడిపి ప్రజాప్రతినిధులు నరసప్ప, రహీంతుల్లా బైఠాయించారు. సోమవారం మండల పరిషత్ కార్యాలయంలో ఎంపిపి సుంకర ఉమాదేవి అధ్యక్షతన మండల సర్వసభ్య సమావేశం వాడీవేడిగా సాగింది. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. గ్రామాల్లో నెలకొన్న తాగునీటి సమస్య పరిష్కారం కోసం జలజీవన్ ద్వారా ఇంటింటికీ కుళాయి కనెక్షన్ ఇవ్వాలని టిడిపి ఎంపిటిసి నరసప్ప డిమాండ్ చేశారు. ఎంపిడిఒ మాట్లాడుతూ... జలజీవన్ ద్వారా ఇంటింటికీ కుళాయి మంజూరయ్యేలా చూస్తామన్నారు. తొగలగల్లు సర్పంచి అంజినయ్య మాట్లాడుతూ... పంచాయతీ పరిధిలో పూరి గుడిసెల్లో నివాసం ఉంటున్న 40 మంది నిరుపేదలకు నూతన గృహాలు మంజూరు చేయాలని హౌసింగ్ అధికారుల చుట్టూ తిరిగినా పట్టించుకోవడం లేదని తెలిపారు. అధికార పార్టీ నాయకులకు మాత్రం ఆగమేఘాల మీద ఆన్‌లైన్‌లో నమోదు చేస్తున్నారని చెప్పారు. విచారణ చేపట్టి బాధ్యులపై చర్యలు తీసుకుంటానని ఎంపిడిఒ మల్లేశ్వరి హామీ ఇచ్చారు. డి.కోటకొండ సిపిఐ ఎంపిటిసి అటికెలగుండు రంగమ్మ మాట్లాడుతూ... గ్రామంలో ఎక్కడి సమస్యలు అక్కడే తిష్ట వేశాయని తెలిపారు. సిసి రోడ్లు, డ్రెయినేజీలు లేకపోవడంతో మురుగునీరు రోడ్లపైకి చేరి దుర్వాసన వెదజల్లుతోందని చెప్పారు. గ్రామానికి వచ్చే ప్రధాన రహదారి గుంతలమయంగా మారడంతో ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తెలిపారు. 'గడపగడపకు' కార్యక్రమంలో మంత్రి దృష్టికి తీసుకెళ్లినా పరిష్కారం కాలేదని చెప్పారు. రెవెన్యూ కార్యాలయం అవినీతికి నిలయంగా మారిందని తెలిపారు. మండలాన్ని కరువుగా ప్రకటించి సహాయక చర్యలు చేపట్టాలని, ఎంపిటిసిల గౌరవ వేతనం రూ.20 వేలకు పెంచాలని సభను వాకౌట్ చేసి, కింద కూర్చొని నినాదాలు చేస్తూ నిరసన వ్యక్తం చేశారు. ఎంపిపి సుంకర ఉమాదేవి మాట్లాడుతూ... గ్రామాల్లో నెలకొన్న సమస్యల పరిష్కారానికి ప్రతి మూడు నెలలకోసారి సమావేశం నిర్వహిస్తున్నామని తెలిపారు. డిప్యూటీ తహశీల్దార్ రమణబాబు పాల్గొన్నారు.



సమావేశంలో బైఠాయించిన ప్రజాప్రతినిధులు